www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 20-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) :23 సంచిక (Issue) : 173 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: చతుర్దశి రా.12.17 తదుపరి అమావాస్య, నక్షత్రం: మఖ ఉ.8.06 తదుపరి పుబ్బ, వర్జ్యం: సా.4.34-6.16, దుర్ముహూర్తం: ఉ.6.07-7.43, అమృతఘడియలు: రా.2.45-4.26, రాహుకాలం: ఉ. 9.00-10.30, సూర్యోదయం: 6.07, సూర్యాస్తమయం: 6.09 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



మావోయిస్టుల చెరో మాట!

సంక్షోభ, సంక్లిష్ట సమయంలో బయటపడిన విభేదాలు

పార్టీ వైఖరిని విమర్శిస్తూ మల్లోజుల వేణుగోపాలరావు లేఖ

సాయుధ పోరాటం తాత్కాలిక విరమణకు ప్రతిపాదన 10

నెల రోజుల సమయం ఇవ్వాలని కేంద్రప్రభుత్వానికి లేఖ

దీనిని వ్యతిరేకిస్తూ తెలంగాణ కమిటీ ప్రతినిధి జగన్ ప్రకటన

సాయుధ పోరాటం విరమణ ఆయన సొంత అభిప్రాయం

సాయుధపోరాటంతో ముందుకెళ్లడమే తక్షణ కర్తవ్యమని స్పష్టం

మల్లోజుల ఎక్కడ!?.. ఆయన ఉనికిపై అనుమానాలు



దసరా నాటికి ప్రత్యక్ష విచారణ!

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు స్పీకర్ మళ్లీ నోటీసులు 12

వారంలో అఫిడవిట్ రూపంలో వివరణ ఇవ్వాలని ఆదేశం

ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఇప్పటికే నోటీసు

ఇరువైపుల నుంచి అఫిడవిట్లు అందగానే ప్రత్యక్ష విచారణ

ముస్లింలకు ఆర్థిక భరోసా

చిరు వ్యాపారులకు రూ.50 వేలు

ఫకీర్, దూదేకుల వర్గాలకు మోపెడ్, లక్ష గ్రాంట్ 13

ఫిరాయింపు ఎక్కడిది?

వారి జీతంలో నెలకు 5 వేలు ఇప్పటికీ బీఆర్ఎస్‌కు ఫండ్‌గా వెళ్తోంది

బీఆర్ఎస్‌కు 37 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని హరీశ్‌రావే అసెంబ్లీలో స్వయంగా ప్రకటించారు

ఎంతో మంది ఎమ్మెల్యేలు వచ్చి కలుస్తుంటారు

మర్యాదపూర్వకంగా కండువాలు కప్పుతాం

మెట్రో రెండో దశకు ఎల్ అండ్ టీ సహకరించాల్సిందే

సీబీఐకేసులో కేసీఆర్‌ను రక్షించేందుకు కిషన్‌రెడ్డి యత్నం

నక్సలైట్లు మన అన్నదమ్ములే కదా! ఎందుకు చర్చించరు?

2018లోనే రాష్ట్రంలో ఓటు చోరీ.. రజత్ అంగీకారం

జీఎస్టీ సంస్కరణలతో తెలంగాణకు 7 వేల కోట్ల నష్టం

ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



ఢిల్లీలో పబ్లిక్ ఎఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా 12వ వార్షిక సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా తన వద్దకు పార్టీలకతీతంగా ఎంతో మంది ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల అభివృద్ధి కోసం వస్తుంటారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వారికి మర్యాదపూర్వకంగా కండువాలు కప్పుతామని, అందులో తప్పేముందని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు 37 మంది ఎమ్మెల్యేలు ఉన్నారంటూ ఆ పార్టీ నేత హరీశ్ గత అసెంబ్లీ సమావేశాల్లోనే అధికారికంగా చెప్పారని పేర్కొన్నారు. అలాంటప్పుడు ఇంకా ఫిరాయింపు ఎక్కడిదని ప్రశ్నించారు. అయినా.. పార్టీ ఫిరాయించారని ఆరోపిస్తున్న ఎమ్మెల్యేల నెల జీతం నుంచి నేటికీ బీఆర్ఎస్‌కు నెలకు రూ.5 వేల చొప్పున పార్టీ ఫండ్ వెళుతోందని చెప్పారు. ఇక వారు పార్టీ ఫిరాయించినట్టు ఎలా అవుతుందన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం స్పీకర్ వ్యవహరిస్తారని చెప్పారు. శుక్రవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సీఎం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. రాష్ట్రపతి, గవర్నర్ల అధికారాలకు సంబంధించి సుప్రీంకోర్టు నిర్ణయానికి అనుగుణంగానే తాము స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. "బీసీలకు 42% రిజర్వేషన్లకు సంబంధించి మూడు బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రపతి నిర్ణయం తీసుకునే గడువు అంశం సుప్రీంకోర్టులో ఉంది. దీనిపై సుప్రీంకోర్టు ఏం చెబుతుందో

మిగతా 13వ పేజీలో...

50 కోట్ల బ్లాక్‌మనీ ఉంది.. మారుస్తారా?

వైట్ చేసే మార్గాలు చెబితే రూ.కోటి ఇస్తా



కొందరు వ్యాపారులకు ఓ ఐఏఎస్ ఆఫర్

అధికారుల్లో హాట్ టాపిక్‌గా ఆయన వ్యవహార శైలి 10

అంత సంపదను ఎలా కూడగట్టారనే గుసగుసలు

సదరు ఐఏఎస్ ఇచ్చిన అనుమతులపై సర్కారు విచారణ!

ఐఏఎస్ పదోన్నతుల జాబితా వివరాలు అసమగ్రం

21 మందికిగాను 15 మంది అభ్యర్థుల వివరాలు సరిగా లేవు

వారికి సంబంధించిన ఏసీఆర్‌లు, కేసుల వివరాలు పంపండి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి యూపీఎస్సీ కార్యదర్శి నుంచి నోట్ 12

సీనియారిటీ ధ్రువీకరించిన కమిటీ వివరాలు, సభ్యుల ఫోన్ నంబర్లు,

కార్యదర్శి స్థాయి అధికారి సంతకంతో ధ్రువపత్రం ఇవ్వాలని స్పష్టీకరణ

ఇంజన్ ఆయిలే ఆహారం!

» రోజూ ఏడెనిమిది లీటర్ల వేస్ట్ ఇంజన్ ఆయిల్ తాగుతూ 33 ఏళ్లుగా దానితోనే బతుకుతున్న 'ఆయిల్ కుమార్'



బెంగళూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో ఇడ్లీనో, దోశనో.. మరేదైనా అల్పాహారమో తింటారు. కానీ.. కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాకు చెందిన కుమార్ మాత్రం చాలా స్పెషల్..! బ్రేక్‌ఫాస్ట్ కింద ఉదయాన్నే ఒక బాటిల్ వేస్ట్ ఇంజన్ ఆయిల్ తాగితే గానీ ఆయన రోజు మొదలవదు..! ఉదయం టీతో పాటు రోజు మొత్తమ్మీద ఆయన ఏడు, ఎనిమిది లీటర్ల ఇంజన్ ఆయిల్ లాగించేస్తాడు. ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం..! ఒకటి కాదు రెండు కాదు.. 33 ఏళ్లుగా ఆయన ఇలాగే ఇంజన్ ఆయిల్ తాగి బతుకుతున్నాడు. వాహనాలకు ఇంజన్ ఆయిల్ మార్చినప్పుడు వచ్చే వేస్ట్ ఆయిల్‌ను తాగుతూ 'ఆయిల్ కుమార్'గా పేరు తెచ్చుకున్నాడు. ఇప్పుడు ఆయన గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో వైరల్ అవుతోంది. ఏడాదిలో సగంరోజులు అయ్యప్ప స్వామి దీక్షలో గడిపే కుమార్.. ఇంజన్ ఆయిల్ తాగుతున్నా ఎప్పుడూ అనారోగ్యం పాలవలేదు. ఆస్పత్రులకు వెళ్లలేదు. దానికి అయ్యప్పస్వామిపై తనకున్న విశ్వాసమే కారణమని కుమార్ చెబుతున్నాడు.

దేశవ్యాప్తంగా 474 రాజకీయ పార్టీల రద్దు!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా గుర్తింపు లేని నమోదిత రాజకీయ పార్టీలపై మరోసారి చర్యలు చేపట్టింది. నిబంధనలు ఉల్లంఘించిన 474 పార్టీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. గత ఆరేళ్లలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. తొలి దశలో భాగంగా ఆగస్టు 9న 334 పార్టీలను రద్దు చేసిన విషయం తెలిసిందే. 'రెండో దశలో భాగంగా 474 గుర్తింపు లేని నమోదిత రాజకీయ పార్టీలను ఈ నెల 18న జాబితా నుంచి తొలగించాం. గత ఆరేళ్లుగా ఎన్నికల్లో పోటీ చేయకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నాం. దీంతో గత రెండు నెలల వ్యవధిలో మొత్తంగా 808 రాజకీయ పార్టీలను రద్దు చేశాం" అని ఈసీ శుక్రవారం తెలిపింది. ఇప్పటివరకు 2520 గుర్తింపు లేని నమోదిత రాజకీయ పార్టీలు ఉండగా, తాజా తొలగింపుతో ఈ సంఖ్య 2046కు తగ్గిందని తెలిపింది. అత్యధికంగా యూపీలో 121 పార్టీలను, మహారాష్ట్రలో 44, తమిళనాడులో 42, ఢిల్లీలో 40, పంజాబ్‌లో 21, మధ్యప్రదేశ్‌లో 23, బిహార్‌లో 15, ఆంధ్రప్రదేశ్‌లో 17 పార్టీలను రద్దు చేసినట్లు వివరించింది. ప్రస్తుతం దేశంలో గుర్తింపు పొందిన ఆరు జాతీయ పార్టీలు, 67 ప్రాంతీయ పార్టీలు ఉన్నాయని ఈసీ వెల్లడించింది.

సొంత ఖాతాలకు విమానాశ్రయాల నిధులు

» 250 కోట్లు మళ్లించుకున్న ఏఏఐ సీనియర్ మేనేజర్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: సంస్థ నిధులను సొంతానికి వాడుకున్న ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సీనియర్ మేనేజర్ (ఫైనాన్స్) రాహుల్ విజయ్ అక్రమాల్లో మరికొన్నింటిని సీబీఐ వెలుగులోకి తెచ్చింది. మొత్తం రూ.250 కోట్ల మేర కుంభకోణానికి పాల్పడినట్టు గుర్తించింది. డెహ్రాడూన్ విమానాశ్రయంలో రూ.232 కోట్ల నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై రెండు వారాల క్రితం ఆయనను అరెస్టు చేసింది. అంతకుముందు జైపూర్‌లో 2024-25 మధ్య పనిచేసినప్పుడు మరో రూ.18.12 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని సీబీఐ తాజాగా తెలిపింది. ఈ మేరకు బుధవారం కోర్టులో అఫిడవిట్‌ను సమర్పించింది. తన హోదాను దుర్వినియోగం చేసి స్టేటుబ్యాంకులో ఉన్న ఏఏఐ ఖాతాల నుంచి యాక్సిస్ బ్యాంకు, స్టేట్ బ్యాంకుల్లోని తన సొంత ఖాతాలకు మళ్లించుకున్నట్టు గుర్తించింది. వివిధ రకాల ఖర్చులు చూపించి, ఏఏఐ ఉద్యోగుల పేరున తన సొంత ఖాతాలకు నిధులు బదిలీ చేయించుకున్నారు. ఏఏఐ ఖాతాలన్నీ తన ఆధీనంలోనే ఉండడంతో అక్రమాలు చేయగలిగినట్టు ఆరోపించింది.

ఢిల్లీ వర్సిటీ ఎన్నికల్లో ఏబీవీపీ ఘన విజయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికల్లో ఏబీవీపీ సత్తా చాటింది. యూనియన్ అధ్యక్ష పదవితో పాటు కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులను గెలుచుకుంది. కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంస్థ ఎన్‌ఎస్‌యూఐ ఉపాధ్యక్ష పదవి దక్కించుకుంది. ఏబీవీపీ తరఫున ఆర్యన్ మాన్ డీయూఎస్‌యూ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఏబీవీపీకి చెందిన కునాల్ చౌధరి కార్యదర్శిగా, దీపికా ఝా సంయుక్త కార్యదర్శిగా గెలిచారు. ఎన్‌ఎస్‌యూఐకి చెందిన రాహుల్ ఝాంస్లా ఉపాధ్యక్షుడిగా విజయం సాధించారు. వామపక్షాలకు చెందిన స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆల్‌ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయాయి. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్ష, సంయుక్త కార్యదర్శి పదవులు దక్కించుకుంది. మరోవైపు తాజా గెలుపొందిన ఏబీవీపీ నేతలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా తదితరులు అభినందించారు.

'ఏఐ' ముఖ గుర్తింపుతో అభ్యర్థుల ధ్రువీకరణ

» కొత్త సాంకేతికతను ప్రవేశపెట్టిన యూపీఎస్సీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: పరీక్షల ప్రక్రియ సమగ్రతను బలోపేతం చేసే దిశగా యూపీఎస్సీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వేగవంతమైన, సురక్షితమైన అభ్యర్థుల ధ్రువీకరణ కోసం ఏఐ ఆధారిత ఫేషియల్ అథెంటికేషన్ (ముఖ ప్రామాణీకరణ) సాంకేతికతను ప్రవేశపెట్టింది. ఈ ఏఐ ఆధారిత వ్యవస్థను పరీక్షించేందుకు చేపట్టిన పైలట్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు యూపీఎస్సీ చైర్మన్ అజయ్‌కుమార్ శుక్రవారం ప్రకటించారు. జాతీయ ఈ-గవర్నెన్స్ విభాగం (ఎన్‌ఈజీడీ) భాగస్వామ్యంతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈనెల 14న నిర్వహించిన పలు ఉద్యోగ పరీక్షల్లో ఏఐ ఆధారిత ఫేషియల్ అథెంటికేషన్‌ను గురుగ్రామ్‌లోని ఎంపిక చేసిన కొన్ని కేంద్రాల్లో పరీక్షించామని, అక్కడ తీసిన ముఖ చిత్రాలు.. అభ్యర్థులు దరఖాస్తుల్లో సమర్పించిన ఫొటోలతో డిజిటల్‌గా సరిపోలాయన్నారు.

అవును..'సిందూర్'తో దెబ్బతిన్నాం

» లష్కరే తాయిబా కమాండర్ ఒప్పుకోలు

ఇస్లామాబాద్, సెప్టెంబరు 19: ఆపరేషన్ సిందూర్ దెబ్బకు కుదేలైన ఉగ్రవాద సంస్థలు ఒక్కొక్కటిగా ఈ వాస్తవం అంగీకరిస్తున్నాయి. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్ర స్థావరాలను ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఈ ఏడాది మే ఏడోతేదీన భారత బలగాలు కూల్చివేసిన విషయం తెలిసిందే. ఇందులో మురిద్కేలోని మర్కజ్ ఇ తాయిబాలోని లష్కరే ప్రధాన స్థావరం ఒకటి. భారత్ జరిపిన దాడిలో తమ స్థావరం నేలమట్టమైందని లష్కరే కమాండర్ ఖాసిం అంగీకరించాడు. దీనిపై ఆయన ఒక వీడియో విడుదలచేశాడు. "ప్రధాన స్థావరం మర్కజ్ ఇ తాయిబా శిథిలాలపై నేను నిలబడ్డాను. భారత బలగాల దాడుల్లో ఇది ధ్వంసమైంది. దీనిని పునర్నిర్మాణం చేసే పనులు కొనసాగుతున్నాయి. దేవుని అనుగ్రహంతో గతంలోని నిర్మాణం కంటే కూడా పెద్దగా దీనిని నిర్మిస్తాం." అని ఖాసిం తెలిపాడు. ఎంతో మంది ఉగ్రవాదులు ఇక్కడ గతంలో శిక్షణ పొందారని చెప్పాడు.

బెంగళూరులో గుంతలు పెద్ద సమస్య కాదు

» 'బ్లాక్ బక్' వివాదంపై కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్

బెంగళూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలు ఎవరైనా బెంగళూరును వీడాలని అనుకుంటే వెళ్లిపోవచ్చని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. నాసిరకం రహదారుల కారణంగా ఇబ్బంది పడుతున్నామని, బెంగళూరును వీడతామని బ్లాక్ బక్ కంపెనీ సీఈవో రాజేశ్ యబాది ఎక్స్‌లో పెట్టిన పోస్టు, తదనంతర పరిణామాలపై ఆయన గురువారం స్పందించారు. వర్షాల వల్ల ఏర్పడిన గుంతల విషయంలో కుట్రలు జరుగుతున్నాయని, విద్యార్థులతో కొందరు ప్రధానికి లేఖలు రాయిస్తారని అన్నారు. బెంగళూరులో గుంతలు పెద్ద సమస్య కాదని, కానీ ఇదే పెద్ద సమస్య అన్నట్లు వ్యవహరిస్తున్నారని శివకుమార్ తెలిపారు.

ఓట్ల చోరీని.. భారత జెన్-జీ అడ్డుకుంటుంది!



రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని యువత, విద్యార్థులే కాపాడుకుంటారు

» వారి పోరాటానికి అండగా ఉంటా: రాహుల్.. ఇది అంతర్యుద్ధాన్ని ప్రేరేపించడమే: బీజేపీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: భారత్‌లోనూ జెన్-జీ ఓట్ల చోరీని అడ్డుకుంటుందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్య రాజకీయ దుమారం రేపింది. ఓట్ల దొంగలను ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ రక్షిస్తున్నారని గురువారం ప్రత్యక్ష దాడికి దిగిన ఆయన.. ఓట్ల చోరీని అడ్డుకోవాలని 2000వ సంవత్సరం దరిదాపుల్లో జన్మించిన విద్యార్థులు, జెన్-జీకి శుక్రవారం 'ఎక్స్'లో పిలుపిచ్చారు. 'ఈ దేశ యువత, ఈ దేశ విద్యార్థులు.. ఈ దేశ జెన్-జీ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటారు. ఓట్ల చోరీని అడ్డుకుంటారు. నేనెప్పుడూ వారికి అండగా నిలుస్తా' అని తెలిపారు. నేపాల్లో జెన్-జీ చేపట్టిన ఉద్యమం హింసాత్మకం కావడం.. 50 మందికిపైగా విద్యార్థులు మరణించడం.. తదనంతర పరిణామాల్లో కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం కుప్పకూలడం తెలిసిందే. రాహుల్ జెన్-జీ ప్రస్తావన తేవడంపై బీజేపీ మండిపడింది. ఇది నేపాల్ తరహా సంక్షోభాన్ని రెచ్చగొట్టడమేనని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే 'ఎక్స్'లో విమర్శించారు. 'భారత జెన్-జీ.. కుటుంబ రాజకీయాలకు, అవినీతికి, సైద్ధాంతిక అస్పష్టతకు వ్యతిరేకం. అనువంశిక రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తారు. నెహ్రూ, ఇందిర, రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీని చూసినవారు రాహుల్‌ను ఏ విధంగా భరిస్తారు? అవినీతికి వ్యతిరేకులైన యువత మిమ్మల్ని తరిమికొట్టకుండా ఉంటారా? జెన్-జీలో ఆగ్రహం పెల్లుబికితే ఈ దేశం వదిలి వెళ్లిపోవడానికి రాహుల్ సిద్ధంగా ఉండాలి. బంగ్లాదేశ్‌లో ఆందోళనకు దిగినవారు ఇస్లామిక్ రాజ్యం కోరుకుంటున్నారు. నేపాల్ యువత హిందూ రాజ్యం అడుగుతున్నారు. భారత్‌నూ వారు హిందూరాజ్యంగా మార్చవచ్చు. దేశం వీడిపోవడానికి రాహుల్ సన్నాహాలు చేసుకోవాలి' అని స్పష్టంచేశారు. అంతర్యుద్ధం రావాలని ఆయన కోరుకుంటున్నారని.. దేశాన్ని చీల్చడానికి సొరోస్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తున్నారని విమర్శించారు. మహారాష్ట్ర సీఎం, బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్ ఆయనపై మండిపడ్డారు. రాహుల్ 'అర్బన్ నక్సల్' అని.. దేశంలో అంతర్యుద్ధాన్ని రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ప్రజలు కాంగ్రెస్‌ను ఎన్నుకోకపోతుండడంతో.. ప్రత్యామ్నాయ మార్గాల్లో అధికారంలోకి రావాలన్నది రాహుల్ ఆలోచనగా ఉందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ మండిపడ్డారు. 'ప్రపంచంలోనే మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. రాహుల్‌ను ప్రజలెన్నుకోకపోవడం మా తప్పా? భారత్‌ను నేపాల్, బంగ్లాదేశ్‌లతో పోల్చుతూ చెత్త ప్రకటనలు చేస్తున్నారు. ఇలాంటి మనస్తత్వాలను భారతీయులు అంగీకరించరు. అరాచకం సృష్టించడానికి ఆయన ఇచ్చిన పిలుపును ప్రజలు ఆమోదించరు' అని స్పష్టంచేశారు.

ఈసీ.. చునావ్ కీ చౌకీదార్: రాహుల్

ఈసీపై రాహుల్ మళ్లీ ఆరోపణలకు దిగారు. దానిని 'చునావ్ కీ చౌకీదార్ (ఎలక్షన్ వాచ్‌మన్)'గా అభివర్ణించారు. 'వేకువన 4 గంటలకు నిద్ర లేస్తారు.. 36 సెకన్లలో రెండు ఓట్లు తొలగిస్తారు.. తర్వాత మళ్లీ నిద్రపోతారు.. ఓట్ల చోరీ జరుగుతున్నది ఇలాగే. చునావ్ కీ చౌకీదార్ మెలకువగానే ఉంటారు. ఓట్ల దొంగతనాన్ని చూస్తూనే ఉంటారు.. మళ్లీ దొంగలనే కాపాడుతుంటారు' అని శుక్రవారం 'ఎక్స్'లో ధ్వజమెత్తారు. ఓట్ల దొంగతనం ఎలా జరుగుతోందో గురువారం తాను చెప్పిన 36 సెకన్ల వీడియోను ఈ సందర్భంగా ఆయన షేర్ చేశారు.

నా ఫోన్ నంబర్‌ను రాహుల్ ఎలా బహిరంగపరుస్తారు?

ఆయనపై కేసు పెడతా: అంజనీ మిశ్రా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: ఓటు చోరీ అంశంపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ నిర్వహించిన విలేకరుల సమావేశంలో తన ఫోన్ నంబర్‌ను వెల్లడించడంపై అంజనీ మిశ్రా అనే వ్యక్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఓటు తొలగింపునకు గురైనట్లు, దీనిపై తాను ఈసీకి ఫిర్యాదు చేసినట్లు రాహుల్ చెప్పడం అవాస్తవమన్నారు. తాను ఎప్పుడూ ఈసీకి ఫిర్యాదు చేయలేదని తెలిపారు. పైగా, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన తనను మహారాష్ట్ర ఓటరుగా రాహుల్ చెప్పారని, తన జీవితంలో ఏనాడూ ఆ రాష్ట్రానికి కూడా వెళ్లలేదని అన్నారు. తన ఫోన్ నంబర్‌ను బహిరంగపరచడం వల్ల తనకు పెద్దసంఖ్యలో ఫోన్ కాల్స్ వస్తున్నాయని, తన ప్రైవసీకి భంగం వాటిల్లిందని పేర్కొన్నారు. ఈ అంశంపై రాహుల్‌గాంధీపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు.


పాక్‌లో హఫీజ్ సయీద్‌తో చర్చలకు మన్మోహన్ సర్కారే నన్ను పంపింది

» ఢిల్లీ హైకోర్టులో జేకేఎల్‌ఎఫ్ చీఫ్ యాసిన్‌మాలిక్ అఫిడవిట్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: జైల్లో ఉన్న జమ్ముకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జేకేఎల్ఎఫ్) చీఫ్.. యాసిన్ మాలిక్ గత నెల 25న ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన ప్రమాణపత్రంలో పలు సంచలన విషయాలను వెల్లడించారు. ముంబైపై 2006లో జరిగిన (26/11) దాడుల వెనుక సూత్రధారి హఫీజ్ సయీద్‌ను.. తాను అదే ఏడాది.. అప్పటి ఇంటెలిజెన్స్ బ్యూరో ప్రత్యేక డైరెక్టర్ వీకే జోషి అభ్యర్థన మేరకు పాకిస్థాన్‌లో కలిశానని అందులో పేర్కొన్నారు. పాకిస్థాన్ నుంచి ఢిల్లీకి తిరిగి రాగానే జోషి తనను ఒక హోటల్‌లో కలిసి అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కలిసి వివరాలు వెల్లడించాల్సిందిగా కోరినట్టు తెలిపారు. ఆయన అభ్యర్థన మేరకు అదే రోజు సాయంత్రం తాను మన్మోహన్‌సింగ్‌ను కలిశానని.. ఆ సమయంలో జాతీయ భద్రత సలహాదారు ఎన్‌కే నారాయణన్ కూడా మన్మోహన్‌తో ఉన్నారని పేర్కొన్నారు. సయీద్‌తో భేటీ గురించి వివరాలను తాను వారికి వెల్లడించానని తెలిపారు. అప్పుడు మన్మోహన్ తనకు కృతజ్ఞతలు తెలిపారని వెల్లడించారు. అప్పట్లో ఢిల్లీలో ఒక బాంబు పేలుడు జరిగిన నేపథ్యంలో.. అలా ఒకవైపు ఉగ్రవాదం కొనసాగుతుంటే మరోవైపు శాంతి చర్చలు సాగవు కాబట్టి ఐబీ అధికారులు తనను సంప్రదించి, సయీద్, ఇతర ఉగ్రవాద నేతలతో చర్చలు జరపాల్సిందిగా కోరారని వివరించారు. ఆ భేటీలు జరిగిన 13 ఏళ్ల తర్వాత.. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏ నిర్వీర్యానికి ముందు.. తనపై గతంలో పెట్టిన ఉపా కేసులను సమర్థించుకునేందుకు ఆ పాత సమావేశాన్ని వాడుకున్నారని వాపోయారు. తనపై ఉగ్రవాది అనే ముద్ర వేశారని.. ఇది నమ్మకద్రోహం తప్ప మరేమీ కాదని వాపోయారు. కశ్మీరీ రాజకీయ నాయకత్వాన్ని అణగదొక్కేందుకు, తమ సొంత అజెండాను అమలుచేసేందుకే ఇదంతా చేసినట్టు ఆరోపించారు.


లోకం తీరు



పాక్‌కు వెళ్తే సొంతింట్లో ఉన్నట్టుంది!

శాంతి, సామరస్యంతో ఎలా జీవించాలో నేపాల్, బంగ్లాదేశ్‌లను చూసి నేర్చుకోవాలి

శామ్ పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: "పాకిస్థాన్‌కు వెళ్తే.. సొంతింట్లో ఉన్నట్టుగా ఉంటుంది. నేపాల్, బంగ్లాదేశ్‌లలోనూ అలాంటి అనుభూతే కలుగుతుంది." అని కాంగ్రెస్ పార్టీ విదేశీ వ్యవహారాల నాయకుడు శామ్ పిట్రోడా వ్యాఖ్యానించారు. అంతేకాదు, పొరుగు దేశాలతో సఖ్యతగా మెలిగేలా భారత విదేశాంగ విధానంలో మార్పు రావాలని ఉచిత సలహా ఇచ్చారు. వాస్తవానికి ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడంతోపాటు పాక్ వారిని భారత్‌పైకి ఉసిగొల్పుతున్న విషయం తెలిసిందే. ఇక, ప్రజలు, విద్యార్థుల తిరుగుబాట్లతో నేపాల్, బంగ్లాదేశ్‌లలో ప్రభుత్వాలే కుప్పకూలాయి. అలాంటి దేశాలను ప్రశంసిస్తూ తాజాగా పిట్రోడా చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పిట్రోడా మాట్లాడుతూ.. "ఉగ్రవాదం, విధ్వంసాలు వంటి విషయాలను పక్కన పెట్టి పాకిస్థాన్, బంగ్లాదేశ్‌తో భారత్ చర్చించాలి. మన విదేశాంగ విధానం ఆయా దేశాలపై దృష్టి సారించాలి. నిజానికి మనం పొరుగు దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకున్నామా?. ఆయా దేశాలు ఇప్పటికే సమస్యలు ఎదుర్కొంటున్నాయి. అలాంటి వాటితో యుద్ధం అవసరం లేదు." అని వ్యాఖ్యానించారు. రాజకీయ దుమారంపై పిట్రోడా స్పందించారు. పొరుగుదేశాలతో భారత్‌కు ఉన్న ఉమ్మడి చరిత్రను నొక్కి చెప్పాలన్నదే తన ఉద్దేశమన్నారు.

భారత్, చైనా.. ఎవరికీ తలొగ్గవు

» రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్

మాస్కో, సెప్టెంబరు 19: అమెరికా అడ్డగోలు సుంకాలు, భారత్, చైనాలపై బెదిరింపులను రష్యా తీవ్రంగా తప్పుబట్టింది. భారత్, చైనా దేశాలు ఎవరికీ తలొగ్గే అవకాశమే లేదని స్పష్టం చేసింది. ఈ అంశంపై రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ రష్యా మీడియాతో మాట్లాడారు. "భారత్, చైనా రెండూ పురాతన నాగరికతలు ఉన్న దేశాలు. 'మీరు చేసేది మాకు నచ్చడం లేదు, ఆపేయండి, లేకుంటే మీపై సుంకాలు విధిస్తా'మనే తరహా బెదిరింపులు వారిపై పనిచేయవు. ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలు బలంగా ఉన్నాయన్న విషయాన్ని మర్చిపోయి.. బలవంతంగా ఎక్కువ ధరకు ఇతర దేశాల నుంచి చమురు కొనుగోలు చేయాలని అమెరికా ఒత్తిడి చేస్తోంది. ఇది నైతికంగా, రాజకీయంగా అమెరికాపై వ్యతిరేకత పెంచుతోందన్నది గుర్తించాలి" అన్నారు.

అక్టోబరులో ఆసియాన్ సమ్మిట్

» ట్రంప్, మోదీల భేటీపై అంచనాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19 : భారత్‌పై అమెరికా అధిక టారిఫ్‌లు విధించడంతో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న వేళ ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హాజరుకానున్న ఆసియాన్ సమ్మిట్‌పై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. మలేషియాలో అక్టోబరులో జరగనున్న ఈ సమ్మిట్ సందర్భంగా వీరిద్దరి మధ్య వ్యక్తిగత సమావేశం కూడా జరిగే అవకాశం ఉందని అంచనా. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ఈ నెల 16న ట్రంప్, మోదీల మధ్య ఫోన్ సంభాషణ చోటు చేసుకున్న నేపథ్యంలో ఈ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ నెలాఖరులో జరగనున్న యూఎన్ జనరల్ అసెంబ్లీ సమావేశానికి ప్రధాని అమెరికా వెళ్లబోవడం లేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఒక వేళ ఆసియాన్ సమ్మిట్ సందర్భంగా మోదీ, ట్రంప్‌ల మధ్య వ్యక్తిగత సమావేశం జరిగే పక్షంలో నవంబరులో భారత్‌లో జరిగే క్వాడ్ దేశాధినేతల సమావేశానికి కూడా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హాజరుకావచ్చు.

అమెరికా, చైనా..టిక్ టాక్ డీల్ ఓకే!

» జిన్‌పింగ్ అమెరికాకు వస్తారు: ట్రంప్

వాషింగ్టన్, సెప్టెంబరు 19: అమెరికాలో టిక్‌టాక్ సోషల్ మీడియా వేదికను తిరిగి అనుమతించే విషయంలో ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. అంతేకాదు త్వరలో చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌ను కలుస్తానని, చైనాకు కూడా వెళతానని పేర్కొన్నారు. శుక్రవారం జిన్‌పింగ్‌తో ఫోన్‌లో చర్చలు జరిపిన ట్రంప్.. అనంతరం తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్'లో పోస్టు పెట్టారు. "ఫోన్ చర్చలు బాగా జరిగాయి. టిక్‌టాక్ ఒప్పందాన్ని ఆమోదించాం. అక్టోబర్ చివర్లో దక్షిణకొరియాలో జరిగే ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార సంస్థ (ఏపీఈసీ) సదస్సులో జిన్‌పింగ్‌ను కలుస్తా. వచ్చే ఏడాది మొదట్లో చైనాలో పర్యటిస్తా. జిన్‌పింగ్ కూడా సరైన సమయంలో అమెరికాలో పర్యటిస్తారు" అని ట్రంప్ పేర్కొన్నారు. కాగా, ట్రంప్‌తో జరిగిన చర్చల్లో ఏకపక్ష వాణిజ్య ఆంక్షలు సరికాదని జిన్‌పింగ్ నొక్కిచెప్పారని జిన్హువా న్యూస్ పేర్కొంది.

పాక్-సౌదీ రక్షణ ఒప్పందంలోకి మరిన్ని దేశాలు?

ఖతార్, యూఏఈ చర్చలు జరుపుతున్నట్టు కథనాలు



న్యూఢిల్లీ, ఇస్లామాబాద్, సెప్టెంబరు 19: అణ్వాయుధాలు కలిగిన పాకిస్థాన్‌తో సౌదీ అరేబియా ఇటీవల వ్యూహాత్మక పరస్పర రక్షణ ఒప్పందం చేసుకుంది. గల్ఫ్, అరబ్ దేశాలు ఇజ్రాయెల్ సైనిక చర్యలపై ఆందోళన వ్యక్తం చేస్తుండగా.. మరిన్ని దేశాలు పాక్- సౌదీ ఒప్పందంలో భాగమవుతాయనే చర్చ మొదలైంది. ఖతార్, యూఏఈ ఇప్పటికే చర్చలు కూడా జరుపుతున్నాయని కథనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో సౌదీతో తాము చేసుకున్న రక్షణ ఒప్పందంలో మరిన్ని అరబ్ దేశాలు భాగమయ్యే అవకాశాలను కొట్టిపారేయలేమని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ పేర్కొన్నారు. సౌదీతో తాము చేసుకున్న ఒప్పందంలో మరో దేశం చేరకూడదనే షరతు లేదని వివరించారు. పాకిస్థాన్‌కు బలహీనతలు ఉండడంతో నాటో వంటి ఏర్పాట్లు ఉండాలని తాను ఎప్పట్నించో చెబుతున్నానని ఆసిఫ్ పేర్కొన్నారు. ముస్లిం ప్రజలు, ముస్లిం దేశాలు ఉన్న చోట సమష్టిగా దేశాలను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే, ఈ ఒప్పందం కింద అణ్వాయుధాలు వాడకూడదనే నిబంధన కూడా లేదని ఆసిఫ్ తెలిపారు. అయినా అణ్వాయుధాల విషయంలో పాక్ ఎప్పుడూ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడలేదని పేర్కొన్నారు. ఇరుదేశాల్లో ఏ దేశంపై దాడి జరిగినా ఉమ్మడిగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఆఫ్ఘానిస్థాన్ నుంచి అమెరికా వెళ్లిపోయాక తాలిబన్లు, బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ వంటి వారితో తాము పోరాడుతున్నామని ఆసిఫ్ వెల్లడించారు. ఆఫ్ఘాన్‌ను తమకు శత్రు దేశంగా అభివర్ణించిన ఆసిఫ్.. సౌదీ సైనికులకు పాక్ ఎప్పట్నించో శిక్షణ ఇస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు ఇదిలా ఉండగా సౌదీతో తమ వ్యూహాత్మక భాగస్వామ్యం ఎప్పట్లాగే కొనసాగుతుందని ఆశిస్తున్నట్లు భారత్ శుక్రవారం అభిప్రాయపడింది.

అఫ్ఘానిస్థాన్‌లోకి మళ్లీ అడుగు పెడతాం

బాగ్రాం స్థావరాన్ని స్వాధీనం చేసుకుంటాం

తాలిబాన్లకు అప్పగించడం పొరపాటే: ట్రంప్

వాషింగ్టన్, సెప్టెంబరు 19: అఫ్గానిస్థాన్‌లోకి తమ సైనిక దళాలను తిరిగి పంపాలని అమెరికా ఆలోచిస్తున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలతో తెలుస్తోంది. దాదాపు నాలుగేళ్ల క్రితం అఫ్గానిస్థాన్‌లో తమ సైన్యాన్ని ఉపసంహరించుకోవడం వల్ల కోల్పోయిన కీలకమైన బాగ్రాం సైనిక స్థావరాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఆయన ప్రకటించారు. గురువారం బ్రిటన్ పర్యటనలో భాగంగా ప్రధాని కీర్ స్టార్మర్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "బాగ్రాం స్థావరాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి మేం ప్రయత్నిస్తున్నాం. ఎందుకంటే వారికి మాతో కొన్ని అవసరాలున్నాయి. మీకు తెలిసినట్లుగానే చైనా అణ్వాయుధాలు తయారు చేసే ప్రాంతానికి అది కేవలం గంట వ్యవధిలోనే ఉంది. సైనిక పరంగా అత్యంత కీలకమైన ఆ వైమానిక స్థావరాన్ని గత అధ్యక్షుడు బైడెన్ తాలిబాన్‌లకు ఉచితంగా ఇచ్చేశారు. అలా జరగకూడదు." అని అన్నారు. అమెరికా సైనికులు మొదట అఫ్గానిస్థాన్‌ను వదిలివెళ్లాలని నిర్ణయించినా, ఆ స్థావరాన్ని మాత్రం తమతోనే ఉంచుకోవాలని అనుకున్నట్లు తెలిపారు. ఎందుకంటే అది ప్రపంచంలోని అతిపెద్ద వైమానిక స్థావరాలలో ఒకటని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ఈపీఎఫ్‌వో 'పాస్‌బుక్ లైట్'!

» ఇక ఉద్యోగుల భవిష్యనిధి సేవలన్నింటికీ ఒకే లాగిన్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) తన చందాదారుల కోసం సరికొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. 'పాస్‌బుక్ లైట్' పేరిట ప్రవేశపెట్టిన ఈ సదుపాయంతో ఉద్యోగులు ఈపీఎఫ్‌వో సేవలన్నీ ఒకే లాగిన్ ఐడీ ద్వారా సులభంగా పొందవచ్చు. ఇప్పటిదాకా వేర్వేరుగా ఉన్న లాగిన్‌లను ఒకే గొడుగు కిందకు తెస్తున్నట్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. దీనివల్ల 7 కోట్ల మంది చందాదారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రస్తుతం చందా వివరాలను తెలుసుకోవడానికి, లావాదేవీలను చూసుకోవడానికి, అడ్వాన్సు తీసుకోవడానికి, డబ్బును విత్ డ్రా చేసుకోవడానికి సభ్యులు పాస్‌బుక్ పోర్టల్‌లో లాగిన్ కావాల్సి ఉంటుంది. కొత్తగా తీసుకొచ్చిన సౌకర్యం ద్వారా సభ్యులు మెంబర్ పోర్టల్‌లో పొందుపరిచిన 'పాస్‌బుక్ లైట్' ద్వారా ఖాతా వివరాలను తెలుసుకోవచ్చు. ఇందు కోసం మెంబర్ పోర్టల్‌లోనే లింకు ఉంటుంది. దీని ద్వారా పాస్‌బుక్ వివరాలను సులభంగా పొందవచ్చు. పాస్‌బుక్ పోర్టల్‌లో లాగిన్ కావాల్సిన అవసరం లేదు. అయితే గ్రాఫిక్ వివరాలతో ఉండే పాస్‌బుక్ కోసం మాత్రం ప్రస్తుతమున్న పోర్టల్‌కు వెళ్లాల్సి ఉంటుంది. ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మారి పీఎఫ్‌ను బదిలీ చేసుకున్న తర్వాత సభ్యుడు తీసుకునే ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్‌ను ఇక నుంచి ఆన్‌లైన్ (ఎనెక్సర్ కే)లోనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రస్తుతం ఉద్యోగం మారిన సభ్యుడి పీఎఫ్ ఖాతాను ఆన్‌లైన్‌లో ఫాం-13 ద్వారా మారుస్తున్నారు. అది మారాక.. పాత పీఎఫ్ కార్యాలయం ఎనెక్సర్ కేను రూపొందించి, కొత్త కార్యాలయానికి పంపుతోంది. ఒకవేళ సభ్యుడు ఆ ధ్రువీకరణ పత్రం కావాలనుకుంటే ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కొత్త నిబంధనతో ఆ అవసరం లేదు. ఎనెక్సర్ కేను మెంబర్ పోర్టల్ నుంచి సభ్యుడే నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కొత్త సంస్కరణల వల్ల పీఎఫ్ బదిలీలు, సెటిల్‌మెంట్లు, అడ్వాన్సులు, రిఫండ్లు, అవసరమైన అనుమతుల ప్రక్రియ వేగవంతమవుతుందని కేంద్ర మంత్రి మాండవీయ చెప్పారు. ప్రస్తుతం ఈ అనుమతులను ప్రాంతీయ పీఎఫ్ కమిషనరు గానీ, ఆఫీస్ ఇన్‌చార్జి గానీ ఇచ్చేవారని, ఇకపై ఈ అధికారాలను సహాయ కమిషనర్లు, కింది స్థాయి అధికారులకు బదిలీ చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

బాను ముస్తాక్‌కు సుప్రీం గ్రీన్ సిగ్నల్

» మైసూరు దసరా ఉత్సవాలపై దాఖలైన పిటిషన్ కొట్టివేత

బెంగళూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మైసూరు దసరా ఉత్సవాలను ప్రారంభించేందుకు బుకర్ ప్రైజ్ విజేత బాను ముస్తాక్‌కు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆమెతో ఉత్సవాలను ప్రారంభించాలని కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది. బెంగళూరుకు చెందిన హెచ్‌ఎస్ గౌరవ్ దాఖలు చేసిన పిటిషన్‌ను ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఒక మతాన్ని అనుసరించే వ్యక్తి ఇతర మతాలకు సంబంధించిన వేడుకల్లో భాగస్వామ్యం కావడం రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన కాదని స్పష్టం చేసింది. ఒక మతానికి సంబంధించిన ధార్మిక కార్యక్రమాలను మరో మతం వారితో ప్రారంభించడం సరికాదని గౌరవ్ తరఫు న్యాయవాదులు వాదించారు. హిందూ మతానికి వ్యతిరేకంగా ఆమె గతంలో వ్యాఖ్యలు చేశారన్నారు. దసరా ఉత్సవాల్లో ఇతర మతాల వారు ఆ పూజలు చేయడం సాధ్యం కాదని తెలిపారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న ధర్మాసనం.. 2017లో ప్రముఖ కవి నిస్సార్ అహ్మద్ మైసూరు దసరా ఉత్సవాలను ప్రారంభించినప్పుడు పిటిషనర్ హక్కులు దెబ్బతినలేదా అని ప్రశ్నించింది. రాజ్యాంగ పీఠికను ఒకసారి చదవాలని సూచించింది.

రాజీనామానా.. స్వచ్ఛంద పదవీ విరమణా?

» ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డిపై దాఖలైన పిటిషన్‌లో వివరాల్లేవు

» పిటిషనర్‌పై హైకోర్టు అసంతృప్తి.. 3 వారాలకు వాయిదా

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ పి.వెంకట్రాంరెడ్డి ఆ పదవిలో కొనసాగడానికి అనర్హుడని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌లో సమగ్ర వివరాలు సమర్పించలేదని పిటిషనర్‌పై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. మాజీ ఐఏఎస్ వెంకట్రాంరెడ్డి ఎమ్మెల్సీ పదవికి పోటీ చేసే ముందు తన పదవికి రాజీనామా చేశారా? లేదా స్వచ్ఛంద పదవీ విరమణ చేశారా? అని పిటిషనర్ తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. అందుకు సంబంధించిన లేఖలు, ఆధారాలు లేవని పేర్కొంది. వెంకట్రాంరెడ్డి రాజీనామాను డీవోపీటీ ఆమోదించలేదని.. ఐఏఎస్ పదవికి రాజీనామా చేసే విషయంలో ఆయన నిబంధనలు పాటించలేదని.. రాజీనామా చేసిన రోజునే ఎమ్మెల్సీగా నామినేషన్ దాఖలు చేశారని.. ఆయన్ను ఎమ్మెల్సీ పదవికి అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ జె.శంకర్ తదితరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది రమేశ్ చిల్లా వాదిస్తూ.. వెంకట్రాంరెడ్డి రాజీనామా ఆమోదం పొందలేదని స్వయంగా డీవోపీటీ తమకు ఆర్టీఐ కింద వివరాలు ఇచ్చిందన్నారు. ఈసీ తరఫున అవినాశ్ దేశాయి వాదిస్తూ.. రాజీనామా అంశంలో తమ పాత్ర ఏమీ లేదన్నారు. వెంకట్రాంరెడ్డి రాజీనామాను ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని, అఖిలభారత సర్వీసు నిబంధనల ప్రకారం ఐఏఎస్ అధికారుల రాజీనామాను ప్రభుత్వం ఆమోదించవచ్చని తెలిపారు. స్పందించిన ధర్మాసనం పూర్తి వివరాలు లేకుండా విచారించడం వల్ల సమయం వృథా అవుతుందని అసంతృప్తి వ్యక్తం చేసింది. పూర్తి స్థాయి వివరాలు, ఆధారాలు సమర్పించేందుకు మరో మూడు వారాలు సమయం ఇస్తూ విచారణను వాయిదా వేసింది.

భాగ్యలక్ష్మి ఆలయం వద్ద బతుకమ్మ వేడుకలకు హైకోర్టు అనుమతి

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాత బస్తీలోని భాగ్యలక్ష్మి ఆలయం వద్ద ఈ నెల 23న బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడానికి హైకోర్టు అనుమతిచ్చింది. శాంతి భద్రతలను కాపాడడానికి షరతులు పాటించాలని పేర్కొంది. మహిళలు మాత్రమే పాల్గొనాలని.. నేర చరిత్ర ఉన్న వారు వేడుకలకు హాజరు కారాదని, వీఐపీలను అక్కడికి ఆహ్వానించరాదని ఆదేశించింది. సాయంత్రం 4 గంటల నుంచి 5.30 వరకు గంటన్నర పాటు వేడుకలు నిర్వహించుకోవాలని స్పష్టం చేసింది. ఆలయం వద్ద బతుకమ్మ వేడుకల నిర్వహణకు పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపి జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్.. వేడుకలకు అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. షరతులు ఉల్లంఘించినట్లయితే చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు ఉంటుందని స్పష్టం చేశారు.

హెక్టారుకు రూ.50వేల సాయం

» కష్టాల్లో ఉన్న ఉల్లి రైతుకు ఏపీ ప్రభుత్వం వరం

అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీలో ఉల్లి రైతులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ ఏడాది ధర పతనమై.. తీవ్రంగా నష్టపోతున్న ఉల్లి రైతులకు సాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఉల్లి పండించిన ప్రతి రైతుకూ హెక్టారుకు రూ.50వేల చొప్పున నగదు సాయం అందించాలని నిర్ణయించారు. దీంతో 24,218 మంది ఉల్లి రైతులకు లబ్ధి చేకూరనుంది. దీనివల్ల ప్రభుత్వంపై సుమారు రూ.100కోట్ల అదనపు భారం పడనుంది. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు శుక్రవారం రాత్రి ఉండవల్లిలోని సీఎం క్యాంప్ ఆఫీస్ వద్ద మీడియాకు వెల్లడించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 45,278 ఎకరాల్లో ఉల్లి సాగైంది. ఈ ఏడాది ధర పతనం కావడంతో క్వింటా రూ.600మించి పలకలేదు. దీంతో క్వింటా రూ.1,200 చొప్పున సుమారు ఒక లక్షా 39 వేల క్వింటాళ్ల ఉల్లిని మార్కెట్ జోక్యం ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసింది.

మర్మాంగాలపై దాడి చేసి భర్తను హత్యచేసిన భార్య

చివ్వెంల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పనీపాటా లేకుండా ఖాళీగా ఉండటమే కాకుండా తనను మానసిక, శారీరక వేధింపులకు గురిచేస్తుండటంతో కుమారుడితో కలిసి భర్తను హత్యచేసిందా భార్య. ఈ ఘటనను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు విఫలయత్నం చేసింది. సూర్యాపేట జిల్లా చివ్వెంలలో ఈ సంఘటన వెలుగుచూసింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలోని కుడకుడకు చెందిన పారెల్లి సురేశ్(40) లారీ డ్రైవర్. అతడి భార్య శైలజ సూర్యాపేటలోని ఓ కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తోంది. సురేశ్, ఆరునెలలుగా పనికి వెళ్లడం లేదు. మద్యానికి బానిసయ్యాడు. అప్పటి నుంచి భార్యకు వివాహేతర సంబంధాన్ని అంటగడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడు. 17న సురేశ్ మద్యం మత్తులో ఉన్న సమయంలో అతడి మర్మాంగాలపై శైలజ దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం కుమారుడి సాయంతో.. భర్త మెడకు చున్నీ బిగించి ఇనుప బొంగుకు మృతదేహాన్ని వేలాడదీసింది. మర్నాడు, తన భర్త ఉరేసుకొని చనిపోయాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోస్టుమార్టంలో సురేశ్‌ది ఆత్మహత్య కాదని తేలడంతో కుటుంబసభ్యులను పోలీసులు విచారించడంతో వాస్తవాలు వెలుగుచూశాయి. తల్లి, కుమారుడిని పోలీసులు అరెస్టు చేశారు. శైలజ కుమారుడు మైనర్ కావడంతో జువైనల్ జైలుకు తరలించారు.

విశాఖకు మిట్టల్ కంపెనీ

బళ్లారి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్టీల్ తయారీ, ఐరన్ ఓర్ తవ్వకాల్లో ప్రపంచవ్యాప్తంగా పేరున్న మిట్టల్ కంపెనీ కర్ణాటకను వీడుతామని ప్రకటించింది. అదేసమయంలో తమ పరిశ్రమను ఏపీలో నెలకొల్పుతామని తెలిపింది. కర్ణాటక ప్రభుత్వం ఏమాత్రం తమకు ప్రాధాన్యం ఇవ్వడంలేదని, ఇదేసమయంలో ఏపీలోని కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ పరుస్తున్న నేపథ్యంలో రాష్ట్రాన్ని వీడాలని నిర్ణయించుకున్నట్టు పేర్కొంది. వాస్తవానికి కర్ణాటకలోని బళ్లారి జిల్లాలో ఉన్న కుడితిని సమీపంలో పరిశ్రమల స్థాపనకు గత ప్రభుత్వం 2010లో 12,500 ఎకరాల భూమిని రిజర్వు చేసింది. బీఎస్ యడియూరప్ప సీఎంగా ఉన్న సమయంలో కేఐఏడీబీ ద్వారా ఈ భూములను సేకరించి, పరిశ్రమలకు కేటాయించారు. దీనిలో మిట్టల్ కంపెనీ 2,643 ఎకరాలను కొనుగోలు చేసింది.

అంపైరే అన్యాయానికి దిగితే..

కృష్ణా జలాల నీటి లెక్కలు తేల్చే టెలిమెట్రీలకు కృష్ణాబోర్డు బ్రేక్

» మాజీ చైర్మన్ అంగీకరించినా.. సభ్యుడి నిరాకరణ

» ఏపీ అంగీకారం మళ్లీ కావాలంటూ మెలిక



హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జలాశయాల నుంచి తరలించే కృష్ణా జలాలపై కచ్చితమైన సమాచారం కోసం రెండో దశలో టెలిమెట్రీలు పెట్టడానికి తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నానికి బ్రేక్ పడింది. కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) 9వ సమావేశంలో.. రెండో దశలో 9 చోట్ల టెలిమెట్రీలు పెట్టాలని తీర్మానం చేశారు. దీనికి రూ.7 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. దీనికి తెలంగాణ, ఏపీ సమానంగా నిధులు ఇవ్వాల్సి ఉంది. ఏపీ నిధుల విడుదలకు జాప్యం చేస్తుండటంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జోక్యం చేసుకొని... ఏపీ తన వాటా నిధులు ఇవ్వకపోతే మొత్తం వ్యయాన్ని తామే భరిస్తామని ప్రకటించారు. ఈ మేరకు బోర్డుకు లేఖ రాశారు. దాంతో టెండర్లు పిలవడానికి కనీసం రూ.4.15 కోట్లు కావాలని బోర్డు సమాచారం ఇవ్వగా... ఆ మేరకు నిధులు విడుదల చేసి, వీటిని టెలిమెట్రీలకు మాత్రమే వాడాలని ప్రభుత్వం బోర్డుకు గుర్తు చేసింది. మే నెలలోనే టెండర్ డాక్యుమెంట్ కూడా సిద్ధమైంది. అయితే, టెండర్ పిలిచే క్రమంలో.. బోర్డు సభ్యుడిగా నియమితులైన కమల్ కుమార్ జంగిడ్ ఈ ప్రక్రియను అడ్డుకున్నారు. రెండో దశ టెలిమెట్రీలకు ఏపీ సమ్మతి తెలిపితేనే టెండర్ పిలవాలని మెలిక పెట్టారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. వాస్తవానికి 2018 అక్టోబరు 9వ తేదీన జరిగిన బోర్డు 9వ సమావేశంలోనే తెలంగాణతోపాటు ఏపీ కూడా టెలిమెట్రీలకు సమ్మతి తెలిపింది. ఇప్పుడు మళ్లీ ఏపీ సమ్మతి కావాలంటూ బోర్డు సభ్యుడు మెలిక పెట్టడంపై ఆగ్రహం వ్యక్తమవుతుంది. కృష్ణాబోర్డు చైర్మన్‌గా పని చేసిన, ప్రస్తుతం కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) చైర్మన్‌గా ఉన్న అతుల్ జైన్ కూడా టెలిమెట్రీలు పెట్టడానికి అవసరమైన ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. చైర్మన్ ఆదేశించినా, స్వయంగా బోర్డు తీర్మానం చేసినా.. బోర్డు సభ్యుడు ప్రతిబంధకాలు సృష్టించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

లెక్కలు లేకుంటే ఎలా?

ఏ రాష్ట్రం ఏ మేరకు నీటిని తరలిస్తుంది? ఏ మేరకు వినియోగిస్తుంది? వంటి లెక్కలు తీసే బాధ్యత కృష్ణాబోర్డుదే. బచావత్ ట్రిబ్యునల్ కృష్ణా జలాలను గంపగుత్తగా ఉమ్మడి ఏపీకి కేటాయించింది. నిర్దిష్టంగా కేటాయింపులు కూడా లేవు. ప్రాజెక్టుల వారీగా, రాష్ట్రాల వారీగా కేటాయింపులు లేకపోవడంతో ఆ నీటిని ఎక్కడికైనా తరలించుకొని వినియోగించుకునే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉంది. ప్రస్తుతం కృష్ణా జలాల పంపిణీపై విచారణ జరుగుతున్నందున.. నీటి కేటాయింపులు చేసే దాకా నీటి లెక్కలు తీయాల్సి ఉంది. దీని కోసం రెండు రాష్ట్రాల మధ్య మధ్యవర్తిగా ఉండాల్సిన బోర్డు, టెలిమెట్రీలు పెట్టాల్సిన బాధ్యత నుంచి పక్కకు జరిగి... అడ్డుకునే స్థాయికి దిగజారటం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. కృష్ణాలో 50:50 శాతం నిష్పత్తితో నీటిని పంచాలని తెలంగాణ పట్టుబడుతున్న విషయం తెలిసిందే. నీటి పంపకాలపై రెండేళ్లుగా తెలుగు రాష్ట్రాల మధ్య ఎలాంటి ఒప్పందాలు కూడా లేవు. నీటి వాటా తేలే దాకా.. కృష్ణాబోర్డు మెంబర్ సెక్రటరీ, తెలుగు రాష్ట్రాల ఈఎన్‌సీలతో కూడిన త్రిసభ్య కమిటీకే నీటి పంపిణీ అధికారాలు ఇచ్చారు. కృష్ణా ట్రైబ్యునల్ విచారణ ముగించి... తీర్పు ఇస్తే శ్రీశైలం, సాగర్‌ల నిర్వహణ ప్రత్యేక అథారిటీ కిందికి వెళ్లనుంది. ఆ తర్వాత వాటాల మేరకు నీటి విడుదల జరుగనుంది. ఈ క్రమంలో టెలిమెట్రీలు నమోదు చేసే లెక్కలే నీటి వాటాకు ప్రామాణికం కానున్నాయి. దీనికి విరుద్ధంగా బోర్డు అడుగులు పడటంపై తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గురుకులాల్లో ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1500 సరిపోతాయా?

» రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలో చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ.1500 సరిపోతాయా? అని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రభుత్వ గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై శుక్రవారం మరోసారి చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదిస్తూ.. గురుకులాల్లో విద్యార్థులకు ఆహారం అందించే ముందు స్థానిక ప్రిన్సిపాల్ నేతృత్వంలోని కమిటీ సభ్యులు రుచి చూడాలని, ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ వాదిస్తూ.. గురుకులాలు, హాస్టళ్లలో ఉండే విద్యార్థుల సంక్షేమానికి సర్కారు కట్టుబడి ఉందన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.1500 చొప్పున ఖర్చు చేయాలన్న నిర్ణయం 2022 నాటిదని, నిధులు పెంచే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. మరోసారి ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలంది. గురుకులాల విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై నివేదిక సమర్పించాలని పేర్కొంటూ విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

వరవరరావు పిటిషన్ స్వీకరణకు సుప్రీంకోర్టు నిరాకరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బెయిల్ షరతుల్లో మార్పులు చేయాలంటూ ప్రముఖ కవి వరవరరావు దాఖలు చేసిన పిటిషన్‌ను స్వీకరించేందుకు శుక్రవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. భీమా కోరేగాం అల్లర్ల కేసులో అరెస్టయిన ఆయనకు అనారోగ్య కారణాల దృష్ట్యా గతంలో షరతులతో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. గ్రేటర్ ముంబయి దాటి బయటకు వెళ్లాలంటే ముందుగా ట్రయల్ కోర్టు అనుమతి తీసుకోవాలన్నది అందులో ఒకటి. ఈ నిబంధనను సడలించాలని ఆయన పిటిషన్ దాఖలు చేశారు. పరిశీలించిన జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌ల ధర్మాసనం దీనిని స్వీకరించడానికి ఇష్టం చూపించలేదు. వరవరరావు తరఫున సీనియర్ న్యాయవాది ఆనంద్ గ్రోవర్ వాదనలు వినిపిస్తూ 85 ఏళ్ల వయసు కావడంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తోందని తెలిపారు. గతంలో ఆయన బాగోగులను భార్య చూసేవారని, ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో ఉంటున్నారని చెప్పారు. ఆయనను చూసేవారు ఎవరూ లేరని తెలిపారు. కేసు విచారణ ఇప్పట్లో ముగిసే సూచనలు కనిపించడం లేదని అందువల్ల ఆయన ముంబయి దాటి వెళ్లేందుకు అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ "ముంబయిలోనే వైద్యం అందుతుంది. ఆయన ఆరోగ్యంపై ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటుంది. కావాలనుకుంటే ముంబయిలోని ట్రయల్ కోర్టుకే వెళ్లండి. మాకు ఇంట్రెస్ట్ లేదు" అని పేర్కొంది. హైదరాబాద్‌కు ఆయనను తరలించేందుకు తగిన కారణాలు కనిపించడం లేదని అభిప్రాయపడింది. షరతుల్లో మార్పులు చేయడంపై విచారణ జరపలేమని తెలిపింది.

ఓబుళాపురం అక్రమ మైనింగ్‌పై 'సుప్రీం' కమిటీ

» మాజీ జస్టిస్ సుధాంశు నేతృత్వంలో ఏర్పాటు

» హద్దుల గుర్తింపు, అక్రమ తవ్వకాల విస్తీర్ణం

» ప్రభుత్వానికి జరిగిన నష్టంపై అంచనా

» నివేదికకు 3 నెలల గడువు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. లీజు సరిహద్దులు గుర్తించి ఎంత మేరకు అక్రమ మైనింగ్ తవ్వకాలు జరిపారో తేల్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుధాంశు ధులియా నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కమిటీని నియమిస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. కమిటీ మూడు నెలల్లోగా నివేదిక సమర్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. కేసు తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరికి వాయిదా వేసింది. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన ఈ కమిటీకి చైర్మన్‌గా జస్టిస్ సుధాంశు ధులియా, సభ్యులుగా కేంద్ర పర్యావరణ సాధికార కమిటీ (సీఈసీ) నుంచి ఒకరు, కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి ఇద్దరు అధికారులు, ఏపీ అటవీ, పర్యావరణ శాఖ నుంచి ముగ్గురు అధికారులు ఉంటారు. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి, ఇరు రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, కర్ణాటక) సరిహద్దులను శాస్త్రీయంగా పరిశీలించనుంది. అక్రమ మైనింగ్ జరిగిన విస్తీర్ణాన్ని, తద్వారా ప్రభుత్వానికి వాటిల్లిన నష్టాన్ని అంచనా వేసి సుప్రీంకోర్టుకు సమగ్ర నివేదికను అందించనుంది.

డిజిటల్ అరెస్టు.. పార్ట్‌టైం జాబ్ పేరిట రూ. 88.12 లక్షలకు బురిడీ

ఇద్దరు హైదరాబాదీలు బలి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు పేరుతో ఓ వృద్ధుడి వద్ద రూ.80.64 లక్షలు, ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ ఆఫర్ అంటూ రూ.8.18 లక్షలు కొట్టేశారు సైబర్ కేటుగాళ్లు. హైదరాబాద్ సైబర్ క్రైం డీసీపీ ధార కవిత తెలిపిన వివరాల ప్రకారం హబ్సిగూడ వాసి రిటైర్డు బ్యాంకు ఉద్యోగి(83)కి.. ఇటీవల ట్రాయ్ నుంచి మాట్లాడుతున్నానంటూ ఒక వ్యక్తి ఫోన్ చేశాడు. 'మీ నంబర్ బ్లాక్ చేస్తున్నాం' అని చెప్పాడు. 'మయన్మార్, ఫిలిప్పీన్స్, కంబోడియా వంటి దేశాలకు అక్రమ మానవ రవాణా చేసినట్లు కేసులు నమోదయ్యాయని మాకు క్రైమ్ బ్రాంచి పోలీసులు చెప్పార'ని వీడియో కాల్‌లో పోలీసు డ్రస్సుల్లో ఉన్న వారిని ఢిల్లీ పోలీసులుగా పరిచయం చేశాడు. 'హవాలా లావాదేవీలకు పాల్పడినట్లు తేలడంతో మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింద'ని నకిలీ లెటర్ చూపారు. 'మీరు ఏ తప్పు చేయలేదని నిరూపించుకోవాలంటే మీ ఖాతాల్లోని డబ్బు ఆర్బీఐ ఖాతాకు బదిలీ చేయండి. ఆడిట్ చేసి మీకు ఏ సంబంధం లేదని తేల్చి, తిరిగి మీ ఖాతాల్లో మీ డబ్బు జమ చేస్తాం. అప్పటి వరకూ మీరు డిజిటల్ అరెస్టులో ఉంటారు. ఈ విషయం ఇంట్లో ఎవరికైనా చెబితే మాకు వెంటనే తెలుస్తుంది. కఠిన జైలుశిక్షతోపాటు భారీ జరిమాన విధిస్తారు' అని బెదిరించారు. వారు చెప్పిన ఖాతాలోకి ఆర్టీజీఎస్ ద్వారా రూ.80.64 లక్షలు జమ చేశాడు. తర్వాత ఫోన్ చేస్తే కాల్ కట్ చేయడంతో అనుమానం వచ్చిన బాధితుడు.. ఇదంతా సైబర్ మోసమని ఆలస్యంగా గుర్తించి సిటీ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పార్ట్‌టైం జాబ్ పేరిట 8 లక్షలు స్వాహా

పార్ట్‌టైం ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో వెతుకుతున్న చాంద్రాయణ గుట్ట యువకుడు(21)తో ఈ నెల 9న దివ్యా మెహతా అనే మహిళ వాట్సాప్ చాటింగ్ చేసి, తాను చెగ్ ఇండియా రిక్రూటింగ్ మేనేజర్‌నని పరిచయం చేసుకున్నది. 'మీ ప్రొఫైల్‌కు తగినట్లు గూగుల్ ఆన్‌లైన్ ఆడిటర్ ఉద్యోగం ఉంది. ఇంట్లో నుంచే మొబైల్ ఫోన్ నుంచి రోజూ రూ.3,000-5,000 మధ్య సంపాదించొచ్చు' అని నమ్మ బలికింది. ముందు లింక్‌ల ద్వారా కొన్ని రెస్టారెంట్ల వివరాలు పంపి.. వాటికి 5 స్టార్ రేటింగ్ ఇస్తే రూ.150 చొప్పున ఇవ్వడంతోపాటు మరో వ్యక్తిని సీనియర్ ఎగ్జిక్యూటివ్ అని పరిచయం చేసింది. పెట్టుబడి పెట్టి పనిచేస్తే ఎక్కువ లాభాలొస్తాయని నమ్మించడంతో బాధితుడు తొలుత రూ.1000 పెట్టుబడి పెడితే రూ.1,410 రావడంతో నమ్మకం కలిగి పలు దఫాలుగా పెట్టుబడి పేరుతో మనీ బదిలీ చేశాడు. మీ ఖాతాలో టెక్నికల్ సమస్య ఉందని, త్వరలో మీ ఖాతాలోకి మీ డబ్బు జమ అవుతాయని చెప్పడంతో నమ్మి పలు దఫాల్లో వేర్వేరు ఖాతాలకు రూ.8.18 లక్షలు బదిలీ చేశాడు. తన పెట్టుబడితోపాటు పని చేసిన డబ్బు ఇవ్వాలని బాధితుడు కోరితే.. మరో రూ.3 లక్షలు డిపాజిట్ చేస్తే డబ్బు ఇస్తామనడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

లద్దాఖ్‌పై 'చిన్నచూపు'

కోట్లాది ప్రజలకు జీవధారను అందిస్తున్న నదులకు జన్మ స్థలంగా ఉన్న లద్దాఖ్ 'మూడో ధ్రువం'గా పేరుపొందింది. అటువంటి సున్నిత కీలక ప్రాంతంలో పర్యావరణ పరంగా, జీవనరీతుల పరంగా తమ ప్రత్యేకతలను కాపాడుకునేందుకు దశాబ్దాలుగా లద్దాఖీలు స్వతంత్ర అస్తిత్వానికి ఆరాట పడుతున్నారు. దేశ సరిహద్దుల్లో, అందునా చైనా, పాకిస్థాన్ నడుమ ఉన్న ప్రాంతం కావడంతో పాలకులు వారి ఆకాంక్షను నెరవేర్చేందుకు సుముఖత చూపలేదు. 2019 అనంతరం మారిన పరిస్థితుల్లో వారి అస్తిత్వ ఆరాటాలు కొత్త శక్తిని సంతరించుకున్నాయి.

నిన్న మొన్నటి దాకా జమ్మూ–కశ్మీర్‌లో భాగంగా ఉండి ఇప్పుడు కేంద్ర ప్రాంతం (యుటి)గా ఉన్న లద్దాఖ్ ప్రజలు నాలుగు డిమాండ్లు చేస్తున్నారు: లద్దాఖ్‌కు ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి; భారత రాజ్యాంగం ఆరవ షెడ్యూల్‌లో లద్దాఖ్‌ను చేర్చడం; లద్దాఖ్‌కు ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు; లద్దాఖ్‌కు రెండు పార్లమెంటరీ సీట్లు (ఒకటి లేహ్‌కు, మరొకటి కార్గిల్‌కు) కోరుతున్నారు. విద్యా సంస్కర్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నాయకత్వంలో ఈ డిమాండ్లపై గత రెండు సంవత్సరాలుగా లద్దాఖ్ ప్రజలు పోరాడుతున్నారు. అవి న్యాయబద్ధమైన ఆకాంక్షలేనని, వాటిని నెరవేరుస్తామని భారతీయ జనతా పార్టీ 2019 సార్వత్రిక, 2020 స్థానిక కౌన్సిల్ ఎన్నికలకు తన మ్యానిఫెస్టోలలో వాగ్దానం చేసింది. ఆ హామీ ఒట్టి మాటగా మిగిలిపోయింది. రాజ్యాంగ నైతికతకు రాజకీయ అనైతికత గ్రహణం పట్టింది.

వాంగ్‌చుక్ ఈ నెల 10 నుంచి లేహ్‌లో 35 రోజుల నిరాహారదీక్ష చేస్తున్నారు. ఇది ఆయన ఐదవ నిరశన వ్రతం. ప్రతిసారీ తన దీక్షా వ్యవధిని ఒక వారం రోజుల చొప్పున పెంచుతూ వస్తున్నారు. వచ్చే నెలలో లేహ్, కార్గిల్ అటానమస్ హిల్ డెవెలప్‌మెంట్ కౌన్సిల్స్‌కు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో లద్దాఖ్ ప్రజలు మళ్లీ ఉద్యమిస్తున్నారు. కేంద్రం నుంచి సానుకూల ప్రతిస్పందన వచ్చే అవకాశాలు లేవు. నిజానికి లద్దాఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి ఇచ్చే ప్రసక్తే లేదని రెండేళ్ల క్రితమే కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెగేసి చెప్పారు. లద్దాఖ్‌ను ఆరవ షెడ్యూల్‌లో చేర్చకుండా యుటిగా కొనసాగిస్తే బయటి నుంచి వచ్చిన బ్యూరాక్రాట్లు ఇక్కడి కొండలు, లోయలు, విలక్షణ పర్యావరణ వ్యవస్థను కార్పొరేట్లకు విక్రయిస్తారని, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కింలో సంభవించిందే ఇక్కడా వాటిల్లడం ఖాయమని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. రాజ్యాంగ న్యాయం కోసం లద్దాఖ్ ప్రజల పోరాటం పూర్తిగా గాంధేయ పద్ధతులలో జరుగుతోంది. అయినా కేంద్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరి భారత ప్రజాస్వామ్యానికి మేలు చేస్తుందా? శోభనిస్తుందా?

విద్యారంగంలో, వాతావరణ మార్పు వైపరీత్యాలను అరికట్టడంలో ప్రశస్త కృషి ద్వారా అనేక అంతర్జాతీయ పురస్కారాలను అందుకున్న ప్రజా మేధావి సోనం వాంగ్‌చుక్ తమకు ప్రత్యర్థి అయిన ఒక ప్రతిపక్ష నాయకుడులా కేంద్ర ప్రభుత్వం ఆయన పట్ల వ్యవహరించడం గర్హనీయం. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేయడాన్ని నేరంగా పరిగణించడం ఎలా రాజ్యాంగ బద్ధం? దేశ పౌరులకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను జాతీయ భద్రత, పర్యావరణంపరంగా కీలక ప్రాంతమైన లద్దాఖ్ వాసులకు ఎందుకు కల్పించరు? రాష్ట్ర ప్రతిపత్తి కల్పించని పక్షంలో లద్దాఖ్‌లో ప్రజాస్వామ్యం ఎలా వర్ధిల్లుతుంది?


లద్దాఖ్ ప్రజల రాజ్యాంగ న్యాయ ఆరాటం పట్ల దేశ పాలకులు తమ ఉదాసీనతను కొనసాగిస్తే అది ఒక మహాతప్పిదమూ మహాపరాధమూ అవుతుంది. లద్దాఖీలకు సహానుభూతి, సంఘీభావం తెలుపడం సమస్త భారతీయుల నైతిక కర్తవ్యం. ఈ కర్తవ్యపాలన సరిగా లేకపోవడం కూడా దేశ పాలకుల ఇష్టారాజ్యం యథేచ్ఛగా కొనసాగడానికి కారణమవుతోంది. రాజ్యాంగ ధర్మాన్ని గౌరవించడమనేది ప్రతి పౌరుని అంతరంగిక ప్రేరణ కావాలి. ఈ నైతిక నియమంతోనే రాజ్యాంగ న్యాయం సమస్త ప్రాంతాలకు, సకల సామాజిక వర్గాలకు సమరీతిలో లభించేందుకు ఆస్కారముంటుంది.

'వక్ఫ్' గ్రహణంలో భారత్ కీర్తి చంద్రికలు



▪ పి. చిదంబరం

'పళని' పలుకు



భారత జాతీయ చట్టసభ పార్లమెంటు ఆమోదించిన ఒక చట్టంలోని వొక నిబంధనను సుప్రీంకోర్టు గానీ లేదా హైకోర్టు గానీ కొట్టివేస్తే అది ప్రభుత్వానికి గానీ, పార్లమెంటు సభ్యులకు గానీ ప్రతిష్ఠాకరమేనా? శాసన నిర్మాణ బాధ్యతలను వారు నిర్వర్తించిన తీరును ఆక్షేపించడమే కాదూ ఆ న్యాయ నిర్ణయం? ఒక బిల్లులోని నిబంధనలు రాజ్యాంగ నిర్దేశాలకు విరుద్ధంగా ఉన్నట్టయితే శాసన నిర్మాతలు ఆ బిల్లును తప్పక వ్యతిరేకిస్తారు. అయినా ప్రభుత్వం ఆ బిల్లును పార్లమెంటులో మళ్లీ ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకోవచ్చు. అయినా ఉన్నత న్యాయస్థానాలు అంతిమంగా ఆ బిల్లును కొట్టివేస్తే అది ప్రభుత్వానికి ఎంత అవమానం, ఎన్ని తలవంపులు?! అంతకంటే అధ్వానకరమైన పరిస్థితిని పరిశీలనలోకి తీసుకోండి: పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లుకు తీవ్ర వ్యతిరేకత వస్తుంది. అప్పుడు ఆ బిల్లును సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ)కి పరిశీలనకు నివేదిస్తారు. జేపీసీలోని పలువురు సభ్యులు ఆ బిల్లు పట్ల తమ తీవ్ర అసమ్మతి తెలుపుతారు. పార్లమెంటు ఆమోదించేందుకు ఆ బిల్లు అర్హమైనది కాదని స్పష్టం చేస్తారు. సభ్యుల ఆక్షేపణలు, అభ్యంతరాలను తోసిపుచ్చి ప్రభుత్వం ఆ బిల్లును ఆమోదింప చేసుకుంటుంది. ఆ తరువాత ఉన్నత న్యాయస్థానాలు ఆ బిల్లులోని నిబంధనలను కొట్టివేయడమో లేక వాటి అమలును తాత్కాలికంగా నిలిపివేయడమో చేస్తాయి. ప్రభుత్వానికి ఇంతకంటే ఘోరమైన అవమానం మరేముంటుంది? న్యాయ మంత్రిత్వశాఖ విధి నిర్వహణా దక్షత ఎంత సమర్థంగా ఉన్నదో అది తెలియజేస్తుంది!

ఇదీ వక్ఫ్ (సవరణ) చట్టం–2025 కథ. సెప్టెంబర్ 15, 2025న ఆ చట్టంలోని కొన్ని కీలక నిబంధనలపై సుప్రీం స్టే విధించింది. అయినప్పటికీ ప్రభుత్వం గంభీరంగా తనను తాను అభినందించుకున్నది. 'ముస్లిమ్ పర్సనల్ లా'లోని ప్రధాన భాగాన్ని సంస్కరించేందుకు తాము చేసిన ప్రయత్నాలను సుప్రీంకోర్టు ఆమోదించిందని ప్రభుత్వం చెప్పుకున్నది. పార్లమెంటులో లేవనెత్తిన అనేక ప్రశ్నలను ఏప్రిల్ 5, 2025న ఇదే కాలమ్‌లో నేను రాసిన వ్యాసం ('ముస్లింలపై మరో దాడి!')లో ప్రస్తావించాను. విపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి సమాధానాలు రాలేదు. ఆ బిల్లులోని వివిధ నిబంధనలను ప్రభుత్వం మొండిగా సమర్థించుకున్నది అయితే మా ప్రశ్నలకు సుప్రీం కోర్టు మధ్యంతర సమాధానాలు ఇచ్చింది:

1) వక్ఫ్ సవరణ చట్టం కింద 'ఒక వక్ఫ్‌ను సృష్టించే వ్యక్తి తాను కనీసం ఐదు సంవత్సరాలుగా ఇస్లాంను అనుష్ఠానిస్తున్నానని నిరూపించుకోవాలి'. తాను ఇస్లాంను అనుసరిస్తున్నానని ఒక వ్యక్తి ఎలా 'నిరూపించాలి' అని మేము ప్రశ్నించాము. చట్టంలోని 3వ సెక్షన్‌లో 'ఆర్' అనే నిబంధనపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆస్తిని వక్ఫ్‌గా ప్రకటించే ముందు ఐదేళ్ల పాటు ఇస్లాం మతాన్ని అనుసరించి ఉండాలన్న షరతుకు కొత్త నియమాలు రూపొందించేంత వరకు ఈ స్టే వర్తిస్తుందని కోర్టు పేర్కొంది. ఆ షరతుకు వర్తించే నియమాలను రూపొందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉన్నది. ఇతర మతాల పర్సనల్ లాస్ (వివాహం, ఆస్తుల వారసత్వం మొదలైన కొన్ని వ్యక్తిగత విషయాలకు సంబంధించి ఆయా వ్యక్తులకు సంబంధించిన మతాచారం ప్రకారం వర్తించే శాసనపరంగా గుర్తింపు కలిగిన నియమ నిబంధనలు)లో ఇటువంటి నిబంధనేదీ లేదు.

2) వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తి ప్రభుత్వ ఆస్తి అవునో కాదో అనేది నిర్ణయించడానికి జిల్లా మెజిస్ట్రేట్‌కు అధికారం ఉన్న సెక్షన్‌ను కూడా సుప్రీంకోర్టు నిలిపివేసింది. పౌరుల వ్యక్తిగత హక్కులపై నిర్ణయం తీసుకోవడానికి జిల్లా మెజిస్ట్రేట్‌కు అనుమతి లేదని తెలిపింది. అది అధికారాల వికేంద్రీకరణను ఉల్లంఘిస్తుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. నిర్దిష్ట వక్ఫ్ ఆస్తి 'ప్రభుత్వ ఆస్తి అవునో కాదో నిర్ణయించేందుకు నియుక్తుడైన అధికారి నిర్ణయం తీసుకునే వరకు ఆ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించకూడదు. అది ప్రభుత్వ ఆస్తి అని ఆ అధికారి నిర్ణయిస్తే ఆ ప్రకారం అతడు రెవెన్యూ రికార్డులను సవరించాలి' అని చట్టం నిర్దేశించింది. అయితే ఇది తన సొంత వ్యవహారంలో ప్రభుత్వమే న్యాయమూర్తి పాత్ర వహించడం కాదా అని మేము ప్రశ్నించాము. సెక్షన్ 3సి లోని సబ్ సెక్షన్లు 2, 3, 4పై సుప్రీం కోర్టు స్టే విధించింది.

3) రెవెన్యూ రికార్డులు 'సవరించిన 'తరువాత వక్ఫ్ ఆస్తిగా పరిగణింపబడే హక్కును కోల్పోతుంది. కార్యనిర్వాహక చర్య ద్వారా వక్ఫ్ ఆస్తిపై హక్కును తొలగించడం కాదా అని మేము ప్రశ్నించాము. ఈ అంశంపై అప్పిలేట్ ట్రిబ్యునల్, సంబంధిత హైకోర్టు నిర్ణయం తీసుకునేంతవరకు రెవెన్యూ రికార్డుల సవరణను నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

రాష్ట్ర వక్ఫ్ బోర్డులలోను, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లోను ముస్లిమేతరులను నియమించవచ్చని, సీఈఓగా కూడా ముస్లిమేతరులను నియమించవచ్చని వక్ఫ్ సవరణ చట్టం నిర్దేశించింది. మరి హిందూమతానికి చెందిన ట్రస్టులో ముస్లిం లేదా హిందూయేతర వ్యక్తికి స్థానం కల్పించేందుకు వీలుగా ఇటువంటి నిబంధనలను సంబంధిత చట్టాలలో చేరుస్తారా అని మేము ప్రశ్నించాము. సుప్రీంకోర్టు సైతం ఇదే విషయాన్ని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లోని 11 మంది సభ్యులలో ముస్లిమేతరుల సంఖ్య ముగ్గురికి మించకూడదని, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లోని 22 మంది సభ్యులలో ముస్లిమేతరులు నలుగురికి మించి ఉండకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సీఈఓగా ముస్లింను నియమించేందుకు అవసరమైన ప్రతి ప్రయత్నమూ చేయాలని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

వక్ఫ్ (సవరణ) చట్టంపై మొత్తంగా కానీ లేదా కనీసం అందులోని కొన్ని కీలక నిబంధనలపై తాత్కాలిక స్టే ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ దాఖలైన దరఖాస్తుపై వాదనలను సుప్రీంకోర్టు మూడు రోజుల పాటు విన్నది. చట్టం అమలు నిలుపుదలకు దాఖలైన ఒక దరఖాస్తుపై మూడు రోజుల పాటు విచారణ జరపడం అసాధారణం. ఈ కేసు అంతిమ విచారణకు వచ్చినప్పుడు మరిన్ని వాదనలను సుప్రీంకోర్టు విననున్నది. సరే, ఈ లోగా ఈ ప్రభుత్వం తన హిందుత్వ అజెండాను మరింత ముందుకు తీసుకువెళుతూ మైనారిటీల ప్రయోజనాలకు విఘాతం కలిగించే నిర్ణయాలు తీసుకుంటుంది, చర్యలు చేపడుతుంది, సందేహం లేదు.

వక్ఫ్(సవరణ) చట్టంను కించిత్ పరిశీలిస్తే దాని దురుద్దేశం, మైనారిటీల పట్ల ద్వేషభావం ఇట్టే విశదమవుతుంది. ప్రభుత్వం నిష్ఠగా పాటించవలసిన రాజ్యాంగ అధికరణ 26 'మతపరమైన వ్యవహారాలను నిర్వహించుకునే హక్కు' అన్ని మతాలవారు తమ మతసంస్థలను స్వేచ్ఛగా నిర్వహించుకోవచ్చునని స్పష్టం చేస్తున్నది. ఆ అధికరణ ఇంకా నాలుగు విషయాలు పేర్కొంది. అవి: 1) సంస్థలను ఏర్పాటు చేసుకొనుట; 2) నిర్వహించుకొనుట; 3) సంస్థల కొరకై చర స్థిరాస్తులను సేకరించుకొనుట; 4) సేకరించిన ఆస్తుల నిర్వహణ, ఇవన్నీ మత స్వేచ్ఛలో అంతర్భాగాలు. ఈ హక్కులను నిర్వహించుకొనుటలో శాంతిభద్రతలను, నీతిని, ప్రజారోగ్యాన్ని భంగపరచరాదు. భారతదేశ మత, సాంస్కృతిక జీవనంలో విశిష్టమైన, విలక్షణమైన వైవిధ్యాన్ని సంరక్షించుకుని మరింత దృఢతరం చేసుకోదలిచినవారు మరీ ముఖ్యంగా హిందువులు వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలి, పోరాడి తీరాలి.


భారతదేశ జనాభాలో ముస్లిం మతస్తులు 20.20 కోట్ల మంది కాగా క్రైస్తవులు 3.20 కోట్ల మంది ఉన్నారని ఈ ఏడాది సాధికారిక అంచనాలు నిర్ధారించాయి. హిందూధర్మం ప్రపంచ అత్యంత పురాతన మతం కాగా క్రైస్తవం, ఇస్లాం ప్రపంచ వ్యాప్తంగా అత్యధికులు అనుసరించే మతాలుగా విలసిల్లుతున్నాయి. భారతీయులమైన మనం లౌకికవాదులమని, సహనశీలురమని ప్రగాఢంగా విశ్వసిస్తాం. అయితే ప్రపంచం మాత్రం భారత్‌ను భారత పార్లమెంటు చట్టాలు, భారత ప్రభుత్వ చర్యలు, భారత ప్రజల సామాజిక ప్రవర్తనారీతుల ప్రాతిపదికన చూస్తుంది. మన దేశం పట్ల అభిప్రాయాలు ఏర్పరచుకుంటుంది. ప్రపంచం దృష్టిలో భారత్‌కు ఇంతకు ముందున్న సమున్నత గౌరవ ప్రతిష్ఠలు వక్ఫ్ (సవరణ) చట్టంతో క్షీణించాయి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

“ భారతీయులమైన మనం లౌకికవాదులమని, సహనశీలురమని ప్రగాఢంగా విశ్వసిస్తాం. అయితే ప్రపంచం మాత్రం భారత్‌ను భారత పార్లమెంటు చట్టాలు, భారత ప్రభుత్వ చర్యలు, భారత ప్రజల సామాజిక ప్రవర్తనారీతుల ప్రాతిపదికన చూస్తుంది. మన దేశం పట్ల అభిప్రాయాలు ఏర్పరచుకుంటుంది. ప్రపంచం దృష్టిలో భారత్‌కు ఇంతకు ముందున్న సమున్నత గౌరవ ప్రతిష్ఠలు వక్ఫ్ (సవరణ) చట్టంతో క్షీణించాయి.

'అణు మహర్షి' ఎ.ఎస్.రావు

'దేశ అభివృద్ధికి, పురోగతికి శాస్త్ర, సాంకేతిక రంగాలు అత్యంత కీలకం. ఈ రంగాల్లో స్వావలంబన సాధించాలి. విదేశీ టెక్నాలజీపై ఆధారపడటం శ్రేయస్కరం కాదు'. ఇది భారతదేశం గర్వించదగిన ఒక అగ్రశ్రేణి ప్రభుత్వ అణుశాస్త్రవేత్త పద్మభూషణ్ డాక్టర్ అయ్యగారి సాంబశివ రావు (ఎ.ఎస్.రావు) ఆకాంక్ష. దేశంలో జరిగే అణు ప్రయోగాలు కేవలం అణ్వాయుధాల తయారీకే పరిమితం కాకుండా మానవ కళ్యాణానికి, వ్యవసాయ, ఔషధ రంగాలకు ప్రయోజనం కలిగేలా ప్రభుత్వానికి విలువైన సూచనలు చేసిన దార్శనికుడు ఆయన.



భారతదేశంలోని అన్ని రంగాలకు అవసరమైన కీలక ఉత్పత్తులు, వైద్య రంగానికి అవసరమైన కీలక పరికరాలు, పార్లమెంట్, అసెంబ్లీ, విమానాశ్రయాలు, కీలక ప్రదేశాల్లో వాడే భద్రతా వస్తువులను రూపొందించడంలో ఎ.ఎస్.రావు ముఖ్య భూమిక నిర్వహించారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో, అణు ధార్మిక సంబంధిత కర్మాగారాల్లో కార్మికుల భద్రత, రక్షిత పరికరాల రూపకల్పనలో మంచి దిట్టగా పేరుగాంచారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కంప్యూటర్లు తయారు చేయడంలో, ప్రతిష్ఠాత్మక ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల తయారీలోనూ ఆయన శ్రమ ఇమిడి ఉంది. బుల్లితెర బొమ్మ అందాలు చూపిన తొలి రోజుల్లో రూపొందించిన ఈసీ టీవీ ఆయన ముద్దుబిడ్డే. ఈసీఐఎల్ ప్రగతిలో అణువణువునా ఎ.ఎస్.రావు కృషి ఉంది. 1955లో హోమీజె బాబాతో కలిసి రూపొందించిన తొలి అణు రియాక్టర్ 'అప్సర' ఎ.ఎస్.రావు సారథ్యంలో శాస్త్రవేత్తలు రూపొందించినదే. ఆ తర్వాత 'సైరస్', 'జెర్లినా' వంటి న్యూక్లియర్ రియాక్టర్ల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారు.

అల్లూరి సీతారామరాజు జన్మించిన పశ్చిమగోదావరి జిల్లా మొగల్లు గ్రామంలోనే సెప్టెంబర్ 20, 1914న డాక్టర్ ఎ.ఎస్.రావు జన్మించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ (ఫిజిక్స్) పూర్తి చేశారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం నుంచి 1947లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పొందారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో డాక్టర్ రావు కృషికి గాను 1960లో పద్మశ్రీ అవార్డుతో సత్కరించారు. 1972లో పద్మభూషణ్, తర్వాత నాయుడమ్మ మెమోరియల్ స్వర్ణపతకంతో పాటు పలు అవార్డులు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీని ఒప్పించి హైదరాబాద్‌లో ఈసీఐఎల్ స్థాపించడంలో ఎ.ఎస్.రావు పట్టుదలతో కూడిన కృషే కారణం.

అనేక అత్యున్నత పదవులు, బాధ్యతలు నిర్వహించినా, ప్రపంచ ప్రఖ్యాతి పొందినా ఆయనలో గర్వం అణుమాత్రం కూడా ఉండేది కాదు. నమ్మిన ఆదర్శాలకే కట్టుబడ్డారు. ఉత్తమ సంస్కారిగా నిలబడ్డారు. సైన్సు నాలుగు గోడల మధ్య బోధించే ప్రక్రియ కాదు, పరిసరాలను నిర్దేశించి, నియమాలను శోధించడమే సైన్సు లక్ష్యమని బలంగా విశ్వసించిన శాస్త్రవేత్త ఎ.ఎస్.రావు. మూఢ నమ్మకాల జాడ్యం పోవాలంటే సైన్సు జనాదరణ పొంది అన్ని రంగాల్లోనూ ప్రవేశించాలి. సామాజిక, రాజకీయ, ఆర్థిక విప్లవాలకు సైన్సు మూలాధారం, దాని బీజాలు పాఠశాలల్లోనే వేయాలి అంటారు డాక్టర్ రావు. తన జీవితంలో శాస్త్ర, సాంకేతిక ప్రగతి కోసం కృషి చేసి, కొత్తతరం శాస్త్రవేత్తలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన ఆయన 2003 అక్టోబర్ 31న కనుమూశారు. అవనిపై అణుశాస్త్ర విజ్ఞానంలో విప్లవం సృష్టించి, న్యూక్లియర్ ఎనర్జీతో శాంతి సాధించవచ్చు అని ప్రపంచానికి చాటి చెప్పిన ఎ.ఎస్.రావు 'అణు మహర్షి' అయినారు.

– పెన్మత్స శ్రీహరిరాజు
సీనియర్ పాత్రికేయులు

(నేడు డాక్టర్ ఎ.ఎస్.రావు జయంతి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

పురాణాలకు చరిత్రకు తేడా లేదా?!

ఆధునిక విజ్ఞానం ఒకవైపు అప్రతిహతంగా దూసుకుపోతుంటే మరోవైపు అహేతుకత్వం, ఆలోచనారాహిత్యం, అంధ విశ్వాసాలు అంతకంటే వేగంగా విస్తరిస్తూ, సమాజాన్ని ఆటవిక దశకు చేరువ చేస్తున్నాయి. దీనికితోడు ఆధ్యాత్మికవాదాలు, ఆత్మ సిద్ధాంతాలు, కర్మవాదాలు, పునర్జన్మవాదాలు ప్రజలను పీల్చి పిప్పిచేస్తున్నాయి. తమ కష్టనష్టాలకు అసలైన భౌతిక కారణాలను ప్రజలు తెలుసుకోనీయకుండా ఇవి అడ్డుపడుతున్నాయి.

రెండు వేల సంవత్సరాలుగా ఈ దేశాన్ని మనుధర్మ శాస్త్రమే శాసిస్తోంది, పాలిస్తోంది. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగం అమలుతో కూడా పెద్దగా ఫలితమేమీ కన్పించడం లేదు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ వ్యవస్థలు సైతం నిర్వీర్యమవుతున్నాయి. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఓటర్ల జాబితాలో జరుగుతున్న అవకతవకలే ఇందుకు తాజా నిదర్శనం. నేడు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో అసమానతలు, నిరంకుశ వైఖరులు, దోపిడీ పీడనలు కొనసాగుతూనే ఉన్నాయి. అన్యాయాలను, అక్రమాలను ఎదురించే, ప్రశ్నించే గొంతులు నొక్కేస్తున్నారు.

ఈ దేశంలో పురాణాలకు, చరిత్రకు మధ్య తేడా తెలియకుండాపోతోంది. పచ్చి అబద్ధాలతో, కల్పనలతో కూడిన పౌరాణిక కథలన్నీ వాస్తవ చారిత్రక సంఘటనలుగా కీర్తించబడుతున్నాయి. సామాన్యుల నుంచి మేధావుల వరకు (డాక్టర్లు, లాయర్లు, పాలకులు, వీసీలు వంటి వారంతా) ఈ అబద్ధాల సంస్కృతిని కాపాడుతున్నవారే. పాఠశాలల్లో శాస్త్రీయ విజ్ఞానానికి అవకాశం లేకుండా పోతోంది. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రావాలి.

రానున్న కాలంలో గోదావరి పుష్కరాలను మహా కుంభమేళా స్థాయిలో జరపాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. దానికోసం వందల కోట్ల రూపాయలను ఖర్చు చేయడానికి సిద్ధపడుతోంది. ఏపీ ప్రభుత్వం కూడా పుట్టపర్తి సాయిబాబా శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా జరపాలని నిర్ణయించడమేగాక, అందుకు కోట్లాది రూపాయల బడ్జెట్‌ను కేటాయించినట్లు తెలుస్తోంది. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బును ఇలా గుళ్లూ గోపురాలు నిర్మించడానికి, యజ్ఞయాగాల నిర్వహణకు ఖర్చు చేయడం... భారత రాజ్యాంగం నిర్దేశించిన లౌకికవాదాన్ని మంటగలపటమే అవుతుంది.

మనుషులను కులాలు, మతాలు, వర్గాలు, ప్రాంతాల వారీగా విభజించి, వారి మధ్య అసూయ ద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉపన్యాసాలివ్వడం, తద్వారా తమ రాజకీయాధికారాన్ని నిలబెట్టుకోడానికి ప్రయత్నించడం బీజేపీ వంటి మతతత్వ పార్టీలకు వెన్నతో పెట్టిన విద్య. ఇప్పుడు ప్రజలు పార్టీల పరంగా కూడా చీలిపోయారు. మతాలు, రాజకీయాలు కలిసిపోయాయి. మతరాజకీయాలే దేశాన్ని ఫాసిజం, మత నియంతృత్వం వైపు లాక్కెళుతున్నాయి.

ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజల్లో హేతువాదాన్ని రగిలించి, ఇంగితజ్ఞానాన్ని పెంచి, చైతన్యవంతం చేయవలసిన బాధ్యత అభ్యుదయ కాముకులైన హేతువాదులు, మానవతావాదుల మీద ఉంది. ఆ దిశగా జరుగుతున్న కృషిలో భాగంగానే 'భారత హేతువాద సంఘం' గత 95 ఏళ్లుగా భావ విప్లవ పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంది. దాదాపు రెండు వందలకు పైగా హేతువాద, మానవవాద పుస్తకాలను ప్రచురించింది. నిరంతరం సభలు, సమావేశాలు, అధ్యయన తరగతులు నిర్వహిస్తోంది.

ప్రస్తుతం తెలంగాణ హేతువాద సంఘ 5వ ద్వైవార్షిక మహాసభలు, అధ్యయన తరగతులు సెప్టెంబరు 21వ తేదీ ఆదివారం పాల్వంచలోని కొమురం భీం మీటింగ్ హాలులో ఉదయం పది గంటలకు జరుగనున్నాయి. ఈ సభలో 'మత విశ్వాసాలు–హేతువాదం', 'భౌతిక వాస్తవిక వాదం– మానవవాదం' అనే అంశాలపై అడియాల శంకర్, గడీల సుధాకర్‌రెడ్డి, శశీంద్రన్ కక్కోడి, జానీమియా, నబీసాబ్ తదితరులు ప్రసంగిస్తారు.

– డా. గుమ్మా వీరన్న, భారత హేతువాద సంఘం అధ్యక్షుడు

ప్రకృతి బతుకమ్మను బతికించుకుందాం

భారతదేశం పండగలకు పుట్టినిగడ్డ. తెలంగాణ ప్రాంతం పండగలు, ఉత్సవాలు, జాతరలకు పుట్టిల్లు. పండగలు రెండు రకాలు. మొదటి రకం పుట్టు పండగలు. బోనాలు, సదర్, బతుకమ్మ, నాగోబా జాతర, సమ్మక్కసారలమ్మ జాతర వంటివి. రెండో రకం పెట్టు పండగలు. ఇవి తెచ్చిపెట్టుకున్న పండగలు.

బతుకమ్మ వంటి పూల పండగలు దేశంలో కేరళ, గుజరాత్ వంటి చోట్లా ఉన్నాయి. కానీ, బతుకమ్మ నేల పొరలలోంచి చీల్చుకువచ్చిన పండగ. పునరుత్పత్తి వంటి పురాభావన, ప్రకృతే దైవంగా పాంచ భౌతిక శక్తుల ఆరాధనా రీతులను పుణికిపుచ్చుకున్న, ప్రత్యేకించి స్త్రీల పండగ. ఈ పండగలో పురుషుడు తండ్రైనా, భర్తైనా, కొడుకైనా ప్రేక్షకుడే. వ్యవసాయ భావనకు ఆద్యురాలు, శ్రమలో ముప్పాతిక భాగం, చిందిన చెమటలోంచి రూపొందిన రాగం–తాళం, ఆట–పాట అన్నీ స్త్రీల ముద్రతోనే అలరారుతాయి.

ఇలాంటి పండగలు ఏ రూపంలో, ఏ ప్రాంతంలో ఉన్నా వాటిని పరిరక్షించుకునే అత్యయిక పరిస్థితి ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి మహిళా ప్రధానమైన పండగే. కానీ, పురుషాధిక్య భాగస్వామ్యం వల్ల అది కోడిపందేల, మద్యమాంసాల పండగైంది. తెలంగాణలో ఆడపిల్లలు బొడ్డెమ్మ పండగ ఆడాక బతుకమ్మ పండగ వస్తుంది. ఆ తదుపరి వచ్చే దసరా పురుషుల పండగ అయ్యింది. మద్య మాంస సేవన ప్రాధాన్య దినంగా మారింది. దీపావళి, హోలీ పండగలు దక్షిణాదిన ఎన్నో కారణాల వల్ల అధిక ప్రచారం పొందాయి.

బతుకమ్మ పండగ ప్రకృతి అంత పాతది. దాని చుట్టూ అనేక ఐతిహ్యాలు ఉన్నాయి. ఎన్ని ఉన్నా ఈనాటికీ ఆదివాసులలో జరుపబడే కొత్తల పండగ, టెంకల పండగలు ఉన్నాయి. కొత్త ధాన్యం, కూరగాయలు, తృణధాన్యాలు ఏవి పండినా వాటిని తినే ముందు పండగ జరుపుతారు. అలాగే భాద్రపద మాసంలో ధాన్యం, రకరకాల చిరుధాన్యాలు చేతికి వస్తాయి. అప్పుడే బతుకమ్మ పండగ సంరంభం మొదలవుతుంది. బొడ్డెమ్మ పండగ 9 రోజులు, బతుకమ్మ పండగ 9 రోజులు. ఈ తొమ్మిది రోజులు 9 రకాల ధాన్యాలతో ప్రసాదం తయారుచేసి స్త్రీలందరూ పంచుకుని తింటారు. 9 రకాల పూలతో బతుకమ్మ పేరుస్తారు. ఐతే అవి ఒక్కోచోట ఒక్కో రకంగా ఉంటాయి!

ఈ పండగలో అనేక పాటలు పాడతారు. నృత్యం చేస్తారు. అడుగు వెనక్కి. ముందుకి కాదు సుమా, వంగుతూ లేస్తూ మొగ్గ పువ్వుగా మారినట్లు వర్తులాకార (గుండ్రంగా) నృత్యం చేస్తారు. రేలా, ధింసా వంటి ఆదివాసీ నృత్యాలను పోలి ఉంటుంది. ఈ తతంగం అంతా ప్రకృతి సంబంధంగా ఉంటుంది. పునరుత్పత్తి భావన ధ్వనిస్తుంది. ఇలాంటి పండగలు ఏవైనా వాటిని కాపాడుకోవాలి. ఈ పండగలు సామాజిక బాంధవ్యాల్ని పెంచుతాయి. తరతరాల సంస్కృతిక వారసత్వాన్ని కాపాడ్డం కోసం ఇవి ఉనికి కోల్పోవద్దు. సమాజంలో ఈ పండగకి 'అదేనా ఆడవారి పండగ' అనే భావన ఉంది. అది పురుషాహంకార సంస్కృతిలోంచి జనించింది. కానీ ఈ పండగ నిర్వహణలో ఎక్కడా, ఏ రూపంలోనూ కలుషితం చేయరు. పైగా పవిత్ర భావనలతో పండగకి వన్నె తెస్తారు. మానవీయ, సాంఘిక విలువలు పాటిస్తారు.

గతంలో బతుకమ్మ పండగపై సామాజిక, ఆర్థిక, జెండర్ ప్రభావాలు పడి కొంత సెట్‌బ్యాక్ అయ్యింది. తెలంగాణ రైతాంగ పోరాట కాలానికి ముందే దొరలు స్త్రీలను బట్టలు విప్పి బతుకమ్మ ఆడించారు. కరుడు గట్టిన దొరలు స్త్రీలను అమానుష అవమానాలకు గురిచేశారు. అందుకే గడీల ముందు నుంచి బతుకమ్మలను తీసుకువెళ్ళేవారు కాదు. కొందరు దొరలు బలవంతంగా ఆట ఆడించేవారు. రైతాంగ పోరాటంలో స్త్రీలు తమను హింసించినవారి కళ్ళల్లో కారం కొట్టారు. తుపాకులు అందుకున్నారు. రజాకార్లను సైతం ఎదిరించి నిలబడ్డారు.

బతుకమ్మని ప్రజాస్వామీకరించే దిశగా మరిన్ని అడుగులు పడాలి. అన్ని వివక్షలను దూరంపెట్టే 'బతుకమ్మ' కొత్త పాఠం తయారుకావాలి. దొరల చేతల్లో, చేతుల్లో బందీ అయిన బతుకమ్మ ప్రకృతి పరిరక్షణ నినాదం కావాలి. ప్రభుత్వం పర్యావరణహితంగా ఆలోచించి, చర్యలు తీసుకోవాలి. స్త్రీల పండగకి జాతీయ హోదా కల్పించే దిశగా ఆలోచించాలి.





మళ్ళీ బతుకమ్మ శిరసెత్తి నిలిచింది. వలసకాలంలో బతుకమ్మ పండగ ఒకటుందని కూడా చూడలేని పరిస్థితి ఏర్పడింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కాలంలో బతుకమ్మ రోడ్డెక్కింది. వంటావార్పులో ఒక ఆయుధమైంది. విప్లవీకరించిన పాటకు పల్లవైంది. కేవలం చేత్తో కొట్టే చప్పట్లే గొప్ప సంగీతమై బతుకమ్మ తలెత్తి నిలిచింది.

గత పన్నెండేళ్ళుగా అస్తిత్వ భావనలకు తెలంగాణ రాజకీయాలు దూరంగా నెట్టబడ్డాయి. ప్రకృతి విధ్వంసకర చర్యలను చూసీచూడనట్లు పక్కనపెట్టారు. ఒక దశలో పూలు లభించలేదు. చెరువులు, జలాశయాలు ఆక్రమణలకు గురైనప్పుడు ప్లాస్టిక్ బకెట్లలో బతుకమ్మ నిమజ్జనం జరిగింది. దొరల పాలనలో దొరసానిగారికే బంగారు బతుకమ్మ తలమీది కిరీటం అయ్యింది. అది ప్లాస్టిక్ పూలతో అలంకరించబడింది. లక్షల ప్లాస్టిక్ పూలు, వేలాది టన్నుల ప్లాస్టిక్‌తో చౌరస్తాల్లో అడుగడుగునా బతుకమ్మలు పెట్టారు. కానీ తెలంగాణ స్త్రీల మనోభావాలకు గౌరవం లేదు. మధురంగా రాగయుక్తంగా పాడుకునే పాటల స్థానంలోనే డీజేలు, రంగురంగుల కృత్రిమ వెలుగులు, దాండియా పేర కోలాటాల వికృత క్రీడ. పర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారవర్గాల సంస్కృతి నెత్తిమీద బతుకమ్మని దించేసి కొత్త సంస్కృతిని రుద్దారు. అయినా సాంస్కృతిక శాఖ ఈ వైపు దృష్టిపెట్టలేదు. మానవీయ సంస్కృతికి మారురూపమైన బతుకమ్మకి అవమానం జరిగినా పట్టించుకోలేదు. ఇవ్వాళ ఆ శక్తులు నోరుమూసుకొని అపరాధ భావనతో క్లబ్బుల్లో, పబ్బుల్లో, ఫామ్‌హౌజుల్లో కృత్రిమ బతుకమ్మలకే పరిమితమయ్యాయి. బతుకమ్మ ఒడ్డూపొడవుల గురించే ఆలోచించారు.

ఒక్కొక్క పువ్వేసి... తెలంగాణ మహిళలు ఈసారి తమ గౌరవాభిమానాల్ని పరిరక్షించుకోవడం కోసం ఆలోచనలు చేస్తున్నారు. ఈ ఒక్క పండగలోనే వాడవాడంతా బతుకమ్మవుతుంది. ఊరు ఊరంతా పాటవుతుంది. ఇక్కడ కుల మతాలు ఉండవు. అందరూ ప్రసాదం తెస్తారు. తెచ్చిన ప్రసాదం ఒక్కచోట పెట్టి పదిమంది కలసి సామూహికంగా తింటారు. కలసి పాడుతూ, ఆడుతూ బతుకుల్ని కలబోసుకునే పండగ ఇది. ఇలాంటి పండగల వల్ల, కలయికల వల్ల, జాతరల వల్ల సాంస్కృతిక వైభవం తరం నుంచి తరానికి అందుతుంది. సమాజంలో ఉత్సాహభరిత, ఉల్లాసపూరిత వాతావరణం నెలకొంటుంది. తద్వారా ఆరోగ్యకరమైన సంతృప్తికరమైన జీవితాలు కాంతి గోళాల్లా వికసిస్తాయి. బహు కుల, మత, అంతరాలున్న చోటే ఇలాంటి పండగలు కొత్త ఉత్సాహానికి హేతువులవుతాయి.

బహుజన బతుకమ్మ ఆలోచనతో పనిచేసే విమలక్కల సంఖ్య పెరగాలి. బతుకమ్మని ప్రజాస్వామీకరించే దిశగా మరిన్ని అడుగులు పడాలి. అన్ని వివక్షలను దూరంపెట్టే 'బతుకమ్మ' కొత్త పాఠం తయారుకావాలి. దొరల చేతల్లో, చేతుల్లో బందీ అయిన బతుకమ్మ ప్రకృతి పరిరక్షణ నినాదం కావాలి. వనరుల విధ్వంసం జీవన విధ్వంసమే అనే యోచనతో మహిళాశక్తి కదలాలని ఆశిద్దాం.

పుట్టు పండగల్ని కాపాడుకొందాం. వాటిని పాడుచేసి, పరాయీకరించే పన్నాగాల పని పట్టాలి. వికృతి బతుకమ్మను కాకుండా ప్రకృతి బతుకమ్మను బతికించుకోవడమే అందరి బాధ్యత. కొత్త బట్టలు, పొట్టకింత తినడమే పండగ కాదు. ఇల్లలికితే పండగ కాదు. సమాజాన్ని, ప్రకృతిని కాపాడుకున్న రోజే అసలైన పండగ. ప్రభుత్వం పర్యావరణ హితంగా ఆలోచించి, చర్యలు తీసుకోవాలి. కాలుష్యాన్ని పెంచే విధానాలకు స్వస్తి చెప్పి, దేశానికి సందేశం ఇవ్వాలి. స్త్రీల పండగకి జాతీయ హోదా కల్పించే దిశగా కేంద్రమంత్రులు ఆలోచించాలి.

▪ జయధీర్ తిరుమలరావు

ఐదుగురు ఇన్స్‌పెక్టర్ల బదిలీ

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లతోపాటు ప్రత్యేక విభాగాల్లో పనిచేస్తున్న ఐదుగురు ఇన్స్‌పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న సత్యనారాయణరెడ్డిని జనగామ ఇన్స్‌పెక్టర్‌గా, జనగామ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న బి.దామోదర్‌రెడ్డిని వీఆర్‌కు, వీఆర్‌లో పనిచేస్తున్న కె.రామకృష్ణను సీసీఎస్‌కు, వీఆర్‌లో పనిచేస్తున్న టి.గోపిని సీసీఎస్‌కు, ఇటీవలే కమిషనరేట్‌కు అలాట్ అయిన వై.సంజీవరావును సీసీఆర్‌బీలో పోస్టింగ్ కల్పిస్తూ ఉత్వర్వుల్లో పేర్కొన్నారు.

మరమ్మతుల పేరుతో దోపిడీ

శిథిలావస్థలో జీడబ్ల్యూఎంసీ కార్యాలయం

- ఊడిపోతున్న పెచ్చులు, గోడలకు విద్యుత్ షాక్
- పునరుద్ధరణ పేరుతో లక్షల నిధులు దుర్వినియోగం
- కమిషనర్, పాలకవర్గం స్పందించాలంటున్న ఉద్యోగులు


పీఆర్‌వో కార్యాలయం సీలింగ్ పెచ్చులు ఊడిపోయిన దృశ్యం


పీఆర్‌వో కార్యాలయంలో గోడపై కరెంట్ షాక్ కొడుతుందని నోటీస్


జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో ఇటీవల మరమ్మతు పనులు, ఊడిపోయిన పెచ్చులు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని పీఆర్‌వో కార్యాలయం ప్రమాదపుటంచులో కొట్టుమిట్టాడుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోడలు నిమ్మెక్కి పీఆర్‌వో కార్యాలయం సీలింగ్ పుచ్చిపోయి పెచ్చులు ఊడుతోంది. దీంతో కార్యాలయంలో పనిచేసే పీఆర్‌వో వేరేస్థానానికి కుర్చీ మార్చుకున్నాడు. అయితే యేటా భవన మరమ్మతుల పేరులో లక్షల రూపాయలు ఖర్చుచేస్తున్నా.. బాగు కావడం లేదు. రెండు రోజులు కిందట పీఆర్‌వో కార్యాలయంలోనికి వచ్చిన వ్యక్తి తలపై పెచ్చు ఊడిపడడంతో గాయమైనట్టు తెలిసింది. ఈ విషయంపై సంబంధిత అధికారులకు, పాలకవర్గ పెద్దలకు విన్నవించినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

మరమ్మతు నిధులు ఏమైనట్టు?

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. జీడబ్ల్యూఎంసీ కార్యాలయ దీనస్థితిని చూసి.. కార్యాలయం పూర్తిగా నేలమట్టం చేసి రూ.32కోట్లతో కొత్త కార్యాలయం నిర్మించాలని ఆదేశాలు జారీ చేసి కావలసిన నిధులు కేటాయించారు. కానీ పాలక వర్గం నూతన భవనాన్ని నిర్మించకుండా యేటా మరమ్మతుల పేరుతో లక్షల రూపాయలు ఖర్చు చేస్తోంది. ఇటీవల రూ.2కోట్లు ఖర్చు చేసి కౌన్సిల్ హాల్ రెనోవేషన్ చేసింది. ఇంకా కంట్రోల్‌రూమ్, పౌరసేవలు, డెత్, బర్త్ సెక్షన్, హెల్త్, శానిటేషన్ సెక్షన్, పరిపాలనా విభాగం, అకౌంట్స్ సెక్షన్, ఎల్‌వో కార్యాలయం, బ్యాంకు, టాక్సేషన్ విభాగం, హార్టికల్చర్ అధికారి గది, సెక్యూరిటీ రూమ్, రికార్డుల గది, టౌన్‌ప్లానింగ్ సూపరింటెండెంట్, సిబ్బంది కార్యాలయం శిథిలమై కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. అయితే ఇదే అదునుగా భావించిన కొందరు అధికారులు, పాలకవర్గం పెద్దలు యేటా మరమ్మతుల పేరుతో లక్షలు మళ్లిస్తూ కాంట్రాక్టర్ల నుంచి కమీషన్‌ల దందా సాగిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇటీవల గ్రేటర్ ప్రధాన కార్యాలయం వరండాలో మరమ్మతులు చేసిన రెండు రోజులకే కూలిపోయిందంటే ఏపాటి నాణ్యతా ప్రమాణాలు పాటించారో అర్థం చేసుకోవచ్చు. ఇలా పాత కార్యాలయంలో పనిచేస్తున్న సుమారు వందమంది సిబ్బంది ప్రాణాలకు ఏ క్షణమైనా ముప్పు వాటిల్లే అవకాశం ఉందని సీనియర్ ఇంజనీర్లు చెప్పుకొస్తున్నారు.

గోడలకు షార్ట్ సర్క్యూట్

మునిసిపల్ పాత భవనంలోని పలు సెక్షన్ల గోడలు వర్షం పడితే విద్యుత్ షాక్ కొడుతున్నట్టు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది వర్షం కురిసిన వారంపాటు గోడలను తాకకుండా భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నట్టు చెప్పారు. కొందరు సిబ్బంది పనిలో పడి వారి చేతులు గోడలకు తగిలి కరెంట్ షాక్‌కు గురైనట్టు తెలిపారు. అయితే గోడలకు తాకకండి విద్యుత్ ప్రమాదం జరుగుతుందని అని పీఆర్‌వో కార్యాలయంలో హెచ్చరిక పేపర్‌పై పెట్టడం చేయడం చర్చనీయాంశమైంది. ఇప్పటికైనా నిద్రమత్తు నటిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు, నాసిరకం పనులు చేసి డబ్బులు కాజేస్తున్న కాంట్రాక్టర్లు.. మరమ్మతు పనుల్లో నాణ్యతను పాటించాలని సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. మునిసిపల్ కార్యాలయంలో ప్రమాదపుటంచులో పని చేస్తున్న సిబ్బంది బాధల గుర్తించి కమిషనర్ తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


పని చేయని మరుగుదొడ్డి

రూ.1025 కోట్లతో అభివృద్ధి పనులు

- స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయం
- నాపై నమ్మకంతో ప్రజలు గెలిపించారు..
- మాట నిలబెట్టుకునేందుకే కాంగ్రెస్‌తో కలిసి పని చేస్తున్నా
- విద్య, వైద్య, నీటిపారుదల రంగాల్లో విప్లవాత్మక ప్రగతి
- స్పీకర్ నిర్ణయంపై భవిష్యత్తు రాజకీయ ప్రణాళిక
- మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గడచిన 21 నెలల కాలంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో రూ.1025.64 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్టు మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదిహేనేళ్లుగా అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సర్వతోముఖంగా అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో నియోజకవర్గ అభివృద్ధిలో ఒక ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ పాత్ర పరిమితం కనుక ప్రజలు నష్టపోవద్దన్న ఉద్దేశ్యంతో సంవత్సరన్నర కాలం నుంచి కాం గ్రెస్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నానని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తనపై ఉన్న గౌరవంతో అడిగిందే తడవుగా అనేక పనులకు ఉదారంగా నిధులు మంజూరు చేశారని అన్నారు. సాగునీటి సరఫరాకు సంబంధించి నియోజకవర్గంలో విప్లవాత్మకమైన ప్రగతి చోటు చేసుకున్నదన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 80 శాతం గ్రామాలకు గోదావరి జలాలు (మిగతా 7లో..)

స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటా..

స్పీకర్ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటాననీ, ఆయన నిర్ణయాన్ని బట్టే తన రాజకీయ భవిష్యత్ ప్రణాళిక ఉంటుందని శ్రీహరి అన్నారు. స్పీకర్ నోటీసుకు జవాబు ఇవ్వడానికి ఈ నెలాఖరు వరకు సమయం ఉందన్నారు. పార్టీ మారడాలు దేశవ్యాప్తంగా జరుగుతున్నదన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి కొన్ని సార్లు కొన్ని నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుందన్నారు.

అగ్రవర్ణాల పెత్తనం కొనసాగనివ్వం

- బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీసీ ద్రోహులు
- బీసీలకు ఏడాదికి రూ.లక్ష కోట్లు బడ్జెట్ కేటాయించాలి
- టీఆర్‌పీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీన్మార్ మల్లన్న


మాట్లాడుతున్న టీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీ ప్రజలపై, అధికారులపై అగ్రవర్ణాల పెత్తనం కొనసాగనివ్వమని తెలంగాణ బీసీ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. రాష్ట్రంలో బీసీల ద్రోహిగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నిలిచాయని అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో టీఆర్‌పీ రాష్ట్ర నూతన కార్యవర్గ సమావేశం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రజినీకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో టీఆర్‌పీ ఎజెండా, డిక్లరేషన్‌ను ప్రకటించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్‌పీ అధికారంలోకి రాగానే టీఆర్‌పీ వరంగల్ డిక్లరేషన్ ద్వారా 10 ఎజెండా తీర్మానాలు అమలు చేస్తామని తెలిపారు. విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం, బీసీలకు రాష్ట్ర బడ్జెట్‌లో ఏడాదికి రూ.లక్ష కోట్ల కేటాయింపులు, తెలంగాణ రాష్ట్రానికి జాతిపితగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరు, కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ఇవ్వాలని డిమాండ్, భూమి లేని 18 లక్షల నిరుపేద బీసీ కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రెండు ఎకరాల చొప్పున పంపిణీతో పాటు అగ్రవర్ణాలలోని నిరుపేదలకు కూడా ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీల రిజర్వేషన్లపై డ్రామాలు చేస్తూ బీసీల ద్రోహిగా నిలిచారని ధ్వజమెత్తారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో పొందుపర్చిన 18 హామీలలో ఒక్కటి కూడా అమలు చేయలేదని అన్నారు. రాష్ట్రంలో 33 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించి గత బీఆర్ఎస్ పార్టీ బీసీలను మోసం చేసిందన్నారు. రాబోయే రోజుల్లో టీఆర్‌పీ పార్టీ బలోపేతానికి అన్ని పార్టీల్లోని బీసీలు కలిసి రావాలని తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు.

జాగృతి పార్టీకి మూడు వేల ఓట్లు లేవని, ఆమెను వాళ్ల నాన్నే (కేసీఆర్) కలవడం లేదని ఎద్దేవా చేశారు. 90 శాతం జనాభా ఉన్న బీసీలం ఎందుకు కలుస్తామన్నారు. బీసీలను అణచివేసేందుకు అగ్రవర్ణాలు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీని తాను వీడలేదని, కాంగ్రెస్ పార్టీయే తనను బయటకు పంపించిందన్నారు. రాబోయే రోజుల్లో టీఆర్‌పీ విధానాలు నచ్చి కాంగ్రెస్ నాయకులు కలిసి వస్తే స్వాగతిస్తామన్నారు.

బీసీలకు 42 శాతం వాటా ఇవ్వాలి..

- ఆ తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి..
- నవంబరు 9న భువనగిరిలో బీసీల రాజకీయ యుద్ధభేరి
- బీసీల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

కాజీపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఆ తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ ఉద్యమాన్ని తీవ్రతరం చేయడానికి నవంబరు 9న భువనగిరిలో లక్షలాది మంది బీసీ సైనికులతో బీసీ రాజకీయ యుద్ధభేరి మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ జిల్లా కాజీపేట ఫాతిమానగర్‌లోని ఓ హోటల్‌లో శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర రాజకీయ మేథోమధన రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరై మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు తమిళనాడు తరహాలో పెంచాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం సిద్ధించి 79 ఏళ్లు పూర్తయినప్పటికీ ఇప్పటివరకు కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ లేకపోవడం వల్ల బీసీలు అన్ని విధాలుగా నష్టపోతున్నారన్నారు. చట్టసభల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాజకీయ రిజర్వేషన్‌లు, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా, బీసీ క్రిమిలేయర్ రద్దు, ఉన్నత న్యాయస్థానాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, రిజర్వేషన్ల అమలు, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్‌లలో రిజర్వేషన్లు కల్పించడానికి దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీకులాల జేఏసీ అధ్యక్షుడు కుందాచారి గణేశ్ చారి, బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి శ్రీనివాస్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముకురాల చంద్రశేఖర్‌తోపాటు వివిధ కుల సంఘాల, విద్యార్థిసంఘాల, కళాకారుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పునఃసమీక్షించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి


హనుమకొండ కలెక్టరేట్ నుంచి వీసీలో పాల్గొన్న కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్19(ఆంధ్రజ్యోతి): ప్రణాళికా ప్రకారం ఓటరు జాబితాపై స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో అదనపు సీఈఓ లోకేష్‌కుమార్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ నిర్వహణ కంటే ముందే ప్రతీ పోలింగ్ బూత్‌స్థాయిలో 2002 ఎస్ఐఆర్ డేటాను, 2025 ఎస్ఐఆర్ డేటాతో పరిశీలన చేసుకోవాలన్నారు. ఈ రెండు జాబితాల్లో కామన్‌గా ఉన్న పేర్లను మినహాయించి 2002 తర్వాత ఓటరుగా నమోదైన వారి వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి ధృవీకరించాల్సి ఉంటుందన్నారు. డీఎల్ఓ సూపర్‌వైజర్లతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ పూర్తిచేసి కార్యాచరణ తయారుచేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, పరకాల, హనుమకొండ ఆర్‌డీఓలు కె. నారాయణ, రమేష్ రాథోడ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిట్‌లో రూ.650 కోట్లతో రీసెర్చ్ పార్క్

- ప్రతిపాదన దశలో ప్రాజెక్టు.. కొనసాగుతున్న చర్చలు
- డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి
- ప్రారంభమైన రెండో రీసెర్చ్ స్కాలర్స్ సమ్మేళనం


నిట్‌లో రెండో రీసెర్చ్ స్కాలర్స్ సమ్మేళాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో రూ.650కోట్లతో రీసెర్చ్‌పార్క్ ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి వెల్లడించారు. అయితే ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్రతిపాదన దశలోనే ఉందని, దీనిపై చర్చలు సాగుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిట్‌కు అధికారం లభించిందని చెప్పారు. శుక్రవారం నిట్‌లో రెండో రీసెర్చ్ స్కాలర్స్ సమ్మేళనం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుబుధి మాట్లాడుతూ.. ఈ రీసెర్చ్ పార్క్ ఏర్పాటుతో పరిశోధన కార్యకలాపాలు మరింత విస్తృతమవుతాయన్నారు. పరిశోధకులు తమ పరిశోధన పత్రాలను ప్రచురించడం, స్టార్టప్‌లను స్థాపించడం, పేటెంట్లు పొందడమే కాకుండా సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. పీహెచ్‌డీ పరిశోధకులు దేశ అభివృద్ధికి వెన్నెముకగా ఉండాలని అన్నారు. గతిశక్తి విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ మనోజ్ చౌదరి ప్రధానోపన్యాసం చేస్తూ.. ప్రయోజనాత్మకమైన పరిశోధనల ఆవసరాన్ని నొక్కిచెప్పారు. వ్యక్తిగతంగా కాకుండా బృందంగా పని చేయడం ద్వారా మానవాళికి ఉపయోగపడే పరిశోధన చేయాలని సూచించారు. పరిశోధకులు పరిశ్రమలతో సన్నిహితంగా పనిచేసి సమస్యలను పరిష్కరించాలని పిలుపునిచ్చారు. వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో అడుగులు కలిపేలా పీహెచ్‌డీ పరిశోధకులు త్వరితగతిన ఆలోచించి అనుసంధానం, చేరవేత, భాగస్వామ్యం, సౌజన్యం అనే మంత్రాన్ని అలవరచుకోవాలన్నారు. నిట్ అకడమిక్ డీన్ ప్రొఫెసర్ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. ఈ సమ్మేళనంలో 125 పీహెచ్‌డీ విద్యార్థులు పోస్టర్లు ప్రదర్శిస్తారని, వారిలో 45 మంది ఓరల్ ప్రజంటేషన్లకు ఎంపికయ్యారని తెలిపారు. ప్రస్తుతం నిట్‌లో 1400 మంది పీహెచ్‌డీ విద్యార్థులు ఉన్నారని, గతేడాది 150 మంది పీహెచ్‌డీ పట్ట భద్రులయ్యారని తెలిపారు. పీహెచ్‌డీ పరిశోధకులు, మాస్టర్స్ విద్యార్థులు, అధ్యాపకులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. పోస్టర్ ప్రదర్శనలు, ఓరల్ ప్రజంటేషన్లు, చర్చలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పీహెచ్‌డీ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ రవిశంకర్, ఆయన బృందం సమన్వయం చేశారు.


కుడా కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న చైర్మెన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి

మెట్ల బావులకు పూర్వ వైభవం

- సుందరీకరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకతీయ రాజులు నిర్మించిన మెట్ల బావులను సుందరీకరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం హనుమకొండలోని 'కుడా' కార్యాలయంలో వైస్ చైర్‌పర్సన్ చహత్ బాజ్‌పాయ్‌తో పాటు హైదరాబాద్ డిజైన్ ఫోరం అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. నగరంలో గతంలో శాశ్వత మంచినీటి సౌకర్యం లేకపోవడంతో అప్పటి కాకతీయ చక్రవర్తులు ప్రజల దాహార్తిని తీర్చేందుకు మెట్ల బావి, శృంగారపు బావి, అక్కా చెల్లెళ్ల బావి, సవతుల బావి, ఎసన్న బావి, కోడికుంట్ల బావి, గడియారం బావి, పీరీల బావి, కొత్తవాడ మెట్ల బావి, కరీమాబాద్ మెట్ల బావి, ఉర్సు దర్గా బావి, వెయ్యి పిల్లర్ల కోనేరు బావి, రైస్‌మిల్లు వద్ద మెట్ల బావులను ఏర్పాటు చేశారన్నారు. అయితే కాలక్రమంలో అవి వాటి వైభవాన్ని కోల్పోయి శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. ఈ బావులను సుందరీకరించి బావుల చుట్టూ పచ్చదనాన్ని ఏర్పాటు చేయాలని వెంకట్రాంరెడ్డి కోరారు. ఈ బావులలో ఉన్న వ్యర్థాలను తొలగించి కూలిపోయిన మెట్లను సరిచేసేందుకు ప్రత్యేక నిపుణులకు పనులు అప్పగిస్తామన్నారు. త్వరితగతిన బావులను సుందరీకరించి పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో 'కుడా' సీపీవో అజిత్‌రెడ్డి, కుడా ఈఈ భీంరావుతో పాటు హైదరాబాద్ డిజైన్ ఫోరం అధికారులు పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న కళాశాల అధ్యాపకులు

వాగ్దేవి కళాశాల పీజీ ఫలితాలు విడుదల

రాంనగర్, సెప్టెంబర్19(ఆంధ్రజ్యోతి): వాగ్దేవి డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలకు చెందిన పీజీ సెకెండ్ సెమిస్టర్ ఫలితాలను శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేషాచలం తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో 87.5శాతం, కంప్యూటర్ సైన్స్‌లో 83.33 శాతం, న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్‌లో 81.81శాతం, ఎమ్మెస్సీ జువాలజీలో 83.33 శాతం, ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో 88.23శాతం విద్యార్థులు ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరీందర్ రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రాజాప్రసాద్, పరీక్షల కంట్రోలర్ దత్తాత్రేయ పాల్గొన్నారు.

మలేషియా అంతర్జాతీయ సదస్సుకు సుమన్



కేయూ క్యాంపస్ సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మలేషియాలో సెప్టెంబరు 18 నుంచి 20 వరకు జరిగే ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సుకు కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్కాలర్ నమిలే సుమన్ హాజరయ్యారు. శుక్రవారం మలేషియాలోని యూనివర్సిటీ టెక్నాలజీలో మరాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో 'ఎఫెక్ట్ ఆఫ్ మెథడ్స్ ఆన్ ట్రైబల్ అండ్ నాన్ ట్రైబల్ యూనివర్సిటీ అథ్లెటిక్స్' అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు. సుమన్ కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో నిట్ ప్రొఫెసర్ పి.రవికుమార్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ స్కాలర్‌గా ఉన్నారు. బీపీఈడీ, ఎంపీఈడీ చదివి అథ్లెటిక్స్‌లో విశేష ప్రతిభ చూపారు. 2022-2024లో జాతీయ, రాష్ట్రస్థాయిల్లో జరిగిన పోటీల్లో బంగారు పతకాలను సాధించారు. మహిళలు, పురుషుల అథ్లెటిక్స్ కోచ్‌గా శిక్షణ ఇచ్చారు. జనగామ ధర్మకంచ ప్రాంతానికి చెందిన సుమన్.. తల్లిదండ్రులు ఎల్లయ్య, బాలమణిల ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు.

7 నుంచి బీ ఫార్మసీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ సీబీసీఎస్‌ఈ బీఫార్మసీ రెండో సెమిస్టర్ పరీక్షలు అక్టోబరు 7 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎమ్డీ అసీం ఇక్బాల్‌లుగా శుక్రవారం తెలిపారు. అక్టోబరు 7, 9, 13, 15 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాల, కిషన్‌పుర వాగ్దేవి కళాశాల, ములుగురోడ్డులోని సహస్ర, శివానీ ఫార్మసీ కళాశాలలు, ఓగ్లాపూర్‌లోని కేర్ ఫార్మసీ కళాశాల, కరీమాబాద్‌లోని తాళ్ళపద్మావతి ఫార్మసీ కళాశాల, జనగామలోని జనగామ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, కొత్తగూడెం పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబుబాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పరీక్షకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

15 నుంచి బీఫార్మసీ సప్లమెంటరీ పరీక్షలు

కేయూ పరిధిలోని నాన్ సీబీసీఎస్ మొదటి ఏడాది సప్లమెంటరీ పరీక్షలను అక్టోబరు 15నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు శుక్రవారం ప్రకటించారు. అక్టోబరు 15, 16, 17తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాల కోసం కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

అక్టోబరు 15వరకు కేయూ డిగ్రీ 1,3,5 సెమిస్టర్ ఫీజు గడువు

కేయూ పరిధిలోని డిగ్రీ బీఏ, బీకామ్, బీఎస్సీతో పాటు ఇతర కోర్సుల 1, 3, 5 సెమిస్టర్ పరీక్షల ఫీజులను అక్టోబరు 15 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో అక్టోబరు 22 వరకు ఫీజులు చెల్లించుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు కేయూవెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు.

సెప్టిక్‌ట్యాంక్‌ల క్లీనింగ్‌కు ప్రణాళికలు సిద్ధం చేయండి



జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

ఆస్కి అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర వ్యాప్తంగా సెప్టిక్ ట్యాంక్‌ల క్లీనింగ్‌కు ప్రణాళికలు సిద్ధం చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. శుక్రవారం జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో (ఆస్కీ) అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ చట్టం 2016 ప్రకారం ప్రజల ఆరోగ్య సంరక్షణ దృష్ట్యా నగరంలోని ఇండ్ల యజమానులు మూడేళ్లకోసారి సెప్టిక్ ట్యాంక్‌లను శుభ్రం చేయించాలన్నారు. ఇందుకు అనుగుణంగా వరంగల్ అమ్మవారిపేటలోని 150 కేఎల్‌డీ సామర్థ్యంతో ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీపీ)ని ఏర్పాటు చేశామన్నారు. ఆస్కీ నిర్వాహకులు యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్కీ ప్రతినిధులు డాక్టర్ రాజమోహన్‌రెడ్డి, అవినాష్, ప్రొఫెసర్ స్నేహలత, కుడా సీపీవో అజీత్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనల మేరకే అనుమతులు

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేస్తున్నామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. శుక్రవారం ఖమ్మం రోడ్డులోని ఫాదర్ కొలంబో ఆస్పత్రి ప్రాంతంలోని భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఇండ్లను తనిఖీ చేశారు. కట్టడాల కొలతలను స్వయంగా పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి వారు సమర్పించిన పత్రాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ఇర్షాద్, సర్వేయర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎస్‌పీవీని కొనసాగించండి

భవిష్యత్ అవసరాల కోసం ఎస్‌పీవీని కొనసాగించాలని స్మార్ట్‌సిటీ మిషన్ డైరెక్టర్ రాజీవ్‌శర్మ సూచించారు. శుక్రవారం న్యూఢిల్లీ నుంచి దేశంలోని వివిధ మునిసిపాలిటీల కమిషనర్‌లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్ నుంచి కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ వర్చువల్‌గా పాల్గొన్నారు. వరంగల్ నగరంలో ఇప్పటివరకు స్మార్ట్‌సిటీ నిధుల నుంచి పూర్తిచేసిన పనులు, మిగిలి ఉన్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజీవ్‌శర్మ అధికారులకు పలు సూచనలు చేశారు. స్మార్ట్‌సిటీ పనులు పెద్ద మొత్తంలో మిగిలి ఉన్న నేపథ్యంలో డిసెంబరు వరకు గడువును పొడిగించామన్నారు. ఈ మేరకు త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. కొన్ని అభివృద్ధి పనులు ఇంకా కొనసాగుతున్నాయని, వాటిని త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో స్మార్ట్‌సిటీ పీఎంసీ ఆనందం ఓలేటీతో పాటు గ్రేటర్ అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చెస్ క్రీడా శిక్షణ శిబిరం

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కన్నా చెస్ ఆకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 21నుంచి 30వ తేదీ వరకు నాలుగేళ్ల వయస్సు నుంచి 15 ఏళ్ల వయస్సు కలిగిన బాలబాలికలకు చెస్ క్రీడలో శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు కన్నా చెస్ అకాడమీ నిర్వాహకులు కన్నా తెలిపారు. విద్యార్థులకు దసరా సెలవులు సమీపించడంతో వారి మనస్సును క్రీడల వైపు మళ్లించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు చొరవ తీసుకొని చెస్ క్రీడలో శిక్షణ ఇప్పించడానికి సహకరించాలని కన్నా కోరారు. ప్రతీరోజు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వరంగల్‌లోని రామన్నపేట కన్నా చెస్ అకాడమీలో నామమాత్రపు ఫీజుతో విద్యార్థులకు చెస్‌లో నిష్ణాతులైన ఆర్బిటర్ల పర్యవేక్షణలో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు మరిన్ని వివరాలకు సెల్ 9059522986 నెంబర్‌లో సంప్రదించాలని కన్నా సూచించారు.

నేడు విజ్ఞాన పీఠంలో ఎంఏ తెలుగు స్పాట్ అడ్మిషన్లు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ హంటర్‌రోడ్‌లోని తెలుగు యూనివర్సిటీ జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో శనివారం ఎంఏ తెలుగు అడ్మిషన్ల కోసం స్పాట్ నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు హాజరు కావాలని ఆయన కోరారు.

నల్లబెల్లం పట్టివేత

వరంగల్ క్రైం, సెప్టెంబర్19(ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వేస్టేషన్ పరిసరాల్లో రవాణాకు సిద్ధంగా ఉన్న సుమారు రూ.65వేల 550విలువ చేసే 4క్వింటాళ్ల నల్లబెల్లాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మదుసూధన్ తెలిపారు. నిందితుడు నెక్కొండ మండలం చంద్రుగొండకు చెందిన బాదావత్ అవినాష్‌ను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

వరంగల్ నుంచి ఉప్పల్‌కు ప్రత్యేక బస్సులు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకొని వరంగల్ రీజియన్ పరిధిలో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వరంగల్ ఆర్టీసీ ఆర్ఎం డి.విజయభాను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 1,284 ప్రత్యేక బస్సులు ఉప్పల్ నుంచి హనుమకొండకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్ రీజినల్ పరిధిలోని హనమకొండ డిపో 235, జనగామ డిపో 197, వరంగల్ -1 డిపో 228, వరంగల్ -2 డిపో 104, మహబూబాబాద్ డిపో 77, నర్సంపేట డిపో 166, పరకాల డిపో 138, తొర్రూరు డిపో 66 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం తెలిపారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటే అదనపు బస్సులు నడిపిస్తామని పేర్కొన్నారు.

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు సిద్ధం చేయాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



బతుకమ్మ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ ప్రారంభోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం రాత్రి బతుకమ్మ ప్రారంభోత్సవ ఏర్పాట్లు, నిర్వహణపై మున్సిపల్, రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 21న హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రారంభ వేడుకలకు మంత్రులు కొండా సురేఖ, దనసరి అనసూయ, జూపల్లి క్రిష్ణారావులతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో మేన శ్రీను, సంబంధిత శాఖా అధికారులు పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి

నిబంధనలకు ఆమోదయోగ్యమైన భూభారతి దరఖాస్తులను వారం రోజుల్లోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆర్‌డీఓలు, తహసీల్దార్‌లను ఆదేశించారు. భూభారతి దరఖాస్తులు, ప్రభుత్వ భూములపై శుక్రవారం రాత్రి ఆర్‌డీఓలు, తహసీల్దార్‌లతో కలెక్టర్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూభారతి దరఖాస్తులు ఇప్పటివరకు పరిష్కరించినవాటి సంఖ్య, ఇంకా పరిష్కారమయ్యే ధరఖాస్తులు, 20ఏ కిందకు వచ్చే భూములు, సాదాబైనామా, ఫారెస్టు భూములు, శిఖం భూములు, తదితర రెవెన్యూ అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. మండలాల వారిగా పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను తహసీల్దార్లు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలోని ప్రభుత్వ చెరువు శిఖం, అసైన్డ్ తదితర భూముల సమగ్ర వివరాలను అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్, హనుమకొండ, పరకాల ఆర్‌డీఓలు రమేష్ రాథోడ్, డాక్టర్ కె.నారాయణ, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులను పరిష్కరించండి

అధికారులకు వరంగల్ కలెక్టర్ సత్యశారద ఆదేశాలు



వరంగల్ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతూ బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని కలెక్టర్ సత్యశారద సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అట్రాసిటీ కేసుల పెండింగ్, పురోగతిపై అధికారులతో సమీక్షించారు. కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. పెండింగ్ ట్రయల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో అట్రాసిటీ అంశాలపై ముడిపడి ఉన్న సంఘటనల గురించి ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతినెలా తప్పనిసరిగా గ్రామాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించే సమావేశానికి తహసీల్దార్, ఎస్‌హెచ్‌వోలు, సంబంధిత శాఖల అధికారులు హాజరుకావాలన్నారు. గ్రామాల్లో గుడుంబా, గంజాయిని అరికట్టేందుకు ఎక్సైజ్ అధికారులు శ్రద్ధ పెడుతూ, కళాజాత బృందాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన అంశాలను పరిగణలోకి తీసుకొని సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఏసీపీ శుభం ప్రకాశ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సౌజన్య, సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మురళి, డీఈవో రంగయ్య నాయుడు, డీడబ్ల్యూవో రాజమణి, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, ఏసీపీలు రవీందర్, వెంకటేశ్, మానిటరింగ్ కమిటీ సభ్యులు బిర్రు మహేందర్, చిన్నస్వామి, యాదగిరి, మహేందర్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. ఎరిక్సన్ టీపీఏ, ఇంటిగ్రో హైదరాబాద్, ప్రమోద హాస్పిటల్ హనుమకొండ సౌజన్యంతో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సెర్ప్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ బీపీ చెక్ చేయించుకున్నారు. కార్డియాలజీ, యూరాలజీ, వస్క్యులర్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఈసీజీ, బీపీ, 2డీ ఇకో తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో రామిరెడ్డి, వైద్యులు సందీప్, లిల్లీ, విష్ణువర్ధన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రశీదులపై హెచ్‌యూఐడీ కోడ్ ముద్రించడం లేదు

హనుమకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బంగారు ఆభరణాల వర్తకులు తాము అమ్మకం చేసే బంగారు ఆభరణాలపై వాటి నాణ్యతా ప్రమాణాలను తెలియచేసే హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ (హెచ్‌యూఐడీ) కోడ్‌ను ముద్రించడం లేదని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, దక్షిణాదిరాష్ట్రాల ప్రధాన కార్యదర్శి మొగిలిచెర్ల సుదర్శన్ శుక్రవారం చెన్నైలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు చేశారు. నాణ్యతకు గుర్తు అయిన ఆరు డిజిట్ నెంబర్లను రశీదుపై రాయకపోవడం వల్ల నాణ్యత విషయంలో మోసపోయిన వినియోగదారులు కోర్టులను ఆశ్రయించలేకపోతున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. బంగారు ఆభరణాల వర్తకులు కావాలనే వినియోగదారులను తప్పుతోవ పట్టిస్తున్నారని తెలిపారు. బంగారం, వెండి ఆభరణాల నాణ్యత విషయంలో వినియోగదారులను మోసగించిన హనుమకొండలోని రెండు కార్పొరేట్ ఆభరణాల దుకాణాలపై వినియోగదారుల కోర్టులో విచారణ జరుగుతున్న విషయాన్ని ఈ సందర్భంగా వారు తమ ఫిర్యాదులు గుర్తు చేశారు. కనుక బంగారు ఆభరణాల కొనుగోలుదారులకు రశీదులపై హెచ్‌యూఐడీ నెంబర్ తప్పనిసరిగా రాసేలా ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు. అనంతరం దక్షిణాది రాష్ట్రాల్లో హెచ్‌యూఐడీ ప్రచార కార్యక్రమాన్ని చక్రపాణి, సుదర్శన్‌లు ప్రారంభించారు. వినియోగదారుల మండలి తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు కె.మణికందన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.నరసింహన్‌లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొడుకును హత్యచేసిన తండ్రికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యంతో బాధపడుతున్న కొడుకును హత్య చేసిన తండ్రిపై నేరం రుజువైనందున యావజ్జీవ కారాగారా శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి బి.అపర్ణాదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. సాక్ష్యాధారాలు చెరపివేసినందుకు మూడేళ్ల కఠిన కారాగారా శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించాల్సిందిగా న్యాయమూర్తి తీర్పులో వెలువరించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. హసన్‌పర్తి మండలం పెగడపెల్లి గ్రామానికి చెందిన తాళ్లపెల్లి పున్నంచంద్‌కు రమాదేవితో 15 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు కాగా, పుట్టినప్పటి నుంచి శారీరకంగా, మానసికంగా అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. దీంతో చాలారోజులుగా మానసిక రుగ్మతలకు చికిత్స చేయించారు. అదే విధంగా హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రిలో కూడా చికిత్స అందించారు. అయినప్పటికీ మార్పు రాకపోగా మరింతగా ఆరోగ్యం క్షిణించింది. దీంతో తండ్రి తాళ్లపెల్లి పున్నం చంద్ అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడిని 2023 ఏప్రిల్ 20న ఇంట్లో ఎవరూ లేని సమయంలో తీవ్రంగా కొట్టి హత్య చేశాడు. కాగా, తన మనవడిని తన కొడుకు పున్నంచంద్ హత్యచేశాడని నిందితుడి తల్లి తాళ్లపెల్లి సుజాత పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి జీవితఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ కె.రాజేందర్ సాక్షులను ప్రవేశపెట్టగా సీఐలు పి.దయాకర్, ఎస్.రవికుమార్ కేసు దర్యాప్తు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కేసు వాదించారు.



విద్యార్థులతో సీపీ సన్‌ప్రీత్ సింగ్, డీసీపీ, ఇతర శాఖల అధికారులు

బాలలకు విద్య ఎంతో ముఖ్యం

పిల్లల్ని పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు : పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

ఆపరేషన్ ముస్కాన్‌లో గుర్తించిన 62 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

వరంగల్ క్రైం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నిరాదరణకు గురవుతున్న బాలలకు విద్యను అందించడమే ప్రధాన లక్ష్యమని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో గుర్తించబడిన ఇతర రాష్ట్రాల నుంచి వలసవచ్చిన 62 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఆధ్వర్యంలో ఏనుమాములలోని ఎస్టీ ఆర్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీ మాట్లాడుతూ.. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో పోలీస్, ఇతర శాఖల సహకారంతో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి రెస్క్యూ చేశామన్నారు. పిల్లలకు పూర్తిస్థాయి పునరావాసం జరగాలంటే విద్యను అందించడమే ప్రాథమిక లక్ష్యంగా ఏర్పరుచుకుని బిహార్, ఒడిశా నుంచి వచ్చిన 62మంది పిల్లలను మండల ప్రజాపరిషత్ పాఠశాలలో చేర్పించి పూర్తి సహాయ సహకారాలు అందించామన్నారు. పిల్లల్ని పనిలో పెట్టుకునే వ్యాపారస్తులపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ మాట్లాడుతూ.. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి చొరవ తీసుకోవడం తెలంగాణ రాష్ట్రంలోనే ప్రథమమన్నారు. ఈ పిల్లల్లాగానే ఇతర పని ప్రాంతాలలో పనిచేసే విద్యార్థులకు ఏర్పాట్లు చేసే దిశగా ప్రయత్నం చేస్తామన్నారు. ఈ సందర్భంగా సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచిత బ్యాగులు, పుస్తకాలు, ఇతర సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మామునూరు ఏసీపీ వెంకటేష్, ఏనుమాముల ఎస్‌హెచ్‌ఓ సురేష్‌కుమార్, ఇన్స్‌పెక్టర్ శ్యాంసుందర్, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వి.వసుధ, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ సిస్టర్ సహాయ, సంస్థ కోఆర్డినేటర్లు ఎర్ర శ్రీకాంత్, బత్తుల కరుణ పాల్గొన్నారు.

కాశిబుగ్గ దసరాతో కొత్త చిక్కు



ఉత్సవాలు జరిగేది వర్ధన్నపేట నియోజకవర్గంలో..

- ముఖ్య అతిథులుగా హాజరయ్యేది కొండా దంపతులు
- మావాళ్ల పరిస్థితేమిటంటున్న స్థానికులు

వరంగల్ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొండా సురేఖ దంపతులకు దసరా ఉత్సవాల చిక్కు రానున్నదా? ఈ చర్చ ఇప్పుడు కాశిబుగ్గలో జోరుగా సాగుతోంది. కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి గత 30 ఏళ్లుగా ఏటా దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తోంది. మొదట్లో ఉత్సవాలను ప్రస్తుత ఓసిటీ శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయం ఎదుట నిర్వహించేవారు. తరువాత ఓ సిటీ స్టేడియంలో కొన్ని సంవత్సరాలు నిర్వహించారు. గత రెండేళ్లుగా చిన్న వడ్డేపల్లి చెరువు సమీపంలో నిర్వహిస్తున్నారు. అయితే చిన్న వడ్డేపల్లి చెరువు ప్రాంతం 14వ డివిజన్ వర్ధన్నపేట నియోజకవర్గం కిందకు వస్తుంది. దసరా ఉత్సవాలు నిర్వహించే వారు వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన వారు కావడంతో తూర్పు ప్రజాప్రతినిధులను అతిథులుగా పిలవడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో ఈ సారి ముఖ్య అతిథులుగా మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆహ్వానించనున్నారు. ఇక్కడ అసలు చిక్కు వస్తోంది. ఉత్సవ స్థలం (14వ డివిజన్) వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోకి వస్తున్నందున 'మా ఎమ్మెల్యేను ముఖ్య అతిథిగా పిలుచుకుని మేమే దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం" అని ఆ డివిజన్ నాయకులు అంటున్నారు. తమ ప్రాధాన్యత లేకుండా ఉత్సవాలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ వివాదం ఇలాగే కొనసాగితే కొండా దంపతులు మరో వివాదంలో చిక్కుకునే ప్రమాదం ఉందని కొండా అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిధి దాటితే ప్రమాదమేనా..?

కొద్ది నెలలుగా మంత్రి కొండా సురేఖ దంపతులకు.. ఇతర ఎమ్మెల్యేలకు మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ఇటీవల పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తన నియోజకరవ్గంలో తనకు తెలియకుండా ధర్మకర్తలను ఎలా నియమిస్తారని మంత్రి సురేఖను ప్రశ్నించిన విషయం తెలిసిందే.. దీంతో ఒకరి నియోజకవర్గం పరిధిలో మరొకరు జోక్యం చేసుకోవద్దని అధిష్టానం కండీషన్ పెట్టింది. ఈ నేపథ్యంలో వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలో జరిగే ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా మంత్రి సురేఖ, మురళీధర్‌రావు వెళితే.. స్థానిక ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు , స్థానిక ప్రజాప్రతినిధులు మంత్రిని ప్రశ్నించే అవకాశం ఉంటుందని స్థానికులంటున్నారు. కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి నాయకులు ఈ విషయం తెలిసి చేస్తున్నారా..? తెలియక చేస్తున్నారా.. అని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ముందుగా ఏనుమాముల ప్రాంత నాయకులతో, వర్ధన్నపేట శాసన సభ్యుడితో మాట్లాడాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. తమ ప్రాంతంలో ఉత్సవాలు నిర్వహిస్తూ కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి నాయకులు తమకు ప్రాధాన్యం ఇవ్వకుండా పెత్తనం చేస్తున్నారని ఏనుమాముల వాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రెండు సంవత్సరాలుగా స్థానిక కార్పొరేటర్‌కు సైతం గౌరవం ఇవ్వడం లేదని మండిపడుతున్నారు. స్థానిక నాయకులను, ప్రజా ప్రతినిధులను భాగస్వాములుగా చేస్తూ కార్యక్రమాలను నిర్వహిస్తే బాగుంటుందని అభిప్రాయ పడుతున్నారు.

ముల్కనూర్ సభ్యులకు దసరా బోనస్



సభకు హాజరైన రైతులు



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి

- రూ.3.70కోట్లు ప్రకటించిన అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి
- రూ.410కోట్లతో బ్యాంకు టర్నోవర్, రూ.13కోట్ల రాయితీలు
- ముల్కనూరు బ్యాంకు వార్షిక మహాసభలో నిర్ణయాలు

భీమదేవరపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముల్కనూర్ సహకార బ్యాంకు సభ్యులకు రూ.3.70కోట్లు దసరా పండుగ సందర్భంగా రైతులకు బోనస్ అందజేస్తున్నామని బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి వెల్లడించారు. అలాగే, వివిధ పథకాల కింద ఈయేడు రూ.13 కోట్ల రాయితీలను అందజేసినట్లు తెలిపారు. శుక్రవారం మండలంలోని ముల్కనూర్ బ్యాంకులోని జిన్నింగ్ మిల్లు ఆవరణలో 69వ వార్షిక మహాసభ బ్యాంకు అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా వ్యవస్థాపక అధ్యక్షుడు అల్గిరెడ్డి కాశివిశ్వనాథరెడ్డి విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు 69వ వార్షిక నివేదిక లోన్ మేనేజర్ రాజమౌళి సభకు వివరించారు. అనంతరం బ్యాంకు అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ముల్కనూర్ సహకార బ్యాంకులో 2025లో ధాన్యం సేకరణ, బియ్యం అమ్మకాలు, వరిసీడ్ విత్తనాల అమ్మకాలు, పత్తి కొనుగోళ్ల తదితర అంశాల్లో రూ.410 కోట్ల వ్యాపారం నిర్వహించామన్నారు. ఇందులో రూ.7.08కోట్ల లాభాలు వచ్చాయన్నారు. సన్నరకాలు పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.200, పత్తికి క్వింటాల్‌కు రూ.300, సీడ్‌కు క్వింటాల్‌కు రూ.125, దొడ్డు రకం వడ్లకు రూ.100 చొప్పున బోనస్‌ను రైతులకు అందిస్తామన్నారు. బ్యాంకులోని 163 మంది సభ్యులు చనిపోతే పంట మాఫీ పథకం కింద రూ.1.20కోట్లు మాఫీ చేశామన్నారు. దహన సంస్కారాల కోసం రూ.33లక్షలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రూ.20లక్షలు, వృద్ధాప్య పింఛన్ రూ.77లక్షలు, కళ్ల ఆపరేషన్ కోసం రూ.10లక్షలు అందించామన్నారు. కిందటేడు వాటాధనం నుంచి 15 శాతంలాభాలు రూ.3కోట్లు అందించామన్నారు. రైతులకు ఖరీఫ్, రబీ సీజన్‌లో రూ.246కోట్ల రుణాలు అందించామన్నారు.సమావేశానికి 5600 మంది రైతులు హాజరయ్యారు. మధ్యకాలిక, దీర్ఘకాలిక అప్పులు రూ.10కోట్ల రుణాలు రైతులకు అందించామన్నారు. ఇలా పలు సంక్షేమ పథకాలతో రైతులకు రూ.13కోట్ల రాయితీలు అందించామన్నారు. ఈ యేడు కొత్తగా జగన్నాథపూర్, రత్నగిరి గ్రామాల్లో గోదాముల నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. అలాగే బ్యాంకులో పనిచేసే ఉద్యోగులకు, సందర్శకుల కోసం డైనింగ్ హాల్‌ను నిర్మిస్తామన్నారు. బ్యాంకులో అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి అనే రైతు కోరారు.

ఈ సమావేశంలో బ్యాంకు జనరల్ మేనేజర్ మార్పాటి రాంరెడ్డి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సతీష్, వెంకటేశ్వర్‌రావు, బ్యాంకు ఉపాధ్యక్షుడు గజ్జి వీరయ్య, డైరెక్టర్లు కాశిరెడ్డి వసంత, కంది రవీందర్‌రెడ్డి, అంబాల రాములు, ఈర్ల మూగయ్య, బేల కనుకమ్మ, బొల్లంపల్లి కుమారస్వామి, మండ శ్రీనివాస్, వీరారెడ్డి, మహేందర్, గణవేణ శ్రీనివాస్, గుగ్లోతు బాషు, చెవ్వాల బుచ్చయ్య, గుర్రాల భాస్కర్‌రెడ్డితో పాటు బ్యాంకు రైతులు పాల్గొన్నారు.

నిశ్చితార్థం ఒకరితో.. పెళ్లి మరొకరితో..

- రెడ్డికాలనీలో ఓ యువకుడి నిర్వాకం
- నిందితుడి ఇంటి ఎదుట బాధితురాలి ఆందోళన

వరంగల్ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిశ్చితార్థం తనతో చేసుకుని.. వివాహం మరొక యువతితో చేసుకోబోతున్నాడని గ్రహించిన ఖమ్మం మోతీనగర్‌కు చెందిన యువతి.. కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం హనుమకొండ రెడ్డికాలనీలోని యువకుడి ఇంటి ఎదుట ఆందోళన నిర్వహించింది. విషయం తెలుసుకున్న హనుమకొండ పోలీసులు ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ కిశోర్ కుమార్ కథనం ప్రకారం.. హనుమకొండ రెడ్డికాలనీకి చెందిన ఎలపోతల లింగయ్య కుమారుడు సుమన్ కిందటేడు మార్చిలో ఖమ్మంకు చెందిన యువతితో నిశ్చితార్థం చేసుకున్నాడు. ఈ సందర్భంగా రూ.15లక్షల కట్నం ఇచ్చేందుకు యువతి తల్లిదండ్రులు ఒప్పుకున్నారు.

కాగా, అప్పటికే వరంగల్ కొత్తవాడకు చెందిన మరో యువతితో ప్రేమలో ఉన్న సుమన్.. ఎంగేజ్‌మెంట్ చేసుకున్న అమ్మాయిని దూరం పెడుతూ వచ్చారు. మీ కుటుంబ మర్యాదలు బాగలేవని, నిన్ను చేసుకోనని అంటూ వస్తున్నాడు. ఎంగేజ్‌మెంట్ అయ్యాక పెళ్లి ఎలా రద్దు చేస్తామని అమ్మాయి తరఫున బంధువులు ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఈ యేడు తాను ప్రేమించిన అమ్మాయిని సుమన్ వివాహం చేసుకున్నాడు. ఫేస్‌బుక్‌లో సుమన్ ఓ అమ్మాయితో చనువుగా ఉన్న ఫొటోను గమనించిన ఖమ్మంకు చెందిన యువతి.. శుక్రవారం విషయం తెలుసుకునేందుకు రెడ్డికాలనీకి రాగా, సుమన్ మరో యువతిని వివాహం చేసుకున్నట్లుగా తెలిసింది. వెంటనే తన వెంట వచ్చిన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి యువకుడి ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. విషయం తెలుసుకున్న హనుమకొండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఎంగేజ్‌మెంట్ సమయంలో ఒప్పుకున్న రూ.15లక్షల కట్నంలో రూ.6లక్షల నగదు రూపంలో, రూ.రెండున్నర లక్షలు గూగుల్‌పే ద్వారా ఇచ్చినట్లుగా అమ్మాయి కుటుంబ సభ్యులు తెలుపుతుండగా రూ.రెండున్నర లక్షలు మాత్రమే ఇచ్చారని అబ్బాయి తల్లిదండ్రులు చెబుతున్నారని ఎస్‌ఐ తెలిపారు. కాగా, ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, ఖమ్మంలోనే ఫిర్యాదు చేస్తామని అమ్మాయి తరఫు బంధువులు వెళ్లిపోయినట్లు ఎస్సై తెలిపారు.



రెడ్డికాలనీలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న యువతి కుటుంబ సభ్యులు

బస్సు ఆపలేదని డ్రైవర్‌పై దాడి

ఇద్దరిపై కేసు నమోదు

కేసముద్రం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బస్సు ఆపలేదని ఆర్‌టీసీ డ్రైవర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటన కేసముద్రం స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మురళీధర్‌రాజ్ తెలిపిన ప్రకారం మహబూబాబాద్ నుంచి వరంగల్ వెళుతున్న ఆర్‌టీసీ బస్సును డ్రైవర్ టి.విష్ణుమూర్తి ధన్నసరి క్రాస్ రోడ్డు వద్ద ప్రయాణీకులు దిగేందుకు నిలిపాడు. ఆ తర్వాత బడితండా వద్ద బస్సు ఆపాలని అక్కడ ఓ మహిళ చేయి పెట్టి ఆపగా అప్పటికే 92 మంది ప్రయాణీకులతో కిక్కిరిసి ఉండడంతో వెనుక వచ్చే బస్సులో రావాలని సూచించి, ఆ బస్సును ఆపలేదు. నేరుగా గాంధీసెంటర్‌కు వచ్చి ప్రయాణీకులు దిగేందుకు బస్సును డ్రైవర్ ఆపాడు. సదరు మహిళను బడితండాకు చెందిన భిక్షపతి బైక్‌పై గాంధీసెంటర్‌లో ఉన్న బస్సు వద్దకు తీసుకువచ్చి డ్రైవర్‌తో వాగ్వావాదానికి దిగాడు.

బస్సు ఎందుకు ఆపలేదని వాదనకు దిగగా, అదే సెంటర్లో టీస్టాల్ నిర్వహించే మహేందర్ వచ్చి డ్రైవర్‌ను దూషిస్తూ కొట్టాడు. దీంతో డ్రైవర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



కేసముద్రం పోలీస్‌స్టేషన్ వద్ద నిలిచిన ఆర్‌టీసీ బస్సు

ఈ సందర్భంగా బస్సును డ్రైవర్ పోలీస్‌స్టేషన్ వద్ద నిలపడంతో ప్రయాణీకులు వెనుక వచ్చే మరో బస్సులో వెళ్లిపోయారు.

టీఎస్‌ఆర్‌జేసీలో సూసైడ్ నోట్ కలకలం

హసన్‌పర్తి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రగట్టు గుట్ట క్రాస్‌రోడ్డులోని తెలంగాణ బాలికల గురుకుల కళాశాలలో ఓ విద్యార్థిని 'సూసైడ్ నోట్' కలకలం రేపుతోంది. కళాశాలలో నలుగురు విద్యార్థినులు మూడు రోజుల కిందట సూసైడ్ చేసుకునేందుకు నిర్ణయించుకున్నారని, వీరిలో ఒకరు సూసైడ్ నోట్ రాసినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ విషయం కళాశాల సిబ్బందికి తెలియడంతో విద్యార్థినిలకు కౌన్సిలింగ్ చేశారని తెలిసింది. అయితే విద్యార్థినిలు ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు..? అనేది తెలియరావడం లేదు. కళాశాలలోని ఇద్దరు సిబ్బంది వ్యవహరించిన తీరుతోనే విద్యార్థినిలు మనస్థాపానికి లోనై ఆత్మహత్యకు సిద్ధపడినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై ప్రధానోపాధ్యాయురాలు ఇందుమతిని వివరణ కోరగా ఓ విద్యార్థిని సూసైడ్ నోట్ రాసుకున్నది నిజమేనని, అయితే ప్రస్తుతం సమస్య సద్దుమణిగిందని చెప్పారు.



నెక్కొండ మండలం అప్పల్ రావుపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అన్న గాయపడిన తమ్ముడు



దాన్య (ఫైల్)

అంత్యక్రియలకు వెళ్లొస్తూ.. అనంతలోకాలకి..

- ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి
- లారీ కింద పడిన ద్విచక్రవాహనం
- తమ్ముడి కళ్లేదుటే అన్న మృతి
- ప్రమాదంలో గాయపడ్డ తమ్ముడు

నెక్కొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సమీప బంధువు అంత్యక్రియలకు వెళ్లివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్న మృతి చెందగా తమ్ముడు గాయపడిన ఘటన నెక్కొండ మండలం అప్పల్‌రావుపేట గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో ఖానాపురం మండలం మంగళవారిపేట గ్రామశివారు బోటిమీది తండాకు చెందిన రైతు గుగులోతు దాన్య (47) తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండ మండలం బొల్లికొండ గ్రామంలో దగ్గరి బంధువు దారవత్ సరీరాం అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం అంత్యక్రియలకు హాజరైన దాన్య అతని తమ్ముడు ఈర్యతో కలసి ద్విచక్ర వాహనంపై నెక్కొండకు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో ఇదే రోడ్డులో ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టెక్ చెస్తుండగా ఎదురుగా ఆటో రావడంతో ఆటోను తప్పించే క్రమంలో లారీ కింద పడ్డారు. దాన్య తలపగలడంతో అక్కడికక్కడే మృతి చెందగా, ఈర్య కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలపాలయ్యాడు. తన కళ్లెదుటే అన్న మృతి చెందడాన్ని తట్టుకోలేక ఈర్య విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఘటన స్థలం నుంచి లారీ ఆపకుండా వెళ్లిపోవడంతో లారీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రమాద విషయమై ఆటో డ్రైవర్‌ను పోలీసులు ప్రశ్నించడానికి ప్రయత్నించగా ఆటో డ్రైవర్‌కూడా పరారీలో ఉండటంతో డ్రైవర్ ఆచూకీ కోసం పోలీసులు వెతుకుతున్నారు. ఈ ప్రమాదంలో ఆటోలోని ప్రయాణీకులకు కూడా స్వల్పగాయాలైనట్లు తెలిసింది. సంఘటన స్థలానికి చెరుకున్న ఎస్సై మహేందర్ మృతదేహాన్ని పోస్టుమార్టంనకు, గాయపడిన ఈర్యను ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య విజయ, కూతురు ఉన్నారు.



ఐపీపీఆర్‌ఎస్ సెంటర్ల మూసివేత

- హనుమకొండ, భూపాలపల్లి పోస్టాఫీసుల్లో నిలిచిన రైల్వే రిజర్వేషన్లు
- రిజర్వేషన్లు జరగటం లేదన్న కారణంతో మూసివేత
- ఎంపీ డాక్టర్ కావ్య చొరవ తీసుకోవాలని ప్రయాణికుల విజ్ఞప్తి

హనుమకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దన్నరకాలంగా ప్రజలకు రైల్వే రిజర్వేషన్ సేవలను అందిస్తున్న హనుమకొండ హెడ్ పోస్టాఫీసు, భూపాలపల్లిలోని పోస్టల్ సూపరింటెండెంట్ ఆఫీసులోని ఇండియన్ పోస్టు ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (ఐపీపీఆర్‌ఎస్) కౌంటర్లు మూతపడ్డాయి. రైల్వే రిజర్వేషన్ల కార్యకలాపాలు జరగని, లేదా రోజుకు పదికన్నా తక్కువ రిజర్వేషన్లు అవుతున్న ఐపీపీఆర్‌ఎస్ సెంటర్లను మూసివేయాలని భారతీయ తపాలా శాఖ నిర్ణయించింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా 165 సెంటర్లను మూసివేయనున్నది. ఇందులో భాగంగా హనుమకొండలోని హెడ్ పోస్టాఫీసు, భూపాలపల్లి ఎస్‌పో పోస్టాఫీసులోని ఐపీపీఆర్‌ఎస్ సెంటర్లను కూడా మూసింది. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 15 సెంటర్లను మూసివేయాలని నిర్ణయించిన తపాలా శాఖ.. ఇప్పటికే ఎనిమిదింటిని బంద్ చేసింది. మిగిలిన ఏడింటి సెంటర్ల మూసివేత ప్రక్రియను ఈనెల 9వ తేదీలోగానే పూర్తిచేసి ఈనెల 12వ తేదీ నాటికి రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ సెంటర్లలోని ఐపీపీఆర్‌ఎస్ పరికరాలను, ఇతర సామానులను రైల్వే అధికారులకు అప్పగించాలని పోస్టుమాస్టర్ జనరల్ పోస్టాఫీజు అధికారులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. దీనితో ఈనెల 12 నుంచి సెంటర్లు మూతపడ్డాయి. మరో ఐదు జగిత్యాల, ఎస్‌వీపీఎన్‌పీఏ, హయకత్‌నగర్, సిరిసిల్ల ఎల్‌ఎస్‌జీ ఎస్‌వో, సెంట్రల్ సెక్రెటేరియేట్‌లలోని సెంటర్లు ఈ యేడు నవంబర్ నెలాఖరు వరకు కొనసాగించి ఆ తర్వాత వాటి పనితీరును బట్టి నిర్ణయం తీసుకుంటారు.

ప్రజలకు ఇబ్బందులు

హనుమకొండ హెడ్‌పోస్టాఫీసు, భూపాలపల్లి పోస్టాఫీపులోని ఐపీపీఆర్‌ఎస్ సెంటర్లలో రైల్వే రిజర్వేషన్ల సేవలను నిలిపివేతతో గర ప్రజలు, ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్ ఇబ్బందులు ఎదురుకానున్నాయి. పోస్టాఫీసుల ద్వారా అందే రైల్వే రిజర్వేషన్ సేవలు దూరం కానున్నాయి. తత్కాల్, రిజర్వేషన్ల సేవలను ఇన్నాళ్లు వీటి ద్వారా పొందిన ప్రజలు.. ఇక నుంచి వరంగల్, కాజీపేట లేదా హసన్‌పర్తి స్టేషన్లకు వెళ్లాల్సిందే. ఐపీపీఆర్‌ఐ కౌంటర్లు ఉండడం వల్ల రైల్వేస్టేషన్ల ద్వాకా వెళ్లాల్సిన, అక్కడ చాంతాడంతా క్యూలో గంటల తరబడి నిల్చోవలసిన అవస్థలు తప్పేవి. ఈ దృష్ట్యా హనుమకొండ, భూపాలపల్లిలలోని రిజర్వేషన్ కౌంటర్లను కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పందించి హనుమకొండ హెడ్‌పోస్టాఫీసులో రైల్వే రిజర్వేషన్ సేవలు కొనసాగేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రూ.1025 కోట్లతో అభివృద్ధి పనులు

(5వ పేజీ తరువాయి)

అందుతున్నాయన్నారు. దేవాదుల రెండో దశ కింద రూ. 148.76కోట్లతో ఘనపూర్ నుంచి నుంచి ఘనపూర్ ప్రధాన కాలువ వరకు అలాగే ప్రధాన డిస్ట్రిబ్యూటరీలకు సీసీ లైనింగ్ పనులు, సీఎం అండ్ సీడీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అశ్వారావుపేట కుడికాలువ నుంచి రఘునాథపల్లి వరకు కాలువ పనులను అలాగే కాలువల పూడికతీత, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను సత్వరం పూర్తి చేయించానని తెలిపారు. దేవాదుల ఎత్తిపోతల పథకం కింద ప్యాకేజీ-6 ద్వారా నాలుగు నియోజకవర్గాల పరిధిలోని కాలువ పనులు గిట్టుబాటు కాదన్న కారణంతో కాంట్రాక్టర్లు వదిలేసారని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లగా నాలుగు నియోజకవర్గాల్లో 75వేల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు రూ. 1015 కోట్లు మంజూరు చేశారని శ్రీహరి తెలిపారు.

నియోజకవర్గాన్ని విద్యాహబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు కడియం తెలిపారు. జఫర్‌గడ్ మండలం కోనాయచలంలో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటవుతున్నదని, త్వరలో పనులు ప్రారంభవుతాయని చెప్పారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో కొత్తగా డిగ్రీ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, రూ. 6.10 కోట్ల వ్యయంతో పనులు త్వరలో మొదలవుతాయని తెలిపారు. చెల్పూర్ మండల కేంద్రంలో అప్‌గ్రేడెడ్ ఐటీఐ మంజూరు అయిందని, త్వరలో ప్రారంభమవుతుందని చెప్పారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు ఆవశ్యకతను సీఎం దృష్టికి తీసుకురాగానే మంజూరు ఇచ్చారని, రూ. 45.55 కోట్లతో భవన నిర్మాణం జరుగుతోందని తెలిపారు. నియోజకవకర్గంలో 12 ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు, 3 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరయ్యాయని, ఇవి త్వరలో పని చేయడం ప్రారంభిస్తాయని వెల్లడించారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో రూ. 26 కోట్లతో ఇంటిగ్రేటెడ్ డివిజనల్ లెవల్ ఆఫీసు కాంప్లెక్సు నిర్మాణం జరుగుతోందన్నారు. రూ.15 కోట్ల వ్యయంతో తాటికొండ, జిట్టగూడెం మీదుగా మల్లన్నగండి వరకు జాతీయ రహదారి నుంచి మల్లన్నగండి వరకు రోడ్డు పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు.

రూ.1.50 కోట్లతో వేలేరులో మండల ప్రజాపరిషత్ భవన నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలువనున్నట్టు తెలిపారు. రూ. కోటితో స్టేషన్ ఘనపూర్‌లో ఎన్‌పీడీసీఎల్ డివిజనల్ ఆఫీసు కమ్ కార్యాలయ భవన నిర్మాణం జరుగుతోందని, రూ. 2.26 కోట్లతో రఘునాథపల్లి మండలం కుర్చపల్లిలో 33/11 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణం, రూ.2.29 కోట్లతో జఫర్‌గడ్ మండలం సాగరంలో 33/11 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణం జరుగుతోందని,, అలాగే చిల్పూర్ మండలం లింగంపల్లిలో రూ. 2.82 కోట్లతో మరో 33/11 కెవి సబ్‌స్టేషన్ ఏర్పాటుకు టెండర్లు ఖరారయ్యాయని శ్రీహరి తెలిపారు.

నియోజకవర్గంలో పంచాయతీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రూ. 8 కోట్లతో బీటీ రోడ్ల మరమ్మతుతో పాటు జనగామ నుంచి జీడికల్లు వరకు రూ. 9.50 కోట్లతో జఫర్‌గడ్ మండలంలో జఫర్‌గడ్ క్రాస్ రోడ్డు నుంచి వెంకటాపూర్ క్రాస్ రోడ్డు వరకు, రూ. 6 కోట్లతో రఘునాథపల్లి మండలం నిడిగొండ నుంచి ఖిలాషాపూర్ వరకు రోడ్ల మరమ్మతుకు టెండర్లు ఖరారయ్యాయని చెప్పారు. రూ. 15 కోట్లతో ఎస్సీ కాలనీల్లో అంతర్గత రోడ్లు, కాలువల నిర్మాణానికి, రూ. 1.76 కోట్లతో ధర్మసాగర్ మండలంలోని పెద్ద పెండ్యాలలో సీసీ రోడ్ల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న రోడ్ల వెడల్పు, రూ. 46 లక్షలతో ధర్మసాగర్ మండలంలోని పెద్దపెండ్యాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలవనున్నట్టు తెలిపారు. రూ. 2.33 కోట్లతో నియోజకవర్గంలోని ఏడు కేజీబీవి పాఠశాలల్లో అదనపు సౌకర్యాల కల్పనకు టెండర్లు పిలుస్తున్నట్టు చెప్పారు. రూ. 10 కోట్లతో ఎస్‌డీఎఫ్ కింద చేపట్టిన సీసీ రోడ్లు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, తాగునీటి పనులు దాదాపు పూర్తికావచ్చినట్టు తెలిపారు.

రూ. 175 కోట్లతో నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని కడియం వివరించారు. రూ. 20 కోట్ల ఎంపీలాడ్స్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో కమ్యూనిటీ హాల్, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు నిర్మాణమవుతున్నాయన్నారు. రూ. 2 కోట్లతో నియోజకవర్గంలోని నమిలిగొండ, ఇప్పగూడెం, మల్కాపూర్, నారాయణగిరి గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి టెండర్లు ఖరారైనట్లు తెలిపారు. రూ.1.08 కోట్లతో ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామంలో గాంధీ చౌరస్తా నుంచి రెడ్డిపల్లి చర్చి వరకు మిగిలిపోయిన బీటీ, సీసీ రోడ్ల పనులకు టెండర్లు ఖరారైనాయనీ, రూ. 20.78 కోట్లతో ఎస్టీ ఆవాస ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలవనున్నట్టు తెలిపారు.

రూ. 200 కోట్లతో మంత్రి మండలి ఆమోదించిన రూ. 1015 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న దేవాదుల మూడవ దశ 6వ సవరించిన ప్యాకేజీ పనుల్లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని పనులకు సంబంధించి రూ. 200 కోట్ల మంజూరుకు త్వరలో జీవో జారీ కానున్నదన్నారు. రూ. కోటితో ధర్మసాగర్ మండలంలోని ఉనికిచెర్లలో క్రికెట్ స్టేడియం మంజూరైందని తెలిపారు. స్టేషన్‌ఘనపూర్ గ్రామ పంచాయతీ మునిసిపాలిటీగా స్థాయి పెరిగిందని, ఇక్కడ చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించామని తెలిపారు.

చిత్రలేఖనం వ్యాసరచన పోటీలు

రాంనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినం సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సృజనాత్మకతను, దేశభక్తిని పెంపొందించే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహించినట్లు మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రత్నలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు సత్యనారాయణ, ఉషారెడ్డి, ఓంప్రకాశ్, శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో బీజేపీ నాయకులు



బతుకమ్మ సంబురాల్లో డీన్ గాదె సమ్మయ్య, ప్రిన్సిపాల్ కృష్ణవేణి

కేయూ ఫార్మసీ కళాశాలలో బతుకమ్మ సంబురాలు

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.కృష్ణవేణి ఆధ్వర్యంలో జరిగిన సంబురాల్లో కేయూ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య హాజరయ్యారు. బతుకమ్మ సంబురాల ప్రాధాన్యత, సంస్కృతిని విద్యార్థులకు వివరించారు. 9 రోజులు తీరొక్క పూలతో బతుకమ్మను పూజిస్తారని వివరించారు. ఈకార్యక్రమంలో ప్రొఫెసర్ వై.నరసింహారెడ్డి, డాక్టర్ ఉషాకిరణ్, డాక్టర్ సుకన్య, ప్రియాంక, సునీత, సుజాతతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి నేతృత్వంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, బ్రహ్మయ్య, దేవోజీనాయక్, నవీన్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

తిపిరిశెట్టి శ్రీనివాస్‌కు అవార్డు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : 25 ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న తిప్పిరిశెట్టి శ్రీనివాస్‌కు న్యూఢిల్లీకి చెందిన ప్రపంచ పర్యావరణ పరిరక్షణ సేవా సంస్థ అవార్డు ప్రకటించారు. ఈ అవార్డును మల్కాజీగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా తీసుకున్నట్లు శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు తీసుకున్న శ్రీనివాస్‌ను పలువురు అభినందనలు తెలిపారు.



ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్న శ్రీనివాస్

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

హసన్‌పర్తి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పావుశెట్టి సాంబయ్య అన్నారు. మండల కేంద్రంలోని పీఎంశ్రీ ప్రభుత్వ బాలికల పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం 69వ మండల స్థాయి రెండో రోజు ఎస్‌జీ ఎఫ్ క్రీడల బాలుర ఎంపిక పోటీలు ప్రిన్సిపాల్ సుమాదేవి అధ్యక్షతన ప్రారంభమైయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ పావుశెట్టి సాంబయ్య, కాజీపేట వెంకటనర్సయ్యలు హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. సర్కారు పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడల్లో మెరుగైన శిక్షణ లభిస్తుందన్నారు. విద్యార్థులు గొప్పగా రాణించేందుకు వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు క్రీడలు ఎంతగానో దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శీలం పార్థసారథి, ఎ.ప్రభాకర్, డి.కుమార్, వి.వాసుదేవరావు, కొడకండ్ల మల్లారెడ్డి, జె.నవిన్, ఎన్.శ్రీధర్, బాలమురళి కృష్ణ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

భారత్‌ను విశ్వగురువుగా చేసేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి

న్యూశాయంపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వేదికపై భారత్‌ను విశ్వగురువుగా నిలిపేందుకు 100 ఏళ్లుగా ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోం దని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాచం రమేష్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా న్యూశాయంపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాన వక్తగా రమేష్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా స్వయం సేవకుల ఆధ్వర్యంలో న్యూశాయంపేటలో నిర్వహించిన రూట్‌మార్చ్ ప్రజలను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాచం రమేష్, ప్రముఖ ఫార్మసీ కంపెనీ అధినేత పోలాడి మహేందర్ మాట్లాడుతూ సమాజంలో చెడు ప్రబలినప్పుడు ఎవరో ఒకరు వచ్చి ధర్మసంస్థాపనకు కృషి చేస్తారన్నారు. వెనుకబడిన భారతదేశాన్ని పూర్వ స్థితికి తీసుకెళ్లడానికి ఆర్‌ఎస్‌ఎస్ సేవకులు కృషి చేస్తున్నారన్నారు.వరంగల్ విభాగ్ ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ చిలుకమారి సంజీవ, ప్రధానకార్యదర్శి ప్రొఫెసర్ గద్ద రమేష్ పాల్గొన్నారు.

రైల్వే మజ్దూర్ యూనియన్ ధర్నా

కాజీపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో 8వ వేతన సంఘం అమలు జాప్యాన్ని ఖండిస్తూ శుక్రవారం కాజీపేట రైల్వే ఏరియాలో రైల్వే మజ్దూర్ యూనియన్ ధర్నా చేపట్టింది.. డీజిల్ లోకో షెడ్ ఎదుట బ్రాంచ్ అధ్యక్ష్య కార్యదర్శిలు ఎస్ కే జానీమియా, పాక వేదప్రకాశ్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. క్రూ లాబీ ఎదుట చైర్మన్ డి.శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సెక్రటరీ సాయి కుమార్, నాయకులు సంఘ రమేశ్, ఎల్.కె. యాదవ్, రామకృష్ణ, తరుణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆశాలు, ఏఎన్‌ఎంలు తమ పరిధిలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాల గురించి మహిళలకు తెలియజేసి వారి సమస్యలను బట్టి పీహెచ్‌సీలో స్పెషలిస్టు వైద్యుల చేత పరీక్షలు చేయించాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు. స్వస్తినారి శశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం పోచమ్మకుంట పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని డీఎంహెచ్ పరిశీలించి మాట్లాడారు. డాక్టర్ సలహాలను బట్టి వారికి తగిన ల్యాబ్ పరీక్షలతోపాటు ఫాలోఅప్ సేవలు అందించాలన్నారు. పోచమ్మకుంటలో డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ దీప్తి, పెద్దమ్మగడ్డ పట్టణ ఆరోగ్యకేంద్రంలో గైనకాలజిస్టు డాక్టర్ కస్తూరి ప్రమీల, హసన్‌పర్తిలో డాక్టర్ రోహన్ వెంకట్, శాయంపేటలో డాక్టర్ కార్తీక్‌రెడ్డి, ధర్మసాగర్‌లో డాక్టర్ శ్రవణ్ కుమార్, డాక్టర్ పరహాసిత్, డాక్టర్ హస్న వైద్యసేవలు అందించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య తెలిపారు.

మహిళల హక్కుల సాధనకు పోరాటం

వడ్డేపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. దీప అన్నారు. శుక్రవారం హనుమకొండలోని ఐద్వా వెస్ట్ మండల కార్యాలయంలో రెండవ మహాసభను నిర్వహించారు.

ఈ సందర్భంగా దీప మాట్లాడుతూ.. పాలక వర్గాలు మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నాయే తప్ప ఆచరణలో అమలు కావడం లేదని దుయ్యబట్టారు. మహిళలు , పసిపిల్లలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఐద్వా హనుమకొండ వెస్ట్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెస్ట్ మండల అధ్యక్షురాలిగా కె.రాధిక, ప్రధాన కార్యదర్శిగా ఎం.ఉమ, ఉపాధ్యక్షులుగా అరుణ, స్వప్న, శృతి, సహాయ కార్యదర్శులుగా మంజుల, మానసలను ఎన్నుకున్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



కేయూలో బతుకమ్మ ఆడుతున్న ఎంపీ కడియం కావ్య



బతుకమ్మతో ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, ఏకశిల పాఠశాల చైర్మన్ తిరుపతిరెడ్డి

రాంనగర్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రత్యేక ఐకాన్ బతుకమ్మ అని కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పెంబర్తిలోని ఏకశిల హైస్కూల్‌లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో సంబరాలు జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఆడపడుచులు అత్యంత సంబరంగా జరుపుకునే వేడుక బతుకమ్మ అన్నారు. ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరుతిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ పండుగలు అంటేనే ఆత్మీయతకు మారుపేరు అన్నారు. సంప్రదాయాలు ముందుతరాలకు తెలవాలంటే పాఠశాలలో వేడుకలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి ఇన్స్‌పెక్టర్ చేరాలు, ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ సువిజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె.స్వర్ణరాజు, రాంప్రసాద్, పవన్, ధనలక్ష్మీ, సునిత, ప్రియాకం, రసజ్ఞ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ ఎడ్యుకేషన్: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కేడీసీ)లో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రపు శ్రీనివాస్ వేడుకలను ప్రారంభించారు.

తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో విద్యార్థినులు, అధ్యాపకులు గ్రౌండ్ వరకు తీసుకెళ్లి కేరింతలు, ఉత్సాహంతో కోలాహలంగా బతుకమ్మ పాటలతో ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

● కేయూక్యాంపస్: కేయూ తెలుగు విభాగంలో శుక్రవారం బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ మామిడి లింగయ్య నేతృత్వంలో జరిగాయి. ఈ సంబురాల్లో కేయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్ళపల్లి మనోహర్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ మమత, వర్సిటీ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజు, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ కర్రె సదాశివ్, డాక్టర్ చీకటి శ్రీను, డాక్టర్ ఆకులపల్లి కుమార్, ప్రశాంత్, బానోతు స్వామి, తెలుగు విభాగం విద్యార్థులు, వర్సిటీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

● కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం వరంగల్ ఎంపీ కడియం కావ్య బతుకమ్మ కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాలల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేయూ అధికారులు రాజేందర్, సురేశ్‌లాల్, వరలక్ష్మి, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్, వీణ, జ్యోష్ను, శ్రీవిద్య, ఏఆర్ ఆర్ వెంకటేశ్వర్లు, బానోత్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సేవాతత్వం పెంపొందించుకోవాలి

బాలవికాస వ్యవస్థాపకురాలు బాలథెరిస్సా

కాజీపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు సేవాతత్వం అలవర్చుకోవాలని బాలవికాస వ్యవస్థాపకురాలు బాలథెరిస్సా అన్నారు. 100 ఫీట్లరోడ్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో బాలవికాస ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా కమిటీ సభ్యులతో రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సును ముఖ్యఅతిథిగా సంస్థ వ్యవస్థాపకురాలు బాలథెరిస్సా జింగ్రాస్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ఒక గొప్ప లక్ష్యంతో మహిళా అభివృద్ధి కార్యక్రమాలు 33ఏళ్లుగా చేస్తున్నామన్నారు.మెదటగా అడల్ట్ లిటరేచర్ అనే కార్యక్రమం ద్వారా గ్రామాల్లో 500 మంది టీచర్‌లతో 25 వేల మందికి చదవటం, రాయడం నేర్పించామన్నారు. బాలథెరిస్సా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి మాట్లాడుతూ.. మహిళా సాధికారతే కుటుంబసాధికారత, మహిళఅభివృద్ధి చెందితేనే కుటుంబం అంతా అభివృద్ధి చెందినట్లు అన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలవికాస అధ్యక్షుడు నోముల ఇంద్రారెడ్డి, జనవికాస అధ్యక్షులు లూర్ధుమర్రెడ్డితో పాటు మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న బాల్‌థెరిస్సా

నైపుణ్యాల మెరుగుతోనే ఉన్నత అవకాశాలు

హసన్‌పర్తి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాల మెరుగుదలతోనే విద్యార్థులకు ఉన్నత అవకాశాలు దక్కుతాయని వరంగల్ నిట్ అసోసియేట్ ప్రొఫెసర్ వెంకన్న అన్నారు. మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి అధ్యక్షతన స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వరంగల్ నిట్ అసోసియేట్ ప్రొఫెసర్ యు.వెంకన్న న్యాయ నిర్ణేతగా వ్యవహరించి మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యార్థులు సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం పాటు పడుతూ నూతన ఆవిష్కరణలతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆ దిశగా బోధన సిబ్బంది విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, అనుభవాలను అందించాలని సూచించారు. ఈ అంతర్గత హ్యాక్‌థాన్‌లో మొత్తం 130 బృందాలు తమ నూతన ఆవిష్కరణలో ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.రంజిత్‌కుమార్, వివిద విభాగాధిపతులు డాక్టర్ ఇ.సుదర్శన్, డాక్టర్ ఎస్.శ్రీవాణి, డాక్టర్ ఇ.కుమారస్వామి, డాక్టర్ కె.శ్రీనివాస్, బి.ప్రశాంత్, ఏట వేణుగోపాలస్వామి, సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య సమాజం

హసన్‌పర్తి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్య సమాజం సాధ్యమని ఎంపీడీవో చంద్రగిరి రవి అన్నారు. స్వచ్ఛత ఈ సేవ-2025లో భాగంగా సిద్దాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఎంపీడీవో, స్వచ్ఛ భారత్ ప్రతినిధి ఆధ్వర్యంలో స్వచ్ఛత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రయోగాత్మకంగా ప్రదర్శించి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రవి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలలో స్వచ్ఛ భారత్ మిషన్ స్వచ్ఛత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. స్వచ్ఛ భారత్ ప్రతినిధి సంపత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు స్వచ్ఛతపై అవగాహన కలిగి ఉండి తడి, పొడి చెత్త వేరు చేసి పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో విజయలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్వోబీకి రూ.59 లక్షలతో మరమ్మతులు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- బ్రిడ్జి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

కాజీపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ఫాతిమానగర్‌లోని పాత ఆర్వోబీ మరమ్మతుకు గురుకావడంతో రూ.59లక్షల నిధులతో మరమ్మతు పనులు చేస్తున్నామని, కొత్త ఆర్వోబీని సాధ్యమైనంత త్వరలో ప్రారంభిస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నా రు. కాజీపేట ఫాతిమానగర్‌లో శుక్రవారం నూతన ఆర్వోబీ, పాత ఆర్వోబీ పనులను ఈఈ సురేష్ బాబుతో కలిసి పరిశీంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు జరుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరుగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఎమ్మెల్యే నాయిని వెంట మాజీ కార్పొరేటర్ అబు బక్కర్, నాయకులు రమేశ్, ఎండీ అంకూస్, పసునూరి మనోహర్, పాలడుగుల ఆంజనేయులు, బైరబోయిన రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్వోబీ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని

గ్రూప్స్‌కు విద్యార్థులకు స్టడీ మెటీరియల్

హనుమకొండ కలెక్టరేట్ : గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు తన సొంత ఖర్చులతో అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందజేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. హనుమకొండ బాలసముద్రంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ స్టడీ సర్కిల్‌ను శుక్రవారం ఎమ్మెల్యే నాయిని సందర్శించారు. స్టడీ సర్కిల్‌లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, బోధనా ప్రమాణాలపై ఎమ్మెల్యే విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్టడీ సర్కిల్‌లో మరిన్ని ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. స్టడీ సర్కిల్‌లో అవసరమైన సౌకర్యాల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ప్రేమకళారెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ జర్నల్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, ప్రిన్సిపల్ చంద్రమౌళి, తదితరులు

పింగళి బాటనీ జాతీయ సదస్సు జర్నల్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డేపల్లి ప్రభుత్వ పింగళి మహిళ డిగ్రీ (అటానమస్) కళాశాల బాటనీ విభాగంలో నేతృత్వంలో ఇటీవల 2 రోజుల 'రీసెంట్ అడ్వాసెస్ ఇన్ ప్లాంట్స్ సైన్స్ రిసర్చ్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ మల్టీడిసిప్లీనరీ ఎడ్యుకేషన్ రీసెర్చ్ (ఐజేఎంఇఆర్) జాతీయ సదస్సు జర్నల్‌ను శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పింగళి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుహాసిని, బాటనీ విభాగాధిపతి, సదస్సు కన్వీనర్ డాక్టర్ డి.సునీతలు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ఐ క్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేశ్ బాబు, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎమ్. అరుణ, బాటనీ అధ్యాపకులు డాక్టర్ టి.శ్రీలత, ఆర్.జ్యోతిర్మయి, డాక్టర్ బి.మహిత, ఇతర విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నేడు నగరంలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని హనుమకొండ టౌన్ జి.సాంబరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలోని విష్ణుపురి, జూబ్లీమార్కెట్, కాజీపేట సెక్షన్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు, గోపాల్‌పూర్, యాదవనగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ ఒక ప్రకటనలో తెలిపారు.

కలెక్టరేట్‌లో లైంగిక వేధింపుల కలకలం

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మహిళా ఉద్యోగిని

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కలెక్టరేట్‌లోని ఓ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగినిని అదే సెక్షన్‌లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ తన క్యాబిన్‌లోకి పిలిపించుకుని అసభ్యకరంగా వ్యవహరించాడని ఆరోపిస్తూ బాధిత మహిళ కలెక్టర్ స్నేహ శబరీష్‌కు ఫిర్యాదు చేయడం కలెక్టరేట్‌తోపాటు జిల్లా వ్యాప్తంగా కలకలం సృష్టించింది. వారం కిందట కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో కలెక్టరేట్‌తోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడ చూసినా లైంగిక వేధింపుల అంశంపై చర్చ జరుగుతోంది. ఫిర్యాదు అందుకున్న జిల్లా కలెక్టర్.. తక్షణమే కలెక్టరేట్‌లో పనిచేస్తున్న సదరు సీనియర్ అసిస్టెంట్‌ను చింతగట్టు క్యాంపులో ఉన్న ఓ ప్రభుత్వ కార్యాలయానికి బదిలీ చేశారు.

కాగా, ఈ ఘటనపై జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని వివరణ కోరగా.. తోటి ఉద్యోగి లైంగికంగా వేధిస్తున్నట్లు మహిళా ఉద్యోగిని కలెక్టర్ స్నేహ శబరీష్‌కు ఫిర్యాదు చేసింది వాస్తవమేనన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ కమిటీ ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. విచారణ కమిటీ నివేదిక ప్రకారం సదరు వ్యక్తిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని వెల్లడించారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామెర గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని శుక్రవారం అదుపులోకి తీసుకుని రూ.15,110 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. పట్టుబడ్డ సమయంలో ఏడుగురు వ్యక్తులు ఉండగా ముగ్గురు పరారీ కాగా, మిగతావారు పట్టుబడ్డారన్నారు. నగదుతోపాటు పట్టుబడ్డ పేకాట రాయుళ్లను స్థానిక పోలీసులకు అప్పగించామన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతి

ఆర్ట్స్ కళాశాల జాబ్ మేళాలో 250 మందికి ఉద్యోగాలు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 250మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 16కంపెనీల నుంచి వచ్చిన ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా వారికి అవసరమైన డిగ్రీ, ఫార్మసీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు చెందిన 250 మంది అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాలేజ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ జితేందర్, వివిధ కంపెనీల ప్రతినిధులతో పాటుపెద్దఎత్తునఅభ్యర్థులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సుమన్‌గౌడ్

హనుమకొండ టౌన్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి) హనుమకొండ రాంనగర్‌కు చెందిన తడక సుమన్‌గౌడ్‌ను తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ శుక్రవారం నియామకపత్రం అందించారు. హనుమకొండ పోతననగర్‌లోని ఓ ప్రైవేట్ హాల్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించినట్లు సుమన్ తెలిపారు.

నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 20 సెప్టెంబరు 2025

వంటిల్లు

చాలామంది చేపలతో తయారుచేసిన వంటకాలను ఇష్టంగా తింటూ ఉంటారు. ఏడాది పొడవునా చేపలు లభిస్తాయి కానీ వర్షాకాలంలో మాత్రం కొన్ని ప్రత్యేక రకాలు దొరుకుతుంటాయి. అలాంటి అరుదైన చేపలతో తయారుచేసే వంటకాలు మీకోసం...

వర్షంలో పసందుగా.. చేపల విందు..!



పులస చేపల పులుసు

కావాల్సిన పదార్థాలు

• పులస చేప ముక్కలు- 20, పసుపు- అర చెంచా, ఉప్పు- మూడు చెంచాలు, కారం- అయిదు చెంచాలు, పచ్చి మిర్చి- 20, బెండకాయలు- ఆరు, వెన్న- ఒక చెంచా, ఆవనూనె- రెండు చెంచాలు, ధనియాల పొడి- రెండు చెంచాలు, వెల్లుల్లి గడ్డలు- రెండు, జీలకర్ర- మూడు చెంచాలు, ఉల్లిపాయలు- నాలుగు, వేరుశనగ నూనె- 200 గ్రాములు, పంచదార- పావు చెంచా, చింతపండు- పావు కేజీ, నీళ్లు- రెండు గ్లాసులు, కొత్తిమీర- ఒక కట్ట

తయారీ విధానం

• ఉల్లిపాయలను సన్నగా తురిమి పెట్టుకోవాలి. మిక్సీలో వెల్లుల్లి రెబ్బలు, జీలకర్ర వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇది మూడు చెంచాల వరకు ఉంటుంది. బెండకాయలను పెద్ద ముక్కలుగా కోసుకోవాలి. చింతపండును నీళ్లలో నానబెట్టి గుజ్జు తీసుకోవాలి. పచ్చిమిర్చికి మధ్యలో ఒక గాటు పెట్టుకోవాలి. కొత్తిమీరను శుభ్రం చేసి సన్నగా తరగాలి.

• అడుగు మందంగా ఉన్న వెడల్పాటి పెద్ద గిన్నె తీసుకోవాలి. ఇందులో పులస చేప ముక్కలు, పసుపు, ఉప్పు, కారం, పచ్చి మిర్చి, బెండకాయ ముక్కలు, వెన్న, ఆవ నూనె, ధనియాల పొడి, వెల్లుల్లి-జీలకర్ర ముద్ద రెండు చెంచాలు, ఉల్లిపాయ తురుము, వేరుశనగ నూనె, పంచదార, చింతపండు గుజ్జు వేయాలి. చేత్తో అన్నింటిని కలపాలి. తరవాత నీళ్లు పోసి కలపాలి. ఈ గిన్నెను స్టవ్ మీద పెట్టాలి. పెద్ద మంట మీద పది నిమిషాలు ఉడికించాలి. తరువాత మంట తగ్గించి చిన్న సెగ మీద పావు గంటసేపు మగ్గించాలి. మధ్యమధ్యలో గరిటెతో కలుపుతూ ఉండాలి. చేప ముక్కలు మెత్తబడిన తరవాత ఉప్పు, కారం సరిచూసుకోవాలి. చివరగా ఒక చెంచా వెల్లుల్లి-జీలకర్ర ముద్ద, కొత్తిమీర తరుగు చల్లాలి. రెండు నిమిషాల తరవాత స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారుచేసుకున్న పులస చేపల పులుసు వేడి అన్నం, చపాతీ, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.

చిట్కాలు

• పులుపు తక్కువగా తినేవారు చింతపండును కొద్దిగా తగ్గించుకోవచ్చు. పులుసు ఎంత ఎక్కువగా మరిగితే అంత రుచి పెరుగుతుంది.

• పులస పులుసును తయారుచేసిన తరువాత ఒక పూట ఆగి తింటే మరింత రుచిగా ఉంటుంది.

చేపల్లో విటమిన్లు, ఖనిజాలు, కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయి. చేపలను తరచూ తినడంవల్ల శరీరంలో ఎర్ర రక్త కణాలు పెరుగుతాయి. నాడీవ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. చేపల్లో కొల్లాజెన్ అనే ప్రొటీన్ ఉంటుంది. ఇది చర్మం, కీళ్లు, శిరోజాలు, గోళ్ల ఆరోగ్యానికి తోడ్పడుతుంది.

సాల్మన్ చేపల కూర



కావాల్సిన పదార్థాలు

• సాల్మన్ చేప ముక్కలు(స్కిన్ లెస్)- 600 గ్రాములు (తొమ్మిది పెద్ద ముక్కలు), నూనె- మూడు చెంచాలు, మెంతులు- పావు చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, పచ్చి మిర్చి- రెండు, కరివేపాకు- రెండు రెమ్మలు, ఉల్లిపాయ- ఒకటి, టమాటాలు- రెండు, ఉప్పు- తగినంత, పసుపు- అర చెంచా, ధనియాల పొడి- రెండు చెంచాలు, కారం- ఒక చెంచా, కశ్మీరీ కారం- రెండు చెంచాలు, కొత్తిమీర తరుగు- కొద్దిగా

తయారీ విధానం

• ఉల్లిపాయను సన్నని చీలికల్లా కోసుకోవాలి. టమాటాలను చిన్న ముక్కలుగా తరగాలి. స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి, నూనె వేసి వేడి చేయాలి. అందులో సాల్మన్ చేప ముక్కలు పరిచి రెండు వైపులా దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. ఆ నూనెలోనే మెంతులు, కరివేపాకు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి బాగా కలపాలి. తరువాత ఉల్లిపాయ చీలికలు, పసుపు వేసి కొద్దిగా ఉప్పు చల్లి మరోసారి కలపాలి. ఉల్లిపాయ చీలికలు ఎర్రగా వేగాక ధనియాల పొడి, కారం, కశ్మీరీ కారం వేసి బాగా కలపాలి. తరువాత సన్నగా తరిగిన టమాటా ముక్కలు, ఒక చెంచా ఉప్పు వేసి కలిపి ఒక కప్పు నీళ్లు పోసి మూతపెట్టి ఉడికించాలి. గిన్నెలోని మిశ్రమం మెత్తగా ఉడికిన తరువాత... ముందుగా వేయించి పెట్టుకున్న సాల్మన్ చేప ముక్కలను వేసి జాగ్రత్తగా కలపాలి. గిన్నె మీద మూతపెట్టి మరో అయిదు నిమిషాలు మగ్గించాలి. తరువాత మూత తీసి కొద్దిగా కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. సాల్మన్ చేప ముక్కల కూరను వేడి అన్నంలో కలుపుకొని తింటే చాలా రుచిగా ఉంటుంది.


చిట్కాలు

• చేప ముక్కలను చిన్న మంట మీద ఎర్రగా వేపాలి. ముక్క లోపలి వరకూ మెత్తగా ఉడికేలా చూసుకోవాలి.

• టమాటా గ్రేవీలో చేప ముక్కలు వేసిన తరవాత వాటిని జాగ్రత్తగా కదపాలి. లేదంటే ముక్కలు విరిగిపోతాయి.

చేపలను తినడం వల్ల శరీరానికి ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ లభిస్తాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. మానసిక ఆందోళనను తగ్గిస్తాయి. రక్తనాళాల్లో అడ్డంకులను తొలగిస్తాయి. చేపల్లో ఉండే కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, కాపర్, మాంగనీస్, సిలీనియం లాంటి మినరల్స్ ఎముకలను బలోపేతం చేస్తాయి.

కొరమీను చేపల వేపుడు



కావాల్సిన పదార్థాలు

కొరమీను చేప ముక్కలు- ఒక కేజీ, నూనె- అయిదు గరిటెలు, కారం- రెండుంపావు చెంచాలు, పసుపు- పావు చెంచా, ఉప్పు- ఒకటింపావు చెంచాలు, ధనియాలు- నాలుగు చెంచాలు, సోంపు- అర చెంచా, జీలకర్ర- రెండు చెంచాలు, లవంగాలు- పది, యాలకులు- మూడు, దాల్చిన చెక్క- రెండు చిన్న ముక్కలు, గసగసాలు- మూడు చెంచాలు, పచ్చిమిర్చి- అయిదు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒకటిన్నర చెంచాలు, నిమ్మకాయలు- రెండు

తయారీ విధానం

• మిక్సీలో ధనియాలు, సోంపు, జీలకర్ర, లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, గసగసాలు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పొడిని చిన్న గిన్నెలోకి తీసుకోవాలి.

• వెడల్పాటి గిన్నెలో చేప ముక్కలు, ఒక గరిటె నూనె, రెండు చెంచాల కారం, పసుపు, ఒక చెంచా ఉప్పు వేసి కలపాలి. చేప ముక్కలకు ఉప్పు-కారం మిశ్రమం బాగా పట్టేలా కలపాలి. ఈ గిన్నె మీద మూతపెట్టి అరగంటసేపు నాననివ్వాలి.

• స్టవ్ మీద వెడల్పాటి మూకుడు పెట్టి, నాలుగు గరిటెల నూనె పోసి వేడి చేయాలి. తరువాత చేప ముక్కలు వేసి వాటిని రెండు వైపులకూ తిప్పుతూ ఉండాలి. లోపలిదాకా ఉడికేలా చిన్న మంట మీద ఎర్రగా వేపాలి. మెత్తగా వేగిన చేప ముక్కలను ఒక పళ్లెంలోకి తీయాలి. అదే గిన్నెలో అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలుపుతూ పచ్చి వాసన పోయేదాకా వేపాలి. నూనె పైకి తేలుతున్నప్పుడు పచ్చి మిర్చి చీలికలు, ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకున్న మసాలా పొడి, పావు చెంచా కారం, పావు చెంచా ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరువాత ముందుగా వేయించి పెట్టుకున్న చేప ముక్కలు వేసి జాగ్రత్తగా కలపాలి. చేప ముక్కలకు మసాలా పూర్తిగా పట్టేలా కలిపి రెండు నిమిషాలు వేగనిచ్చి స్టవ్ మీద నుంచి దించాలి. చేప ముక్కల మీద కొద్దిగా నిమ్మరసం చల్లి సర్వ్ చేసుకోవాలి. ఇలా తయారుచేసుకున్న కొరమీను చేపల వేపుడును సాయంత్రంపూట స్నాక్‌లా వేడిగా తినవచ్చు. సాంబారు లేదా రసం అన్నంలోకి నంజుకొని కూడా తినవచ్చు. ఈ చేపల వేపుడు నాలుగు రోజులపాటు నిల్వ ఉంటుంది.

చిట్కాలు

• చేప ముక్కలను వేయించేటప్పుడు ఒక్కోదాన్ని జాగ్రత్తగా రెండోవైపునకు తిప్పాలి. లేదంటే అవి విరిగిపోతాయి.

• నూనె ఎక్కువగా ఉందనిపిస్తే కొద్దిగా తగ్గించుకోవచ్చు. ఉప్పు, కారాలను ఇష్టాన్నిబట్టి పెంచుకోవచ్చు లేదా తగ్గించుకోవచ్చు.

వారానికి రెండుసార్లు చేపలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల పిల్లలకు జ్ఞాపకశక్తి పెరుగుతుంది. పెద్దవారిలో అల్జీమర్స్ లక్షణాలు తగ్గుతాయి. మహిళలకు నెలసరి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

మేకప్

వానల్లో చెదరకుండా...



వానలో తడిసినప్పుడు మేకప్ చెదిరిపోతుందనే భయం మహిళలందరికీ ఉంటుంది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా... అడపాదడపా వానల్లో తడుస్తూనే ఉంటాం. అయినా మేకప్ చెదిరిపోకుండా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. అవేంటంటే...

చర్మం శుభ్రంగా: ముఖాన్ని సబ్బుతో శుభ్రపరుచుకున్న తర్వాత తేలికపాటి మాయిశ్చరైజింగ్ జెల్ లేదా లోషన్‌ను పూసుకోవాలి. ఆ తర్వాత బ్లాటింగ్ పేపర్‌తో అదనపు చర్మ నూనెలు, మాయిశ్చరైజర్‌లను తొలగించుకోవాలి.

ప్రైమర్‌తో: మేకప్‌కు ముఖాన్ని సిద్ధం చేసుకునేటప్పుడు మొదట ప్రైమర్ అప్లై చేయాలి. ఫేస్, ఐ ప్రైమర్‌లను వాడుకోవడం వల్ల చర్మం నునుపుగా మారి, ఫౌండేషన్ పూతకు తగ్గట్టు తయారవుతుంది.

ఫౌండేషన్ పలుచగా: తేమతో కూడిన వాతావరణంలో ఫౌండేషన్ భారీగా వేసుకుంటే అది ముద్దలుగా మారే ప్రమాదం ఉంటుంది. కాబట్టి మాయిశ్చరైజర్, ప్రైమర్ పలుచగా పూసుకున్న తర్వాత ఫౌండేషన్ కూడా వీలైనంత పలుచగా అప్లై చేసుకోవాలి.

సెట్టింగ్ స్ప్రే: సెట్టింగ్ స్ప్రేతో, మేకప్ ముఖం మీద నిలిచి ఉంటుంది. మేకప్ పూర్తయిన తర్వాత సెట్టింగ్ స్ప్రే వాడుకుని, అది ముఖం మీదే ఆరిపోయేలా చూసుకోవాలి.

ఫిక్సింగ్ పౌడర్: ఈ కాలంలో కాంపాక్ట్ పౌడర్‌కు బదులుగా ట్రాన్స్‌ల్యుసెంట్ పౌడర్‌కు మారాలి. ముఖం తడిసినప్పుడు కాంపాక్ట్ పౌడర్ చెక్కిళ్ల పైనుంచి కారిపోయి చారికలు ఏర్పడతాయి కాబట్టి వానాకాలంలో ఈ పౌడర్ వాడకం మానేయాలి.

వాటర్‌ప్రూఫ్: వాటర్‌ప్రూఫ్ మస్కారా, కాజల్, ఐలైనర్‌లను ఎంచుకోవాలి. సాధారణ ఉత్పత్తులతో పోల్చుకున్నప్పుడు వీటిని తొలగించడం కాస్త ఇబ్బందికరమే అయినప్పటికీ మేకప్ అందవిహీనంగా మారిపోకుండా ఉండడం కోసం ఈ కాలంలో వాటర్‌ప్రూఫ్ సౌందర్య సాధనాలనే వాడుకోవాలి.

బిర్యానీ ఆకుతో బొద్దింకలు మాయం...



వర్షాకాలం వచ్చిందంటే చాలు ఇంట్లో బొద్దింకల బెడద పెరిగిపోతూ ఉంటుంది. బజారు నుంచి రసాయనాలతో కూడిన స్ప్రేలు తెచ్చి వాడినా ప్రయోజనం కనిపించదు. అలాంటప్పుడు బిర్యానీ ఆకుతో బొద్దింకలను ఎలా వదిలించుకోవచ్చో తెలుసుకుందాం...

• బొద్దింకలకు.. బిర్యానీ ఆకు వాసన పడదు. కాబట్టి వంటింట్లో ఉండే అరల్లో, సింక్ దగ్గర, బాత్రూమ్ మూలల్లో ఎండిన బిర్యానీ ఆకులను చిన్న ముక్కలుగా తుంచి ఉంచితే బొద్దింకలన్నీ బయటికి వెళ్లిపోతాయి. రెండు రోజులకోసారి ఈ ఆకులను తీసివేసి కొత్తవాటిని ఉంచుతూ ఉంటే బొద్దింకలు మళ్లీ రావు.

• బాగా ఎండిన బిర్యానీ ఆకులను పొడిలా చేసి బొద్దింకలు తిరిగే ప్రాంతాల్లో చల్లితే రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుంది.

• స్టవ్ మీద గిన్నె పెట్టి నిండా నీళ్లు పోసి రెండు బిర్యానీ ఆకులు వేసి బాగా మరిగించాలి. ఈ నీటిని వడబోసి ఒక స్ప్రే బాటిల్‌లో పోసి ఇంటి మూలల్లో, కిటికీల దగ్గర, సింక్‌ల దగ్గర పిచికారీ చేస్తే బొద్దింకల బెడద తగ్గుతుంది.

భోజన కుతూహలం

ప్రకృతిలోని ప్రతి ఆకుకూరకు కొన్ని ప్రత్యేకమైన గుణధర్మాలు ఉంటాయి. వీటిని మన పూర్వీకులు గమనించి గ్రంథస్తం చేశారు. ఈ విధంగా 'భోజనకుతూహలం' గ్రంథంలో శనగాకుల వల్ల కలిగే అనేక ప్రయోజనాలు మనకు కనిపిస్తాయి. శనగ ఆకులు పుల్లగా ఉంటాయి. రుచిగా ఉంటాయి. తిన్న తర్వాత అలస్యంగా అరుగుతాయి. కఫం, వాతం వల్ల కలిగే వ్యాధుల నుంచి ఉపశమనాన్ని కలగజేస్తాయి. ఈ ఆకులకు ఉన్న లక్షణాలు, ఔషధ గుణాలేమిటో చూద్దాం..

శక్తినిచ్చే శనగాకులు!

• శనగాకులలో ప్రొటీన్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల మిగిలిన ఆకు కూరల కన్నా వీటి వల్ల ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయి.

• శనగాకులకు శరీరవేడిని తగ్గించే తత్వం ఉంది. అందువల్ల క్రమం తప్పకుండా శనగాకుల కూరను తింటే శరీర ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అయితే ఒకే రోజు ఎక్కువ పరిమాణంలో తినకూడదు. అలా తింటే మలబద్ధకం ఏర్పడే అవకాశముంటుంది.

• ముదర శనగ ఆకుల కన్నా.. లేత శనగ ఆకులలో ఎక్కువ పౌష్టిక గుణాలుంటాయి. ఒక బేసిన్‌లో లేదా కుండీలో మట్టి పోసి శనగలు చల్లితే మొలకలు వస్తాయి. ఆరు అంగుళాల ఎత్తు పెరిగిన తర్వాత వాటిని కోసి తినటం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది. పాలకూర, క్యాబేజీ కన్నా శనగాకుల్లో ఎక్కువ ఖనిజాలు ఉన్నాయని పౌష్టికాహార నిపుణులు పేర్కొంటున్నారు. అందువల్ల వీటిని సలాడ్స్‌లో కూడా వేసుకొని తినవచ్చు.

లేత శనగాకులను శుభ్రపరుచుకోవాలి. వాటిలో లేత శనగలను కలపాలి. ఈ రెండింటినీ కలిపి ఉడికించి తాలింపు పెట్టుకుంటే రుచికరమైన కూర తయారవుతుంది. కొందరు ఈ కూరలో ఎండు కొబ్బరి కూడా కలుపుతారు. దీని వల్ల కూర రుచి మరింతగా పెరుగుతుంది

ఒక మూకుడులో నూనెను వేడిచేసి శనగాకులను వేయించాలి. వీటిలో ఉల్లిపాయలు కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక మిక్సీలో రుబ్బాలి. ఈ పచ్చడికి తాలింపు పెడితే మంచి రుచి వస్తుంది.

శనగాకులను, కందిపప్పును కలిపి ఉడికించాలి. ఒక మూకుడులో కొద్దిగా నూనె వేడిచేసి దానిలో ఈ మిశ్రమాన్ని వేసి వేయించాలి. దానిలో తాలింపు పెట్టాలి.



• గంగరాజు అరుణాదేవి

గీతు.. ఐటీలో టాప్!

ఆ అమ్మాయి హైస్కూల్ వయసులోనే జేబు ఖర్చుల కోసం వెబ్‌సైట్స్ రూపొందించింది. 19 ఏళ్ల వయసులో హ్యాకథాన్‌లో ఉత్తమ వెబ్ డెవలపర్‌గా ముఖ్యమంత్రి నుంచి అవార్డును అందుకుంది. ఆ ప్రతిభే ఆమెను నేడు ఐదు దేశాలకు ఐటీ కంపెనీలు నడిపే స్థాయికి చేర్చింది. తిరువనంతపురానికి చెందిన గీతు శివకుమార్ ప్రస్థానమిది. ఆసక్తికరమైన ఆమె ఐటీ ప్రయాణం గురించి తెలుసుకుందాం!



ప్రేరణ

కళాశాలలో నిర్వహించిన హ్యాకథాన్‌లో ఏకైక మహిళా విజేతగా పేరు తెచ్చుకుంది గీతు శివకుమార్. ఇది పదిహేనేళ్ల నాటి సంగతి. ఇప్పుడామె మొబైల్ యాప్స్ అభివృద్ధితో పాటు డిజిటల్ మార్కెటింగ్ చేపట్టే కేరళలోని 'పేస్ హైటెక్' సాఫ్ట్‌వేర్ కంపెనీ సిఇఒ. గీతకు పట్టుదలే ప్రధానం. పరిస్థితులకు తగ్గట్టు అలవాటు పడే ధైర్యాన్ని కలిగి ఉండడం, సవాళ్లను ఎదుర్కొనే తెగువను కలిగి ఉండడం ముఖ్యమని అంటుంది గీతు.

"2015లో 'పేస్ హైటెక్'ను ప్రారంభించినప్పుడు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ఉన్నాను. హ్యాకథాన్ విజేతగా, దానికి న్యాయనిర్ణేతగా కూడా వ్యవహరించాను. అయితే ఆ ఈవెంట్ మొత్తంలో నాకు కేవలం ఇద్దరు ముగ్గురు అమ్మాయిలు మాత్రమే కనిపించారు. పరిస్థితిలో ఇంకా మార్పు రాలేదని నేనప్పుడే గ్రహించాను. అమ్మాయిలు పెళ్లి చేసుకుని, అత్తగారింటికి వెళ్లిపోవడమే సరైన మార్గమనే నమ్మకం మన సమాజంలో లోతుగా పాతుకుపోయింది. తల్లితండ్రుల ఒత్తిడి వల్ల ప్రతిభను పక్కనపెట్టిన ఎంతో మంది అమ్మాయిలను నేను చూశాను. కానీ నిజానికి ఆడపిల్లలకు తల్లితండ్రుల మద్దతు ఎంతో అవసరం. అది లేకపోతే ఆర్థిక స్వేచ్ఛను కలిగి ఉండాలి. స్వయంగా అద్దె కట్టుకుంటూ, ఖర్చులను భరించగలిగితే ఆడపిల్లలను నియంత్రించే శక్తి ఎవరికీ ఉండదు" అంటూ సమాజంలో ప్రతిభావంతులైన ఆడపిల్లల పరిస్థితి గురించి ఒక సందర్భంలో వివరించింది గీతు.

స్వయంకృషితో ఎదిగి...

గీతు స్వతంత్ర ప్రస్థానం ఎంతో చిన్న వయసులోనే మొదలైంది. హైస్కూల్‌లో ఉన్నప్పుడే వ్యక్తిగత ఖర్చులకు సరిపడా డబ్బు సంపాదించుకోవడం కోసం ఫ్రీల్యాన్సర్‌గా వెబ్‌సైట్లు రూపొందించడం మొదలుపెట్టింది. 2011లో, రాష్ట్రస్థాయి ఐటి ఫెస్ట్‌లో కేరళకు చెందిన ఉత్తమ వెబ్ డెవలపర్‌గా ముఖ్యమంత్రి ఉమేన్ చాందీ నుంచి అవార్డు కూడా అందుకుంది. కానీ ఆమె అక్కడితో సంతృప్తి చెందలేదు. "పరిశ్రమలో ఎక్కువ దోపిడీకి గురయ్యేవాళ్లు ఫ్రీల్యాన్సర్లే! అతి తక్కువ వేతనానికి ఎంతో ఎక్కువగా శ్రమ పడుతూ ఉంటారు. కాబట్టే నేను ఫ్రీల్యాన్సర్‌గా మిగిలిపోవాలనుకోలేదు. సొంతగా ఏదైనా మొదలుపెడదామని అనుకున్నాను. అది రాత్రికి రాత్రే తీసుకున్న నిర్ణయం కాదు. క్రమేపీ నా మీద నాకు స్పష్టత ఏర్పడిన తర్వాత ఆ నిర్ణయం తీసుకున్నాను. అయితే ఐటి పరిశ్రమ నుంచి ఏమాత్రం మద్దతు దక్కలేదు. అప్పటికే సేవల కంపెనీలతో నిండిపోయిన మార్కెట్లో నేను నిలదొక్కుకోలేనని ఎంతో మంది అన్నారు. కానీ మా కాలేజీ ప్రిన్సిపాల్, కాలేజీలో ఉన్న ఇంక్యుబేటర్‌ను ఉపయోగించుకోమని నన్ను ప్రోత్సహించారు. ఆ విధంగా నాదైన ఉనికిని సృష్టించుకోగలిగే అవకాశాన్ని అందుకోగలిగాను" అంటూ చెప్పుకొచ్చింది గీతు.

కృత్రిమ మేధస్సుకు ధీటుగా...

గీతు... ఇంజనీరింగ్ చివరి ఏడాది నాటికి ప్లేస్‌మెంట్ కంపెనీలు అందించే జీతం కంటే ఎక్కువ సంపాదించడం మొదలుపెట్టింది. అదే సమయంలో సొంత కంపెనీ నడపగలిగే సత్తా ఉన్నప్పుడు, ఇంకొకరి కింద పనిచేయడం ఎందుకని అనుకుంది. కానీ ఆ తర్వాత కృత్రిమ మేధ మూలంగా సాఫ్ట్‌వేర్ పరిశ్రమ వేగంగా మారిపోవడం మొదలుపెట్టింది. గీతు ఆ పరిస్థితికి బెదిరిపోకుండా, దాన్నొక సవాలుగా స్వీకరించింది. "మానవ సృష్టిని ఏదీ అధిగమించలేదని అనుకునేదాన్ని. కానీ కృత్రిమ మేధ కవిత్వం రాసేయడం, విజువల్స్‌ను రూపొందించడం చూసి, నా ఆలోచన తప్పని అర్థం చేసుకున్నాను. ఆ పరిస్థితికి అలవాటుపడకపోతే నా ఉనికి కనుమరుగైపోయే ప్రమాదం ఉందని కూడా గ్రహించాను. అలా కృత్రిమ మేధను పరిగణనలోకి తీసుకుని కంపెనీ సేవలను కొత్తగా తీర్చిదిద్దాను. కృత్రిమ మేధ చేయలేని పనులను కనిపెట్టాను. అలా ఈ రంగంలో వెనకబడిపోకుండా నిలదొక్కుకోగలిగాను" అంటూ తాను అధిరోహించిన అతి పెద్ద అవరోధం గురించి వివరించింది గీతు. నేడు గీతు సారథ్యంలోని 'పేస్ హైటెక్' కంపెనీ కార్యాలయాలు భారతదేశమంతటా విస్తరించాయి. సింగపూర్, మధ్యప్రాచ్యంలో కూడా ఈ కంపెనీ కార్యాలయాలున్నాయి. పట్టుదలతో ప్రయత్నిస్తే సాధ్యంకానిదంటూ ఉండదు. తాజా పోకడలకు తగ్గట్టు మనల్ని మనం మలుచుకుంటూ ముందుకు సాగగలిగితే ఎన్ని సవాళ్లు ఎదురైనా... విజేతగా నిరూపించుకోగలుగుతాం అనడానికి గీతు కథే ఒక ఉదాహరణ.

కొబ్బరిపీచుతో కొత్తగా...

ఒకప్పుడు కొబ్బరిపీచుతో తాళ్లు, మంచాల నులక తయారుచేసేవారు. ఇప్పుడు మాత్రం కొబ్బరికాయ కొట్టగానే దాని పీచును తీసి చెత్తబుట్టలో పడేస్తున్నాం. అలా పారేయకుండా కొబ్బరి పీచును ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకుందాం...

• కొబ్బరి పీచుతో చర్మాన్ని చక్కగా తోముకోవచ్చు. ఈ పీచు పదునుగా ఉంటుంది కాబట్టి కాస్త మెల్లగా రుద్దితే చర్మం మీద పేరుకున్న మురికి పూర్తిగా పోతుంది. మృతకణాలు ఎక్కువగా పేరుకునే మెడ, వీపు, పాదాలను కొబ్బరి పీచుతో రుద్ది కడిగితే మంచి ప్రయోజనం కనిపిస్తుంది. చర్మ రంధ్రాలు లోపలి వరకు శుభ్ర పడతాయి.


• మసిబారిన గిన్నెలు, జిడ్డు పట్టిన డబ్బాలు, దేవుడి దగ్గర ఉపయోగించే కుందులు, మూకుడు తదితరాలను కొబ్బరిపీచుతో రుద్ది శుభ్రం చేయవచ్చు. పీచు మీద కొద్దిగా డిష్ వాషింగ్ లిక్విడ్ వేసి దానితో రుద్దితే జిడ్డు, మసి లాంటివి త్వరగా వదిలిపోతాయి.

• కొబ్బరి పీచును చిన్న ముక్కలుగా కత్తిరించి కుండీల్లోని మట్టిలో కలిపితే మొక్కలకు పూలు బాగా పూస్తాయి. అంతేకాదు మట్టి ఎప్పుడూ తేమగా ఉంటుంది. ఈ పీచును ఎరువులా వాడితే నేలకు, మొక్కలకు పోషకాలు బాగా అందుతాయి. మొక్కల కాండాలు, ఆకుల మీద క్రిమి కీటకాలు, ఫంగస్‌లు, ఇతర శిలీంధ్రాలు చేరవు.



• కొబ్బరిపీచుతో పక్షి గూడు, చిలకలు, పిచ్చుకలు, ఏనుగు, ఇంటి నమూనా, డోర్ మ్యాట్ లాంటి గృహాలంకరణ వస్తువులు ఎన్నో తయారుచేయవచ్చు. ఇవి ఇంటి అందాన్ని మరింత పెంచుతాయి.

• కొబ్బరి పీచును చిన్న ముక్కలుగా చేసి, ఒక గిన్నెలో వేసి దానిమీద కర్పూరం బిళ్ల ఉంచి వెలిగించాలి. ఆ గిన్నెను ఇంట్లో ఓ మూలగా ఉంచితే... ఇల్లంతా మంచి సువాసన వ్యాపిస్తుంది. దోమలు, ఈగలు బయటికి వెళ్లిపోతాయి.



50 కోట్ల బ్లాక్‌మనీ ఉంది.. మారుస్తారా?

» వైట్ చేసే మార్గాలు చెబితే రూ.కోటి ఇస్తా

» ఓ ఐఏఎస్ ఆఫర్..అధికారుల్లో హాట్ టాపిక్‌గా ఆయన శైలి

హైదరాబాద్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): 'నా దగ్గర రూ.50 కోట్ల నల్లడబ్బు (బ్లాక్‌మనీ) ఉంది.. ఎవరైనా వైట్‌గా మారిస్తే రూ.కోటి ఇస్తా'. కొందరు వ్యాపారులకు ఓ ఐఏఎస్ అధికారి ఇచ్చిన ఆఫర్ ఇదీ! ఓ కీలక శాఖలో అత్యంత కీలక స్థానంలో పని చేస్తున్న సదరు ఐఏఎస్ అధికారి, ఆ బాధ్యతల్లోకి వచ్చిన 4నెలల్లో ఇంత పెద్ద మొత్తం వెనుకేసుకోవడంపై ఉన్నతస్థాయి అధికారుల్లోనూ గుసగుసలు మొదలయ్యాయి. అనుమతుల పేరుతో అడ్డగోలుగా వసూళ్లకు దిగారన్న ఆరోపణలపై ప్రభుత్వం కూడా అంతర్గత విచారణ చేపట్టినట్లు తెలిసింది. అనుమతల కోసం ఓ వ్యాపారి ఇటీవల ఆ అధికారిని ఆశ్రయించగా రూ.3 కోట్ల ప్యాకేజీ తీసుకుని అనుమతులు ఇచ్చారనేది వ్యాపారవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అదే వ్యాపారులను తన వద్ద ఉన్న రూ.50 కోట్ల నల్ల ధనం మార్చి ఇవ్వాలని తొలుత ఆశ్రయించారని.. అందుకు ప్రతిఫలంగా రూ. కోటి ఇస్తానని ఆఫర్ చేసినట్లు..అది ఆనోటా ఈనోటా బయటపడి అధికార వర్గాల్లో చర్చనీయాశంగా మారింది. ఈ క్రమంలో గత నాలుగు నెలల్లో ఇచ్చిన అన్ని రకాల అనుమతుల్లో ఆయన సొంత ఖాతాలో ఉన్నవి ఎన్ని? ఇతరత్రా మార్గాల ద్వారా అనుమతులు కావాలని వచ్చిన ప్రతిపాదనలు ఎన్ని అనే కోణంలో ప్రభుత్వం లెక్కలు తీస్తున్నట్లు తెలిసింది. అనుమతుల జారీలో సొంత పెత్తనం ఎక్కువైందనే ఫిర్యాదులు రావడంతో ఆయనపై ప్రభుత్వం కూడా గుర్రుగా ఉన్నట్లు సమాచారం. త్వరలోనే ఆయనపై వేటు పడుతుందనే ప్రచారం కూడా జరుగుతోంది. కాగా, ఆయనకు సహకరించిన వ్యక్తులపైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునేందుకూ వెనుకాడబోదని ఓ ముఖ్యనాయకుడు తనకు సన్నిహితంగా ఉన్న అధికారుల వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. అతను మార్చుకోవాలనుకున్న నల్లడబ్బు వ్యవహారాన్ని లెక్కలతో సహా ముఖ్య నేత ముందు పెట్టేందుకు నివేదిక సిద్ధమవుతోందని, దానిపై తదుపరి చర్యలు ఎలా ఉంటాయనే దానిమీద ఉన్నత స్థాయిలో చర్చ జరుగుతోంది.

మద్యం, మాదక ద్రవ్యాల కేసుల్లో 14 వేల మంది యువత

హైదరాబాద్, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర వ్యాప్తంగా మూడేళ్లలో 14 వేల మంది యువతీయువకులు డ్రంక్ అండ్‌డ్రైవ్,మాదక ద్రవ్యాల కేసుల్లో పోలీసులకు దొరికారు. వారిలో 316మంది మహిళలు ఉన్నారు. 2022-2025 మధ్య ఈ గణాంకాలు నమోదయ్యాయని నార్కోటిక్స్ బ్యూరో కార్యాలయం పౌరసమాచార అధికారి కృష్ణమూర్తి తెలిపారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ వ్యవస్థాపకుడు రాజేంద్ర సమాచార హక్కు చట్టం కింద చేసిన దరఖాస్తుకు సమాధానంగా ఈ వివరాలు వెల్లడించారు.

మావోయిస్టుల చెరో మాట!

సంక్లిష్ట సమయంలో బయటపడిన విభేదాలు.. అభయ్ లేఖను తప్పుపట్టిన తెలంగాణ కమిటీ నేత జగన్

» సాయుధ విరమణ ప్రకటన ఆయన సొంత అభిప్రాయం

» దమనకాండ వేళ లేఖతో గందరగోళం

» సాయుధ పోరాటంతో ముందుకెళ్లడమే తక్షణ కర్తవ్యం: జగన్



హైదరాబాద్/ చర్ల/అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంక్షోభంలో పీకల్లోతు కూరుకుపోయిన సంక్లిష్ట సమయంలో మావోయిస్టుల్లో విభేదాలు బయటపడ్డాయి. ఓవైపు ఆపరేషన్ కగార్.. అందులో పెద్దఎత్తున మావోయిస్టులు నేలరాలుతున్న కీలక సమయంలో పార్టీలో గందరగోళం నెలకొంది. ఆయుధాలు వదిలి వేయడానికి సంసిద్ధంగా ఉన్నామని, అందుకు కొంత సమయం కావాలని పార్టీలో అగ్రనేతగా ఉన్న కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ సోను అలియాస్ అభయ్ పేరిట ఆయన ఫొటోతో ఇటీవల లేఖ వచ్చిన సంగతి తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లో ఇది తీవ్ర చర్చనీయాంశమైంది కూడా. ఆగస్టు 15న రాసిన లేఖ సెప్టెంబరు 15న విడుదల చేయడం, గతానికి భిన్నంగా దానిపై వేణుగోపాలరావు తాజా ఫొటో ఉండడంతో అది పార్టీ రాసిన లేఖేనా అనే అనుమానాలూ వ్యక్తమయ్యాయి. తాజాగా దీనిని ఖండిస్తూ మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రతినిధి జగన్ ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట వచ్చిన లేఖ ఆయన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని, పార్టీ నిర్ణయం ఏ మాత్రం కాదని అందులో స్పష్టం చేశారు. ఈ రెండు పరిణామాలూ పార్టీ నాయకత్వం ప్రస్తుతం ఎదుర్కొంటున్న గందరగోళ పరిస్థితులను స్పష్టం చేస్తున్నాయి. నిజానికి, మావోయిస్టు పార్టీ సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ ఇవ్వడానికి పార్టీ చేసిన తప్పిదాలే ప్రధాన కారణమని సోను తన లేఖలో పేర్కొన్నారు. గత 20 నెలలుగా 'చుట్టు ముట్టు, మట్టుబెట్టు' అనే దాడులను ఎదుర్కొంటున్నామని, పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, సహచరులు, ప్రజలను కోల్పోయామని పేర్కొన్నారు. ఐదు దశాబ్దాలుగా 16 రాష్ట్రాల్లోని 150 జిల్లాల్లో పార్టీ నిర్మాణం జరుగుతూ వచ్చిందని, ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పార్టీకి గుర్తింపు వచ్చిందని వివరించారు. వ్యూహాలు, ఎత్తుగడలతో ఉద్యమాన్ని విస్తరించామని తెలిపారు. పార్టీ ఎన్నో గొప్ప కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ.. తప్పిదాలతో బలమైన విప్లవోద్యమాన్ని నిర్మించలేకపోయామని, మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకోకుండా శత్రువుల బలాన్ని అంచనా వేయలేకపోయామని స్పష్టం చేశారు. ఫలితంగా.. ఆంధ్రప్రదేశ్, ఏవోబీ, ఒడిసా, పశ్చిమ బెంగాల్, బిహార్, ఝార్ఖండ్‌ల్లో ఉద్యమం దెబ్బతిందని, దండకారణ్యంలో పార్టీ నష్టపోవడానికి కొంత ఎక్కువ సమయం పట్టినా అంతిమంగా ఓటమి పాలయ్యామని వివరించారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సమయంలో అటువంటి ప్రకటనా!?

విప్లవోద్యమంతోపాటు మావోయిస్టు పార్టీ నాయకత్వాన్ని, క్యాడర్‌ను నిర్మూలించేందుకు కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీతో చర్చించకుండా సోను ప్రకటనను విడుదల చేయడాన్ని తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ ఖండించారు. "కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విప్లవోద్యమ నిర్మూలనకు ఎప్పటి నుంచో పథకాలు వేసుకుని అమలు చేస్తోంది. ఆపరేషన్ కగార్ పేరిట భారీ స్థాయి యుద్ధ చర్యలను కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది మార్చిలో కొంతమంది ప్రజాస్వామిక మేధావులు శాంతి చర్చల కమిటీగా ఏర్పడ్డారు. ప్రభుత్వానికి, మావోయిస్టులకు మధ్య శాంతి చర్చలు జరగాలని ప్రతిపాదించారు. తెలంగాణ, ఆంధ్రాలోని ప్రజా సంఘాలు, ప్రజలు ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని ఆందోళన చేశారు. యుద్ధ కాండను నిలిపి వేయాలని దేశంలోని ఎందరో ప్రముఖులు కోరారు. అయినా, ఫాసిస్టు భావజాలంతో మావోయిస్టు పార్టీ నాయకత్వాన్ని నిర్మూలిస్తామని బీజేపీ నాయకత్వం ప్రకటిస్తూనే ఉంది. కూంబింగ్, హత్యాకాండను ఆపాలని, కొత్త క్యాంపుల నిర్మాణాన్ని నిలిపి శాంతియుత వాతావరణంలో చర్చలు జరపాలని కేంద్ర కమిటీ కూడా ప్రకటించింది. అయినా, కేంద్ర ప్రభుత్వం ఎలాంటి సడలింపులు లేకుండా రక్తపుటేరులు పారిస్తూనే ఉంది. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు మావోయిస్టు పార్టీని నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి బాహాటంగా పదే పదే ప్రకటించారు. మరోవైపు, ఇటీవలి ఎన్‌కౌంటర్లలో అనేకమంది అమరులయ్యారు. అనారోగ్య సమస్యలతో పార్టీ అనుమతి తీసుకుని కొందరు సరెండర్ అయ్యారు. ఈ సమయంలో నెల రోజుల సమయం ఇవ్వాలని అడగడం అనాలోచిత చర్య" అని తప్పుబట్టారు. ఉద్యమాన్ని వదిలి జన జీవన స్రవంతిలో కలిసి చట్టబద్ధంగా పని చేయాలని అనుకున్నప్పుడు పార్టీ కమిటీలో చర్చించి అనుమతి పొందవచ్చని, తన అభిప్రాయాన్ని పార్టీ చానల్‌లో పంపించినప్పుడు ఆయన ప్రశ్నలకు జవాబులు దొరికేవని సూచించారు. అది చేయకపోగా ఇటువంటి కీలక విషయాన్ని బహిరంగంగా ప్రకటించడం ద్వారా పార్టీ శ్రేణులు, విప్లవ శిబిరంలో గందరగోళం తలెత్తుతుందని, సోను అనుసరించిన పద్ధతి ఉద్యమానికి ఉపయోగపడకపోగా నష్టం చేస్తుందని స్పష్టం చేశారు. దేశంలోని ఏ పార్టీ కూడా ఇటువంటి నిర్ణయాలను ఇంటర్నెట్ ద్వారా బహిరంగ చర్చకు పెట్టి పరిష్కరించాలని చూడదని, అటువంటిది తీవ్రమైన దమన కాండ అమలు జరుగుతున్న సమయంలో రహస్య, కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడిన పార్టీలో సరిగ్గా ఆలోచించే వాళ్లు ఇలా చేయరని తప్పుబట్టారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యపై పార్టీలో పై నుంచి కింది వరకు ప్రస్తుతం అంతా తీవ్రంగానే ఆలోచిస్తున్నారని, అనవసరంగా నష్టపోవాలని ఎవరూ అనుకోవడం లేదని వివరించారు. బహిరంగ ప్రకటనలతో ఈ సమస్యకు పరిష్కారం సాధ్యం కాదని జగన్ స్పష్టం చేశారు. భయంకరమైన దమనకాండలో జరుగుతున్న నష్టాలను అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమస్యకు ఇప్పటికిప్పుడు పరిష్కారం దొరక్క పోవచ్చునని, గత ఏడాది పొలిట్ బ్యూరో విడుదల చేసిన ఉత్తర్వు (సాయుధ పోరాటంతోనే ముందుకు)ను అమలు చేయడమే తక్షణ కర్తవ్యమని అభిప్రాయపడ్డారు. అభయ్ పేరిట వచ్చింది అధికారిక ప్రకటన కాదని, విప్లవ శిబిరం, మిగిలిన అన్ని రాజకీయ పార్టీలు దానిని అధికారిక ప్రకటనగా గుర్తించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఆ ప్రకటనతో గందరగోళ పడాల్సిన అవసరం లేదని, ఫాసిస్టు బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను తీవ్రతరం చేయాలని కోరారు.

అభయ్ ఎక్కడ!?

మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ ఎక్కడ? ఆయన దండకారణ్యంలో ఉన్నారా? లేక భద్రతా బలగాల అదుపులో ఉన్నారా? పార్టీ పద్ధతులు, విధానాలకు పూర్తి విరుద్ధంగా ఆయన ప్రకటన విడుదలైన నేపథ్యంలో ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్న ప్రశ్న ఇది. కరీంనగర్ జిల్లాకు చెందిన మల్లోజుల కోటేశ్వర్‌రావు (కిషన్‌జీ) సోదరుడైన వేణుగోపాలరావు కొంతకాలంగా పార్టీ అధికార ప్రతినిధి అభయ్‌గా వ్యవహరిస్తున్నారు. నిజానికి, బస్వరాజ్ ఎన్‌కౌంటర్ తర్వాత ఇప్పటి వరకు పార్టీ కొత్త ప్రధాన కార్యదర్శిని ఎన్నుకోలేదు. పొలిట్‌బ్యూరో సమావేశం జరగలేదు. కనీసం కేంద్ర కమిటీ సమావేశం జరగలేదు. అలాంటప్పుడు, సాయుధ పోరాట విమరణ ప్రకటన ఎలా చేశారనే సందేహాలను మావోయిస్టు పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఆయన ఉనికిపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోను భద్రతా బలగాల అదుపులో ఉన్నారా? వారి ఆదేశాల మేరకే ప్రకటన విడుదల చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ ప్రకటనల్లో ఎప్పుడూ అధికార ప్రతినిధులు, నేతల ఫొటోలు ఉండవు. కానీ, సోను యూనిఫామ్‌లో ఉన్న స్పష్టమైన ఫొటోను ప్రకటనకు జత చేశారు. పోలీసుల వద్ద ఆయనకు సంబంధించి 1986 నాటి ఫొటో మాత్రమే ఉంది. దాంతో, ఇదంతా పోలీసుల ఎత్తుగడలో భాగంగానే జరిగి ఉంటుందని పార్టీ, ప్రజా సంఘాల నేతలు అనుమానిస్తున్నారు.

అది బస్వరాజ్ ఉన్నప్పటి నిర్ణయమే

సాయుధ పోరాట విరమణ ప్రకటనకు, సోను ఉనికికి సంబంధం ఉండదని కీలక ప్రజాసంఘం నేత ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. "అభయ్ ప్రకటనలో కీలక అంశాలున్నాయి. పార్టీ ప్రధాన కార్యదర్శిగా బస్వరాజ్ ఉన్న సమయంలోనే శాంతి చర్చలపై కీలక చర్చ జరిగిందని రాశారు. ఆయన ప్రారంభించిన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. అంటే, ఇది తన సొంత నిర్ణయం కాదని అభయ్ స్పష్టం చేశారు. బస్వరాజ్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న 2024 సెప్టెంబరు, 2025, ఫిబ్రవరిలో రెండు కీలక సమావేశాలు జరిగాయి. అందుబాటులో ఉన్న పొలిట్ బ్యూరో సభ్యులు హాజరయ్యారు. కేడర్, నాయకత్వాన్ని కాపాడుకునేందుకు కేంద్రంతో శాంతి చర్చలకు వెళ్లాల్సిందేనని, అవసరమైతే కొంత కాలంపాటు సాయుధ పోరాట విమరణకు ఒప్పుకొందామని అప్పట్లోనే నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఈ ఏడాది మే 10న అభయ్ పేరిట స్వయంగా బస్వరాజ్‌నే ప్రకటన విడుదల చేశారు కూడా" అని ఆయన వివరించారు. అభయ్ పోలీసుల అదుపులో లేరని తాము కచ్చితంగా చెప్పగలమని తెలంగాణ ప్రాంతానికే చెందిన మరో కీలక ప్రజాసంఘం నేత చెబుతున్నారు. సాయుధ పోరాట విరమణ ప్రకటనకు ముందే.. ఆగస్టులోనే సోను పేరిట కేడర్‌కు ఓ అంతర్గత లేఖ వచ్చిందని, సాయుధ పోరాట విరమణను పెద్ద మనసుతో అర్థం చేసుకోవాలని, పోరాటం మరో రూపంలో ఉంటుందని, లేఖను అపరాధ భావనతో రాస్తున్నట్లుగా అందులో ఆయన పేర్కొన్నారని వివరించారు.

కేంద్ర మంత్రితో చర్చలకు రాయబారం

కేంద్ర ప్రభుత్వంతో శాంతి చర్చలకు మావోయిస్టు నేతలు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బస్వరాజ్ ఎన్‌కౌంటర్‌కు ముందు రెండు దఫాలుగా ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లోని బీజేపీ నేతల ద్వారా ప్రయత్నించారని తెలిసింది. బస్వరాజ్ ఎన్‌కౌంటర్ తర్వాత కూడా మరికొన్ని ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. దక్షిణాదికే చెందిన కీలక కేంద్ర మంత్రి ద్వారా రాయబారం నడిపినట్లు తెలిసింది. సదరు మంత్రి నేరుగా అమిత్ షాను కలిసి మావోయిస్టుల ప్రతిపాదనలను వివరించినట్లు సమాచారం. దాంతో, శాంతి చర్చలకు అవకాశమే లేదని, అయితే, ఆయుధాలతో సహా సరెండర్ కావాలని, లేదంటే బలగాలను ఎదుర్కోవాల్సిందేనని అమిత్ షా స్పష్టం చేసినట్లు సమాచారం. దాంతో, తాము కోరుకున్నట్లుగా చర్చలు జరిగే అవకాశం లేదని మావోయిస్టులకు అర్థమైంది. ఆ తర్వాతే సాయుధ పోరాట విరమణ ప్రకటన వచ్చి ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



మోటార్ బైక్ రేసర్‌గా శర్వా

శర్వానంద్ కథానాయకుడిగా అభిలాష్ కంకర దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ ఓ చిత్రాన్ని నిర్మిస్తోన్న విషయం తెలిసిందే. మాళవిక నాయర్ కథానాయిక. బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఈ చిత్రంలో శర్వానంద్ మంచి నైపుణ్యాలున్న మోటార్ బైక్ రేసర్‌గా కనిపించబోతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోన్న షూటింగ్‌లో శర్వా బృందంపై రేస్‌కు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సన్నివేశాలు సినిమాలో హైలెట్‌గా ఉండబోతున్నట్లు సమాచారం. కాగా, ఈ చిత్రానికి జె.యువరాజ్ సినిమాటోగ్రఫీని, జిబ్రాన్ సంగీతాన్ని అందిస్తున్నారు.

ప్రేమకు మరణం లేదు

తేజ

రమణ సాకే, వనిత గౌడ జంటగా సత్య మార్క దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ప్రేమలో రెండోసారి'. సాకే రామయ్య సమర్పణలో సిద్ధ క్రియేషన్స్ బేనర్‌పై సాకే నీరజ లక్ష్మి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను దర్శకుడు తేజ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టీజర్ చాలా బాగుంది. ఈ భూమి ఉన్నంత వరకు ప్రేమకు మరణం లేదు, ప్రేమ కథాంశంతో వచ్చే చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ ఎప్పటికీ ఉంటుంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు సత్య మార్క మాట్లాడుతూ 'ఈ సినిమా నేటి యువతకు బాగా కనెక్ట్ అవుతుంది. అక్టోబరులో విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు. కార్యక్రమంలో చిత్ర కథానాయకుడు రమణ సాకే, కథానాయిక వనిత గౌడ తదితరులు మాట్లాడారు.





పవన్ గానం.. అభిమానులకు ఆనందం

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్ 'ఓజీ'. డీవీవీ దానయ్య నిర్మించారు. ఈ నెల 25న చిత్రం విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన పాటలు సూపర్ హిట్ అయ్యాయి. శుక్రవారం ఈ చిత్రం నుంచి 'వాషి యో వాషి' అనే పాటను విడుదల చేశారు. ఈ పాటను పవన్‌కల్యాణ్ పాడడం విశేషం. పవన్ 'అత్తారింటికి దారేది', 'జానీ' తదితర చిత్రాల్లో పాడి అలరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ గీతాన్ని వింటున్న అభిమానులు తెగ ఖుషీ అయిపోతున్నారు. ప్రియాంక అరుళ్‌మోహన్ కథానాయిక. పవన్ ఓజాస్ గంభీరా అనే శక్తిమంతమైన పాత్రలో, ఇమ్రాన్ హష్మీ 'ఓమీ'గా ప్రతినాయకుడి రోల్‌లో కనిపించనున్నారు. ఈ నెల 21న ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు మేకర్స్.

ఓజీ టికెట్ ధరల పెంపునకు అనుమతి

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన ఓజీ సినిమా టికెట్ ధరల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నెల 25న విడుదల కాబోతున్న ఈ భారీ బడ్జెట్ సినిమాకు రెండు వారాల పాటు టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతి కోరుతూ నిర్మాత డీవీవీ దానయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పరిశీలించిన ప్రభుత్వం పది రోజుల పాటు(అక్టోబరు 4వరకూ) అనుమతిచ్చింది. మొదటి రోజు బెనిఫిట్ షో టికెట్ రూ.1,000కి విక్రయించుకోవచ్చని తెలిపింది. రాష్ట్రంలోని అన్ని సింగిల్ స్ర్కీన్ థియేటర్లలో రూ.125, మల్టీప్లెక్స్‌లలో రూ.150కు పెంచుకోవచ్చని ఏపీ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈ విజయం కొత్తవాళ్లకు స్ఫూర్తి

- విజయ్ దేవరకొండ



'ఎవరి సహకారము లేకుండానే ఘన విజయం అందుకున్న 'లిటిల్ హార్ట్స్' చిత్ర బృందం సభ్యులు మరెంతో మంది కొత్తవాళ్లకు స్ఫూర్తిగా నిలుస్తారు. మనమూ సక్సెస్ అందుకోవచ్చనే ఒక పట్టుదల వారిలో కలుగుతుంది. అందుకే వీళ్లకు సపోర్ట్ చేయాలని అనిపించింది' అని అన్నారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. మౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా సాయి మార్తాండ్ తెరకెక్కించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్ బేనర్‌పై ఆదిత్య హాసన్ నిర్మించారు. ఇటీవలె సినిమా విడుదలై థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. కార్యక్రమంలో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ 'ఈ చిత్రబృందంతో ఒక సినిమా చేయాలని అనిపిస్తోంది. బన్నీ వాస్, వంశీ నందిపాటి ఈ సినిమా గురించి నాకు చెప్పారు. మా సంస్థ ద్వారా రిలీజ్ చేశాం. భారీ విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు. నిర్మాత బండ్ల గణేశ్ మాట్లాడుతూ 'నేను చాలా రోజుల తర్వాత థియేటర్‌లో చూసిన సినిమా ఇది. సినిమా అంటే ఇలా ఉండాలి అని అనిపించింది' అని చెప్పారు. కార్యక్రమంలో నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి, చిత్ర దర్శకుడు సాయి మార్తాండ్, నటుడు రాజీవ్ కనకాల, నటి అనితా చౌదరి తదితరులు మాట్లాడారు.

ఎన్టీఆర్‌కు స్వల్ప గాయం



హైదరాబాద్‌లో జరుగుతోన్న ఓ ప్రైవేట్ యాడ్ షూటింగ్‌లో జూనియర్ ఎన్టీఆర్ కాలికి స్వల్ప గాయమైంది. యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా ఆయన కింద పడిపోయారు. వెంటనే వ్యక్తిగత సిబ్బంది ఆయనను సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. ఈ ప్రమాదంపై ఎన్టీఆర్ బృందం ఓ ప్రకటనను విడుదల చేసింది. 'రెండు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సలహా ఇచ్చారు. ఆయన ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారు. 'ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎన్టీఆర్ ఆరోగ్యంపై వస్తున్న ఊహాగానాలను అభిమానులు నమ్మొద్దు' అని పేర్కొంది.

కర్మను ఎవరూ తప్పించుకోలేరు

- నాగ్ అశ్విన్





'కల్కి-2' ప్రాజెక్టు నుంచి దీపిక నిష్క్రమించిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా దీపికా పదుకొణె వ్యవహార శైలిపై పోస్టులు కనిపిస్తున్నాయి. పారితోషికం కారణంగానే ఆమెను తప్పించినట్లు వార్తలు వస్తున్నాయి. కొందరు దీపికను సమర్థిస్తూ కామెంట్లు పెడుతుండగా, మరికొందరు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'కల్కి 2898' చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్ పెట్టిన ఓ పోస్టు వైరల్ అయ్యింది. 'కర్మను ఎవరూ తప్పించుకోలేరు... నీ కర్మను నువ్వు అనుభవించాల్సిందే' అని అశ్వత్థామకు శ్రీకృష్ణుడు చెప్పిన సందేశాన్ని షేర్ చేశారు. దానితోపాటు 'జరిగిన దాన్ని ఎవరూ మార్చలేరు. కానీ, తర్వాత ఏం జరగాలో మీరు ఎంచుకోవచ్చు' అనే క్యాప్షన్ జోడించారు. దీంతో దీపికను ఉద్దేశించే నాగ్ అశ్విన్ ఈ పోస్టు పెట్టారని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

ఆస్కార్‌కు హోమ్‌బౌండ్



బాలీవుడ్ చిత్రం 'హోమ్‌బౌండ్' అరుదైన ఘనతను సాధించింది. 2026లో జరిగే 98వ ఆస్కార్ అవార్డుల పోటీకి భారత్ నుంచి ఈ సినిమా 'ఉత్తమ విదేశీ చిత్రం' విభాగంలో అధికారికంగా ఎంపికైంది. స్నేహం, గౌరవం, బతుకుతెరువు వంటి అంశాలతో హృదయానికి హత్తుకునేలా తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటికే పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ప్రశంసలూ, అవార్డులూ పొందడం విశేషం. ఇషాన్ కట్టర్, విశాల్ జెత్వా, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రధారులుగా 'మసాన్' ఫేమ్ నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించారు. కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదలవుతోంది. కరన్ జోహార్, అపూర్వ మెహతా, అదర్ పూనావాల, సోమేన్ మిశ్రా నిర్మించారు.



వినోదాత్మకం

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న చిత్రం 'కె- ర్యాంప్'. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండా, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దీపావళి సందర్భంగా అక్టోబరు 18న చిత్రం విడుదలవుతోంది. శుక్రవారం చిత్రం టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులోని ప్రేమకథ, యాక్షన్ సన్నివేశాలు, సంభాషణలు ఆకట్టుకున్నాయి. కేరళ నేపథ్యంలో సాగే పూర్తిస్థాయి ఎంటర్టైనర్‌గా సినిమా ఉంటుందని మేకర్స్ తెలిపారు. సాయికుమార్, మురళీధర్ గౌడ్, శివన్నారాయణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఛోటా కె ప్రసాద్, డీఓపీ: సతీశ్ రెడ్డి మాసం, సంగీతం: చేతన్ భరద్వాజ్.



రచయిత ఆకెళ్ల కన్నుమూత



రచయిత, దర్శకుడు ఆకెళ్ల వెంకట సూర్యనారాయణ గురువారం రాత్రి హైదరాబాద్‌లో కన్ను మూశారు. ఆయన వయసు 77 సంవత్సరాలు. చిరంజీవి నటించిన 'మగమహారాజు' రచయితగా ఆకెళ్లకు తొలి చిత్రం. అప్పటి నుంచి దాదాపు 80 చిత్రాలకు ఆయన కథ, మాటలు అందించారు. వీటిల్లో 'స్వాతిముత్యం', 'శ్రుతిలయలు', 'సిరివెన్నెల' 'శ్రీమతి ఒక బహుమతి', 'ఆయనకి ఇద్దరు', 'నాగదేవత', 'ఔనన్నా కాదన్నా' వంటి చిత్రాలు ఉన్నాయి. నరేశ్ నటించిన 'అయ్యయ్యో బ్రహ్మయ్య' చిత్రానికి ఆకెళ్ల దర్శకత్వం వహించారు కూడా. నాటక రచయితగా కూడా ఆకెళ్ల సుప్రసిద్ధులు. నాటక రచయితగా 13 సార్లు నంది అవార్డులు పొంది రికార్డులు నెలకొల్పారు. దాదాపు 200 కథలు, 20 నవలలు రాశారు. సీరియల్స్‌కు దాదాపు 800 ఎపిసోడ్స్ రాశారు. ఆకెళ్లకు భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. శనివారం ఆయన అంత్యక్రియలు జరుగుతాయి.

స్పోర్ట్స్

ఇక.. సూపర్ సమరం

నేడు లంక-బంగ్లా తొలి పోరు
సోనీ నెట్‌వర్క్‌లో..
ఆసియాకప్

దుబాయ్: ఆసియాకప్ టీ20 టోర్నీలో శనివారం సూపర్-4 పోరుకు తెర లేవనుంది. గ్రూప్ 'ఏ' నుంచి భారత్, పాకిస్థాన్.. గ్రూప్ 'బి' నుంచి శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు ఇందుకు అర్హత సాధించిన విషయం తెలిసిందే. సూపర్-4లో ప్రతీ జట్టు ఇతర మూడు జట్లతో ఆడాల్సి ఉంటుంది. ఈనెల 26 వరకు మొత్తం ఆరు మ్యాచ్‌లు జరుగనుండగా, టాప్-2లో నిలిచిన జట్లు 28న దుబాయ్‌లో జరిగే ఫైనల్లో తలపడతాయి. ముందుగా శ్రీలంక-బంగ్లాదేశ్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరుగనుంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో నెగ్గి లంక ఊపు మీదుంది. ఓపెనర్లు నిస్సాంక, మెండిస్ ఫామ్‌లో ఉన్నారు. అయితే మిడిలార్డర్ పుంజుకోవాల్సి ఉంది. అటు బంగ్లాదేశ్ జట్టు లంకపై గ్రూప్ దశలో ఎదురైన ఓటమికి ఈసారి బదులు తీర్చుకోవాలనుకుంటోంది. లిట్టన్ దాస్, హ్రిదయ్ బ్యాటింగ్‌లో కీలకం కానుండగా.. స్పిన్నర్లు తన్‌జీమ్, రిషాద్ రాణిస్తుండడం సానుకూలాంశం.

సూపర్-4 మ్యాచ్‌ల షెడ్యూల్

సెప్టెంబరు 20	శ్రీలంక x బంగ్లాదేశ్
సెప్టెంబరు 21	భారత్ x పాకిస్థాన్
సెప్టెంబరు 23	శ్రీలంక x పాకిస్థాన్
సెప్టెంబరు 24	భారత్ x బంగ్లాదేశ్
సెప్టెంబరు 25	బంగ్లాదేశ్ x పాకిస్థాన్
సెప్టెంబరు 26	భారత్ x శ్రీలంక
సెప్టెంబరు 28	ఫైనల్

(మ్యాచ్‌లన్నీ రాత్రి 8 గంటల నుంచి)

ఒమన్.. వణికించెన్!


కలీం (64)

చెమటోడ్చి నెగ్గిన భారత్



సంజూ శాంసన్ (56)

అబుధాబి: ఆసియాకప్ గ్రూప్ దశను టీమిండియా అజేయంగా ముగించింది. అయితే శుక్రవారం జరిగిన నామమాత్రపు పోరులో పసికూన ఒమన్.. భారత్‌ను వణికించింది. పాక్‌పై 67, యూఏఈపై 130 పరుగులకే కుప్పకూలిన ఈ జట్టు వరల్డ్ చాంపియన్ భారత్‌పై మాత్రం అటు బౌలింగ్‌లో.. ఇటు బ్యాటింగ్‌లోనూ బెంబేలెత్తించడం విశేషం. కాగా, ఆరంభంలో కాస్త నిదానంగా ఆడడంతో భారీ స్కోరు ఛేదనలో ఆ జట్టు వెనుకబడింది. దీంతో చివరకు భారత్ 21 పరుగుల తేడాతో గట్టెక్కింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 188 పరుగులు చేసింది. సంజూ శాంసన్ (45 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 56), అభిషేక్ (15 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 38), తిలక్ (18 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 29) రాణించారు. ఫైజల్, కలీం, జితేన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఒమన్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 167 పరుగులు చేసి ఓడింది. ఆమిర్ కలీం (46 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 64), హమ్మద్ మీర్జా (33 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 51) చెలరేగారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సంజూ శాంసన్ నిలిచాడు.

ఆకట్టుకున్న కలీం, మీర్జా: భారీ ఛేదనలో ఒమన్ బ్యాటర్లు గట్టిగానే పోరాడారు. దీంతో భారత బౌలర్లు పవర్‌ప్లేలో ఒక్క వికెట్ కూడా తీయలేదు. బంతికో పరుగు చొప్పున సాధించిన జతిందర్ (32)ను తొమ్మిదో ఓవర్‌లో కుల్దీప్ అవుట్ చేశాడు. ఆ తర్వాత వికెట్ల పతనం సాగుతుందనుకున్నా.. 43 ఏళ్ల ఓపెనర్ ఆమిర్ కలీంకు హమ్మద్ మీర్జా జత కలవడంతో ఎదురుదాడి ఆరంభమైంది. 13వ ఓవర్ నుంచి లక్ష్యం వైపు వేగంగా సాగారు. అటు కలీం 38 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. కుల్దీప్ ఓవర్‌లో మీర్జా రెండు సిక్సర్లతో జోరు చూపాడు. 18 బంతుల్లో 48 రన్స్ అవసరమవగా.. చేతిలో 9 వికెట్లు ఉండడంతో ఒమన్ సంచలనం చేస్తుందా? అనిపించింది. కానీ 18వ ఓవర్‌లో కలీమ్‌ను హర్షిత్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ వెంటనే 30 బంతుల్లో అర్ధసెంచరీ చేసిన మీర్జా సైతం వెనుదిరగడంతో ఒమన్‌కు ఓటమి ఖరారైంది.

శాంసన్ నిలకడగా..: బ్యాటర్లకు తగిన ప్రాక్టీస్ కోసం టాస్ గెలవగానే భారత్ బ్యాటింగ్‌ను ఎంచుకుంది. దీంతో ఒమన్‌పై సులువుగా 200 స్కోరు సాధిస్తారని అంతా భావించారు. కానీ అందరినీ ఆశ్చర్యపరుస్తూ ఆ జట్టు బౌలర్లు ఏకంగా 8 వికెట్లు పడగొట్టారు. స్లో పిచ్ కావడంతో బ్యాటర్లు స్వేచ్ఛగా ఆడలేకపోయారు. కానీ ఓపెనర్ అభిషేక్ మాత్రం సహజశైలిలో చెలరేగాడు. వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన శాంసన్ నిలకడగా ఆడి హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ జోడీ తొలి వికెట్‌కు 66 పరుగులు జోడించింది. అయితే కెప్టెన్ సూర్యకుమార్ మాత్రం సహచరులనందరినీ ముందుగా పంపి తను పదకొండో నెంబర్‌గా డగౌట్‌కే పరిమితమయ్యాడు. ఇక రెండో ఓవర్‌లోనే ఓపెనర్ గిల్ (5)ను పేసర్ ఫైజల్ కళ్లుచెదిరే బంతితో బౌల్డ్ చేసి షాకిచ్చాడు. అభిషేక్ ధాటికి పవర్‌ప్లేలో జట్టు 60/1 స్కోరుతో నిలిచింది. ఏడో ఓవర్‌లో శాంసన్ 6,4తో 12 రన్స్ సాధించగా.. తర్వాతి ఓవర్‌లోనే అభిషేక్, హార్దిక్ (1) వెనుదిరిగారు. అనంతరం ఉన్న కాసేపు అక్షర్ (26) వేగంగా ఆడాలని ప్రయత్నించి శాంసన్‌తో నాలుగో వికెట్‌కు 45 పరుగులు జోడించాడు. దూబే (5) విఫలం కాగా.. తిలక్ వచ్చీ రాగానే భారీ షాట్లకు వెళ్లి 16వ ఓవర్‌లో 6,4తో స్కోరులో కదలిక తెచ్చాడు. అటు శాంసన్ ఓ ఫోర్‌తో 41 బంతుల్లో తన కెరీర్‌లో నెమ్మదైన హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. కానీ ఈ ఇద్దరూ వరుస ఓవర్లలో అవుట్ కావడంతో చివరి మూడు ఓవర్లలో జట్టు 21 రన్స్ మాత్రమే సాధించింది.

స్కోరుబోర్డు

భారత్: అభిషేక్ (సి) శుక్లా (బి) రామనంది 38, గిల్ (బి) షా ఫైజల్ 5, శాంసన్ (సి) బిస్త్ (బి) షా ఫైజల్ 56, హార్దిక్ (రనౌట్) 1, అక్షర్ (సి) శుక్లా (బి) ఆమిర్ కలీం 26, శివమ్ దూబే (సి) జతిందర్ (బి) ఆమిర్ కలీం 5, తిలక్ (సి) జిక్రియా ఇస్లామ్ (బి) రామనంది 29, హర్షిత్ (నాటౌట్) 13, అర్ష్‌దీప్ (రనౌట్) 1, కుల్దీప్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 20 ఓవర్లలో 188/8; వికెట్ల పతనం:** 1-6, 2-72, 3-73, 4-118, 5-130, 6-171, 7-176, 8-179; **బౌలింగ్:** షకీల్ 3-0-33-0, షా ఫైజల్ 4-1-23-2, నదీమ్ 1-0-19-0, జితెన్ రామనంది 4-0-33-2, సమయ్ శ్రీవాత్సవ 2-0-23-0, జిక్రియా ఇస్లామ్ 3-0-23-0, ఆమిర్ కలీం 3-0-31-2.

ఒమన్: జతిందర్ (బి) కుల్దీప్ 32, ఆమిర్ కలీం (సి) హార్దిక్ (బి) హర్షిత్ 64, హమ్మద్ మీర్జా (సి/సబ్) రింకూ (బి) హార్దిక్ 51, జిక్రియా ఇస్లామ్ (నాటౌట్) 0, వినాయక్ శుక్లా (సి/సబ్) రింకూ (బి) అర్ష్‌దీప్ 1, రామనంది (నాటౌట్) 12; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 167/4; వికెట్ల పతనం:** 1-56, 2-149, 3-154, 4-155; **బౌలింగ్:** హార్దిక్ 4-0-26-1, అర్ష్‌దీప్ 4-0-37-1, హర్షిత్ 3-0-25-1, కుల్దీప్ 3-0-23-1, అక్షర్ 1-0-4-0, శివమ్ దూబే 3-0-31-0, తిలక్ 1-0-8-0, అభిషేక్ 1-0-12-0.

సెమీస్‌లో సాత్విక్ జోడీ



సింధుకు మళ్లీ నిరాశ
చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్

షెన్‌జెన్ (చైనా): గతవారం హాంకాంగ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి జోడీ వరుసగా రెండో టోర్నీలోనూ సత్తా చాటుతోంది. ఈ భారత జంట చైనా మాస్టర్స్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక, సింగిల్స్ ఏస్ షట్లర్ పీవీ సింధు మరోసారి నిరాశపరుస్తూ క్వార్టర్‌ఫైనల్‌తోనే తన పోరాటాన్ని ముగించింది. సింధు 14-21, 13-21తో టాప్ సీడ్, ఒలింపిక్ చాంపియన్ అన్ సే యంగ్ (కొరియా) చేతిలో పరాజయం పాలైంది. ఇక 8వ సీడ్ సాత్విక్/చిరాగ్ ద్వయం 21-14, 21-14తో చైనా జంట రెన్ గ్జియాంగ్ యు/గ్జీ హావోనాన్‌ను ఓడించింది. శనివారం జరిగే సెమీఫైనల్లో రెండో సీడ్, మలేసియా జంట ఆరోన్ చియా/సో వూయి యిక్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.

టాస్‌కు 4 నిమిషాల ముందు..

దుబాయ్: పాకిస్థాన్‌తో గత ఆదివారం జరిగిన ఆసియా కప్ మ్యాచ్ సందర్భంగా ఆ జట్టుతో టీమిండియా క్రికెటర్లు కరచాలనం చేయకపోవడం పెద్ద దుమారం రేపింది. కెప్టెన్లు సూర్యకుమార్, ఆఘా కరచాలనం చేసుకోరనే సమాచారం టాస్‌కు నాలుగు నిమిషాల ముందు మాత్రమే పైక్రాఫ్ట్‌కు అందిందట! ఈ విషయాన్ని ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) వేదిక మేనేజర్ ఆండీకి చేరవేశాడట. టాస్ సందర్భంగా ఒకవేళ సల్మాన్ భారత సారథికి షేక్‌హ్యాండ్ ఇవ్వబోతే.. అందుకు సూర్యకుమార్ తిరస్కరిస్తే పాకిస్థాన్ కెప్టెన్‌కు అది ఇబ్బందిగా ఉంటుందని పైక్రాఫ్ట్ భావించాడు. దాంతో సూర్యకుమార్‌తో కరచాలనం ఉండబోదని ఆఘాకు ఆండీ చెప్పాడు. కానీ పీసీబీ వేరేగా అర్థం చేసుకొని పైక్రాఫ్ట్‌పై విమర్శలు చేసింది.

భారత్ X ఆస్ట్రేలియా
మహిళల మూడో వన్డే నేడు
(మ. 1.30 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో..)

బోల్ట్ సరసన లైల్స్



- నాలుగోసారి 200 మీ. టైటిల్ కైవసం
- వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్

టోక్యో: అమెరికా స్టార్ నోవా లైల్స్ జమైకా దిగ్గజ స్ప్రింటర్ ఉసేన్ బోల్ట్ రికార్డును సమం చేశాడు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో లైల్స్ వరుసగా నాలుగోసారి 200 మీటర్ల స్ప్రింట్ టైటిల్ కొల్లగొట్టాడు. పారిస్ ఒలింపిక్స్ ఫైనల్లో తలపడిన ఎనిమిదిమంది రన్నర్లు బరిలో దిగడంతో శుక్రవారంనాటి ప్రపంచ అథ్లెటిక్స్ 200 మీ. ఫైనల్ హోరాహోరీగా సాగింది. కానీ అందర్నీ వెనక్కునెట్టిన నోవా 19.52 సె. టైమింగ్‌తో స్వర్ణం గెలిచాడు. దాంతో గతంలో ఈ ఫీట్ సాధించిన జమైకా గ్రేట్ బోల్ట్ సరసన లైల్స్ చేరాడు. అమెరికాకే చెందిన కెన్నీ బెడ్నరెక్ (19.58 సె.), రజతం, జమైకా రన్నర్ కెన్నీ లెవెల్ (19.64సె.) కాంస్యం చేజిక్కించుకున్నారు. ఒలింపిక్ చాంపియన్ లెస్లీ టెబెగో నాలుగో స్థానంలో నిలిచాడు.



మెలిస్సా జఫర్సన్

మెలిస్సా గోల్డెన్ డబుల్: గత పోటీల మహిళల 200 మీ. విజేత షెరికా జాక్సన్ (జమైకా) టైటిల్ నిలబెట్టుకోలేకపోయింది. 22.18 సె.లలో గమ్యం చేరిన షెరికా కాంస్యానికే పరిమితమైంది. మెలిస్సా జఫర్సన్ ఉడెన్ (21.66సె.) స్వర్ణం సొంతం చేసుకోగా, అమీ హంట్ (బ్రిటన్- 22.14సె.) రజతం నెగ్గింది. ఈసారి 100 మీ. స్ప్రింట్‌లోనూ టైటిల్ అందుకున్న జఫర్సన్ 200మీ. టైటిల్‌తో 'గోల్డెన్' డబుల్ సాధించింది.

వెల్లలగెకు పితృ వియోగం

అబుధాబి: ఆసియాకప్ సూపర్-4లో ప్రవేశించిన శ్రీలంక జట్టు శిబిరంలో విషాదం అలుముకొంది. 22 ఏళ్ల యువ స్పిన్నర్ దునిత్ వెల్లలగె తండ్రి సురంగ గుండెపోటుతో మరణించాడు. గురువారం అఫ్ఘాన్‌తో మ్యాచ్ జరుగుతుండగానే ఈ వార్త జట్టు సిబ్బందికి తెలిసింది. అయితే మ్యాచ్ ముగిసిన తర్వాతే ఈ విషాదాన్ని దునిత్‌కు తెలిపారు. దీంతో వెంటనే అతను జట్టును వీడి స్వదేశానికి వెళ్లాడు. కెరీర్‌లో ఐదో టీ20 మ్యాచ్ ఆడిన వెల్లలగెకు ఇదే తొలి ఆసియాకప్. మరోవైపు అఫ్ఘాన్ ఇన్నింగ్స్‌లో వెల్లలగె చివరి ఓవర్ వేయగా.. నబీ వరుసగా ఐదు సిక్సర్లు బాది 32 రన్స్ అందించిన విషయం తెలిసిందే. అయితే స్పిన్నర్ తండ్రి మరణ వార్త విని నబీ కూడా షాక్‌కు గురయ్యాడు.

ఆసియా స్కేటింగ్‌లో అర్ణవ్‌కు కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా ఓపెన్ ట్రాక్ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ క్రీడాకారుడు పి.అర్ణవ్ రెడ్డి కాంస్యం నెగ్గాడు. డెహ్రాడూన్‌లోని హిమాద్రి ఐస్ రింక్‌లో జరిగిన ఈ పోటీల్లోని 333 మీటర్ల రేసులో అర్ణవ్ తృతీయ స్థానంలో నిలిచాడు. కోచ్‌లు ఖదీర్, సయ్యద్ ఎహసాన్ అహ్మద్ వద్ద అర్ణవ్ శిక్షణ తీసుకున్నాడు.

పడిక్కళ్ సెంచరీ

భారత్ 'ఎ' 531/7 డిక్లేర్
ఆసీస్ 'ఎ'తో మ్యాచ్ డ్రా

బెంగళూరు: భారత్-ఆస్ట్రేలియా 'ఏ' జట్ల మధ్య జరిగిన తొలి అనధికార టెస్టు డ్రాగా ముగిసింది. దేవ్‌దత్ పడిక్కళ్ (150) భారీ శతకం సహాయంతో శుక్రవారం చివరి రోజు భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌ను 531/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. జురెల్ 140 రన్స్ చేశాడు. టీ విరామానంతరం ఒక్క పరుగు ఆధిక్యంతో ఆసీస్ 'ఏ' రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. 16 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 56 రన్స్ చేశాక, వర్షం కారణంగా మ్యాచ్ ముందుకు సాగలేదు. దీంతో ఇరు జట్ల కెప్టెన్లు డ్రాకు అంగీకరించారు.

టైటాన్స్ గెలిచింది!

జైపూర్: ఈ సీజన్ ప్రొ కబడ్డీ లీగ్‌లో వరుస వైఫల్యాలతో నిరాశపరుస్తున్న తెలుగు టైటాన్స్‌కు ఊరట లభించింది. వరుసగా మూడు ఓటముల అనంతరం విజయాన్ని నమోదు చేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 43-29తో తమిళ్ తలైవాస్‌ను చిత్తు చేసింది. ఓవరాల్‌గా 9 మ్యాచుల్లో టైటాన్స్‌కిది నాలుగో గెలుపు. మరో మ్యాచ్‌లో హరియాణా 34-30తో పుణెరి పల్టాన్‌కు షాకిచ్చింది.

బిజినెస్

వారసులకు సులభంగా సెక్యూరిటీల బదిలీ

జనవరి 1 నుంచి అమలు : సెబీ

న్యూఢిల్లీ: నామినీల నుంచి వారసులకు షేర్లు, రుణ పత్రాలు, మ్యూచువల్ ఫండ్స్ వంటి సెక్యూరిటీల బదిలీని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ సులభతరం చేసింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం నామినీలు వీటిని చట్టబద్ధ వారసులకు బదిలీ చేస్తే కొన్ని సమయాల్లో వాటిని 'బదిలీ'గా పరిగణించి, మూలధన లాభాల పన్ను (సీజీటీ) విధిస్తున్నారు. అయితే 1961 నాటి ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 47 (ఐఐఐ) ప్రకారం ఇలాంటి లావాదేవీలపై చెల్లించే పన్నుపై నామినీలు రిఫండ్ క్లెయిమ్ చేసుకోవచ్చు. దీనికి వచ్చే ఏడాది జనవరి 1 నుంచి తెరపడనుంది. ఇందుకోసం టీఎల్‌హెచ్ (ట్రాన్స్‌మిషన్ టు లీగల్ హెయిర్స్) పేరుతో కొత్త కోడ్ అమలు చేస్తారు. దీనివల్ల నామినీలపైనా ఎటువంటి పన్నుల భారం పడదని సెబీ పేర్కొంది.

ఏఐఎఫ్‌ల ఎన్‌ఏవీలు

ప్రత్యామ్నాయ పెట్టుబడి పథకాల (ఏఐఎఫ్) నికర ఆస్తుల విలువ (ఎన్‌ఏవీ)ల ప్రకటనల్లో పారదర్శకత కోసం సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి శుక్రవారం ఒక సర్క్యులర్ జారీ చేసింది. ఈ సంస్థలు ఇక ప్రతి 15 రోజులకు ఒకసారి తమ డిపాజిటరీ వ్యవస్థల్లో ఆయా పథకాల ఎన్‌ఏవీలను అప్‌డేట్ చేయాలని ఆదేశించింది. ఒకవేళ ఈ సంస్థలే ఈ పథకాల పెట్టుబడుల విలువను లెక్కిస్తే ఏ తేదీన లెక్కించారనే విషయాన్ని తమ రికార్డుల్లో నమోదు చేయాలని సెబీ కోరింది. ఈ సర్క్యులర్‌ను 45 రోజుల్లో ఏఐఎఫ్‌లు అమలు చేయాలని సెబీ కోరింది.

ప్రమోటర్ల చేతికే గాయత్రి ప్రాజెక్ట్స్

రూ.2,400 కోట్ల ఓటీఎస్‌కు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం

70% బకాయిల మాఫీ
బ్యాంకులపై రూ.5,700 కోట్ల భారం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన గాయత్రి ప్రాజెక్ట్స్‌పై దాఖలైన దివాలా పరిష్కార పిటిషన్ కొలిక్కి వచ్చింది. వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద రూ.2,400 కోట్లు చెల్లించి కంపెనీని తిరిగి సొంతం చేసుకునేందుకు సంస్థ ప్రమోటర్లయిన మాజీ ఎంపీ టీ సుబ్బరామి రెడ్డి కుటుంబ సభ్యులు చేసిన ప్రతిపాదనకు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), హైదరాబాద్ బెంచ్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా రూ.750 కోట్లను 90 రోజుల్లో చెల్లించాల్సి ఉంటుంది. కెనరా బ్యాంక్ నేతృత్వంలోని రుణదాతల కమిటీ (సీఓసీ)లోని 97 శాతం మంది ఇందుకు ఆమోదం తెలపడంతో ఎన్‌సీఎల్‌టీ ఇందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో గాయత్రి ప్రాజెక్ట్స్ నుంచి తమకు రావాల్సిన రూ.8,100 కోట్ల రుణ బకాయిల్లో రూ.5,700 కోట్లకు (70 శాతం) ఆశలు వదులుకున్నట్టయింది. గాయత్రికి రుణాలిచ్చిన బ్యాంకుల్లో కెనరా బ్యాంక్‌తో పాటు బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), ఐడీబీఐ బ్యాంక్ ఉన్నాయి. కాగా గాయత్రి ప్రాజెక్ట్స్ ఇప్పటికే రుణదాతల వద్ద రూ.115 కోట్లు డిపాజిట్ చేసినట్లు తెలిసింది.

ఇదీ కథ: సుబ్బరామి రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు గాయత్రి ప్రాజెక్ట్స్‌ను ప్రమోట్ చేశారు. ఈపీసీ రంగంలో అనేక ప్రాజెక్టులు చేపట్టిన ఈ కంపెనీ కెనరా బ్యాంక్ నేతృత్వంలోని బ్యాంకులకు రూ.8,100 కోట్ల రుణ బకాయిలు చెల్లించడంలో విఫలమైంది. దీంతో 2022 నవంబరులో బ్యాంకులు కంపెనీపై దివాలా పిటిషన్ ఫైల్ చేశాయి. అయితే ఏ కంపెనీ కూడా గాయత్రి ప్రాజెక్ట్స్‌ను కొనుగోలు చేసేందుకు ముందుకు రాలేదు. దీంతో 2024 జనవరిలో రుణదాతలు కంపెనీ లిక్విడేషన్‌కు అనుమతి కోరుతూ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించారు. తాజాగా సుబ్బరామి రెడ్డి కుటుంబమే ఓటీఎస్ కింద రూ.2,400 కోట్లు చెల్లించేందుకు ముందుకు వచ్చింది. దీంతో బ్యాంకులు ఈ రుణ ఖాతాను క్లోజ్ చేయాలని నిర్ణయించాయి.

ఏపీలో వేదాంతకు మాంగనీస్ బ్లాక్

న్యూఢిల్లీ: వేదాంత గ్రూప్ ఆంధ్రప్రదేశ్‌లో మాంగనీస్ ఖనిజ నిక్షేపాల కోసం అన్వేషణకు సిద్ధమవుతోంది. శ్రీకాకుళం జిల్లాలోని గంగువారి సిగడం మండలంలో పున్నం గ్రామం వద్ద 152 హెక్టార్లలో ఈ అన్వేషణ జరిపే కాంట్రాక్టును కంపెనీ వేలంలో దక్కించుకుంది. 'ఏపీలోని పున్నం బ్లాకులో మాంగనీసు ఖనిజ అన్వేషణ, ఉత్పత్తి కోసం సంస్థ వేసిన బిడ్‌ను కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని గనులు, భూగర్భ శాఖ ప్రిఫర్డ్ బిడ్‌గా ఎంపిక చేసింది' అని వేదాంత గ్రూప్ శుక్రవారం బీఎస్ఈకి తెలిపింది. పెర్‌ఫార్మెన్స్ గ్యారెంటీ, చట్టబద్ధమైన అనుమతులు, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అనుమతులకు లోబడి వేదాంత ఈ బ్లాకులో మాంగనీస్ ఖనిజ అన్వేషణ, ఉత్పత్తి చేపడుతుంది.

వడ్డీ రేట్లు తగ్గించిన బీఓబీ, ఐఓబీ

న్యూఢిల్లీ: దేశంలో మరో విడత వడ్డీ రేట్ల తగ్గింపు ప్రారంభమైంది. ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) ఇందుకు శ్రీకారం చుట్టాయి. అదనపు నిధుల సమీకరణ ఖర్చుల ఆధారంగా నిర్ణయించే తమ ఎంసీఎల్ఆర్ రుణాల వడ్డీ రేట్లను 15 బేసిస్ పాయింట్లు (వంద బేసిస్ పాయింట్లు ఒక శాతానికి సమానం) తగ్గిస్తున్నట్టు ఈ రెండు బ్యాంకులు ప్రకటించాయి.

ఏటా రూ.120 కోట్ల పెట్టుబడులు

- కొత్తగా 12-14 షోరూమ్స్ ఏర్పాటు
- లైఫ్‌స్టైల్ ఇంటర్నేషనల్ సీఈఓ దేవ్ అయ్యర్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దుబాయ్‌కి చెందిన ల్యాండ్‌మార్క్ గ్రూప్ సంస్థ.. లైఫ్‌స్టైల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఏటా రూ.120 కోట్ల పెట్టుబడులతో కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. శుక్రవారం నాడిక్కడ సంస్థ సీఈఓ, ఈడీ దేవ్ అయ్యర్.. టాలీవుడ్ నటి పూజా హెగ్డేతో కలిసి దసరా కలెక్షన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా అయ్యర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా లైఫ్‌స్టైల్ 124 స్టోర్లను నిర్వహిస్తోందని, విస్తరణలో భాగంగా ప్రతి సంవత్సరం కొత్తగా 12-14 షోరూమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఏటా రూ.120 కోట్ల వరకు పెట్టుబడులు పెడుతున్నట్లు ఆయన వివరించారు. కాగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సంస్థ 14 స్టోర్స్‌ను నిర్వహిస్తోందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 4 షోరూమ్స్‌ను ప్రారంభించనున్నట్లు అయ్యర్ తెలిపారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో లైఫ్‌స్టైల్ టర్నోవర్ రూ.5,000 కోట్లుగా ఉందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రెండంకెల వృద్ధిని అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. లైఫ్‌స్టైల్ మొత్తం ఆదాయంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల వాటా 11 శాతంగా ఉందన్నారు. వస్త్రాలపై జీఎస్‌టీ తగ్గింపు రిటైల్ పరిశ్రమలో జోష్ నింపనుందని, దీంతో ఈ పండగ సీజన్‌లో అమ్మకాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



20వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	130
వరంగల్	115	గుంటూరు	132
కరీంనగర్	115	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	120
కర్నూలు	115	నెల్లూరు	125
విశాఖపట్నం	134	అనంతపురం	125
గోదావరి	130		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,330 ▲	1,02,050 ▲	1,43,000 ▲
విజయవాడ	1,13,250 ▼	1,07,500 ▲	1,32,150 ▲
విశాఖపట్నం	1,13,740 ▲	1,02,500 ▲	1,43,000 ▲
రాజమండ్రి	1,11,330 ▲	1,02,050 ▲	1,32,600 ▲
ప్రొద్దుటూరు	1,14,050 ▲	1,04,930 ▲	1,33,300 ▲
ముంబై	1,09,775 ▼	1,00,554 ▼	1,28,000 ▲

ఐ ఫోన్ 17 కోసం బారులు



న్యూఢిల్లీ: యాపిల్ కంపెనీ శుక్రవారం భారత మార్కెట్లో విడుదల చేసిన ఐఫోన్ 17 కోసం కస్టమర్లు దేశంలోని మూడు ప్రధాన స్టోర్ల ముందు బారులు తీరారు. కొత్త డివైస్‌ను కళ్లారా చూసి, చేజిక్కించుకోవాలన్న ఆతృతతో గురువారం అర్ధరాత్రి నుంచే కస్టమర్లు ముంబై, ఢిల్లీ, బెంగళూరు నగరాల్లోని యాపిల్ స్టోర్ల ముందు క్యూ కట్టారు. ప్రధానంగా యువత అత్యుత్సాహంతో సుమారు 21 గంటలకు పైగా ఐఫోన్ 17 పొందడం కోసం అలాగే క్యూలైన్లలోనే పడిగాపులు పడుతూ కనిపించారు. ఢిల్లీలోని సాకేత్ సిటీ వాక్ మాల్, బెంగళూరులోని హెబ్బాల్‌లో ఆసియా మాల్, ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని జియో వరల్డ్ డ్రైవ్ మాల్ ముందు ఏర్పడిన పొడవైన క్యూలు ఆ బ్రాండ్‌కు గల జనాదరణకు దర్పణం పట్టాయి. స్టోర్లన్నీ ముందుగానే ప్రకటించినట్టుగా ఉదయం 8 గంటలకు తెరిచారు. తాము ముందస్తుగా బుక్ చేసుకుని, చేతుల్లోకి తీసుకున్న ఐఫోన్ 17ను చూపుతూ కస్టమర్లు వెలుపలికి వస్తున్న దృశ్యాలు కనిపించాయి. అమ్మకాలు ప్రారంభమైన తొలిరోజు రికార్డు స్థాయిలో కస్టమర్ల రాక కనిపించిందని రిటైలర్లు ప్రకటించారు. కాగా ముంబైలో ఉదయం ఆరు గంటల ప్రాంతంలో లైన్లో ఉన్న కొందరు కస్టమర్ల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది రంగంలోకి దిగడంతో గొడవ సద్దుమణిగింది. యాపిల్ ఐఫోన్ 17 మన దేశంలో రూ.82,900 నుంచి రూ.2,29,000 ధరల శ్రేణిలో అందుబాటులో ఉంది.

సంగం ఉత్పత్తుల ధరలు తగ్గింపు

పొన్నూరు టౌన్ (ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ ఉత్పత్తుల ధరలను సెప్టెంబరు 22 నుంచి తగ్గిస్తున్నట్లు చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ శుక్రవారం తెలిపారు. కేంద్రం తగ్గించిన జీఎస్‌టీకి అనుగుణంగా ఆ ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేయాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. యూఎచ్‌టీ పాలు లీటరుకు రూ. 2, పన్నీరు కేజీకు రూ. 15, నెయ్యి కేజీకి రూ. 30, వెన్న కేజీకి రూ. 30, మిల్క్ షేక్స్ రూ. 5, బేకరీ ఉత్పత్తులపై రూ. 20 మేరకు ధరలను తగ్గిస్తున్నట్లు తెలిపారు.

సహకార బ్యాంకుల్లోనూ ఆధార్ ఆధారిత చెల్లింపులు

న్యూఢిల్లీ: గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లోనూ డిజిటల్ ఆర్థిక సేవల విస్తరణకు ప్రభుత్వం మరో కీలక చర్య తీసుకుంది. ఈ ప్రాంతాల్లోని సహకార బ్యాంకులు ఆధార్ ఆధారిత చెల్లింపుల కోసం యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) కొత్త విధానాన్ని ప్రకటించింది. నాబార్డు, ఎన్‌పీసీఐ, సహకార బ్యాంకులతో కలిసి యూఐడీఏఐ ఈ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను అభివృద్ధి చేసింది. దీనివల్ల సహకార బ్యాంకుల్లో ఆధార్ ధ్రువీకరణ, ఈకేవైసీ సేవలు సులభమవుతాయి.

బీహెచ్ఈఎల్‌కు రూ.586 కోట్ల జీఎస్‌టీ నోటీస్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బీహెచ్ఈఎల్ (భెల్)కు తెలంగాణ జీఎస్‌టీ అధికారులు పెద్ద షాకిచ్చారు. 2021-22 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.586.43 కోట్ల జీఎస్‌టీ చెల్లించాలని షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరాలకు సంవత్సరాలకు సంబంధించి బీహెచ్ఈఎల్ ఫైల్ చేసిన జీఎస్‌టీ రిటర్న్‌లు, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లలో తేడాల ఆధారంగా ఈ నోటీసు జారీ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా ఈ నోటీసుకు తగిన విధంగా సమాధానం ఇస్తామని బీహెచ్ఈఎల్ తెలిపింది. తెలంగాణ అధికారుల వాదన కోర్టులో నిలబడదని కూడా పేర్కొంది.

మూడు రోజుల లాభాలకు తెర

ముంబై: ఈక్విటీ మార్కెట్ మూడు రోజుల లాభాలకు తెర దించింది. హిండెన్‌బర్గ్ వ్యవహారంలో సెబీ ఇచ్చిన క్లీన్‌చిట్‌తో అదానీ గ్రూప్ షేర్లలో ర్యాలీ ఏర్పడినా బ్లూచిప్ కంపెనీలు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో లాభాల స్వీకారం మార్కెట్‌ను నష్టాల్లోకి నెట్టింది. సెన్సెక్స్ 387.73 పాయింట్ల నష్టంతో 82,626.23 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 528.04 పాయింట్ల వరకు నష్టపోయి 82,485.92 స్థాయిని తాకింది. నిఫ్టీ 96.55 పాయింట్ల నష్టంతో 25,327.05 వద్ద ముగిసింది. అయితే వారం మొత్తం మీద సెన్సెక్స్ 721.53 పాయింట్లు, నిఫ్టీ 213.05 పాయింట్లు లాభపడ్డాయి.

అదానీ షేర్లు జూమ్: సెబీ ఉత్తర్వుల నేపథ్యంలో అదానీ గ్రూప్ కంపెనీలన్నింటి ఉమ్మడి మార్కెట్ క్యాప్ రూ.69,000 కోట్ల మేరకు పెరిగి రూ.13.96 లక్షల కోట్లకు చేరింది. అదానీ పవర్ గరిష్ఠంగా 12.40% లాభపడగా అదానీ టోటల్ గ్యాస్ (7.35%), అదానీ గ్రీన్ ఎనర్జీ (5.33%), అదానీ ఎంటర్‌ప్రైజెస్ (5.04%), అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ (4.70%), సంఘీ ఇండస్ట్రీస్ (1.41%), ఏసీసీ (1.21%), అదానీ పోర్ట్స్ (1.09%), అంబుజా సిమెంట్స్ (0.28%) లాభపడ్డాయి.

బతుకమ్మ ఆడుదాం రండి!

» సునీత, సబితకు మహిళా కాంగ్రెస్ ఆహ్వానం

బతుకమ్మకుంటలో బతుకమ్మ ఆడుదాం రండంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని మహిళా కాంగ్రెస్ ఆహ్వానించింది. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావ్ ఈ మేరకు ఆహ్వానం పలికారు. సొంత చెల్లెలినే పార్టీ నుంచి బయటికి పంపిన చరిత్ర కేటీఆర్‌దని, బతుకమ్మపైన పాటను విడుదల చేసే ముందు ఆయన ఆడబిడ్డలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే కుట్ర

» ఇందిరాపార్కు వద్ద లంబాడీల ఆత్మగౌరవ సభలో వక్తలు

కవాడిగూడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రయోజనాల కోసం లంబాడీలపై కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తూ చారిత్రక వాస్తవాలను వక్రీకరించి గిరిజన సమాజాన్ని విభజించడానికి ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ఇందిరా పార్కు వద్ద తెలంగాణ లంబాడీల ఐక్య వేదిక ఆధ్వర్యంలో లంబాడీల ఆత్మగౌరవ సభను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ అడిషనల్ డీజీపీ డీటీ నాయక్, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, రెడ్యానాయక్, అమర్‌సింగ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా పార్లమెంట్ చట్టం ద్వారా లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చారని వారు గుర్తు చేశారు. హైదరాబాద్ సంస్థానంలో కూడా లంబాడీలు ఇతర గిరిజన తెగలైన గోండు, కోయ, చెంచులతో పాటు గిరిజన జాబితాలో ఉన్నారని, ఇందుకు ఆధారాలు ఉన్నాయని చెప్పారు.

ప్రభుత్వ విభాగాల్లో బీసీ సెల్‌లు ఏర్పాటు చేయాలి

» తెలంగాణ బీసీ కమిషన్ తీర్మానం

హైదరాబాద్, సెప్టెంబర్19 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వ శాఖల విభాగాధిపతుల కార్యాలయాల్లో బీసీసెల్‌లను ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ కమిషన్ నిర్ణయించింది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా-ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు నేపథ్యంలో ప్రభుత్వ శాఖల్లో వెనుకబడిన వర్గాలకు సంబంధించిన సమస్యలను పరిశీలించేందుకు ఆయా స్థాయుల్లో బీసీ సెల్‌లను అధికారికంగా ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానం చేసింది. ఈ మేరకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని బీసీ కమిషన్ సూచించింది. చైర్మన్ జి.నిరంజన్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ బీసీ కమిషన్ సమావేశంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్,రంగు బాలలక్ష్మితో పాటు కమిషన్ మెంబర్ సెక్రెటరీ బాలమాయదేవి తదితరులు పాల్గొన్నారు.

వోక్సన్ వర్సిటీ విద్యార్థులకు గంజాయి సరఫరా

» నిందితుడి అరెస్టు.. 40 గ్రాముల గంజాయి స్వాధీనం

మునిపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని కంకోల్ వోక్సన్ యూనివర్సిటీ విద్యార్థులకు గంజాయి సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 40 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోని బీదర్ నుంచి గంజాయి తీసుకొచ్చి వోక్సన్ వర్సిటీ విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో ఎస్సై రాజేశ్‌నాయక్ తన సిబ్బందితో కలిసి వర్సిటీ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన ఓ ట్యాక్సీ కారులో 40 గ్రాముల ఎండు గంజాయిని గుర్తించారు. ఈ కేసులో నిందితుడు కోహీర్ మండలం దిగ్వాల్‌కు చెందిన అఖిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఏపీలో వైసీపీకి భారీ షాక్!

» టీడీపీలో చేరిన ముగ్గురు ఎమ్మెల్సీలు

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, బల్లి కల్యాణ్ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ టీడీపీలో చేరారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమక్షంలో వారు పసుపు కండువా కప్పుకొన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు వారిని సాదరంగా ఆహ్వానించి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సేవ చేయడంలో నిమగ్నం కావాలని వారికి సూచించారు.

సీఎం ప్రజావాణి వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం

» అడ్డుకున్న పోలీసులు, మీడియా సిబ్బంది

బేగంపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ 3.18 ఎకరాల భూమిని కొందరు కబ్జా చేశారని, న్యాయం చేయమంటే తమపైనే కేసులు పెట్టారని సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం చిట్యాల గ్రామ వాసి మోక్షమేరి ఆరోపించారు. శుక్రవారం బేగంపేటలోని ప్రజా భవన్ వద్ద 'సీఎం ప్రజావాణి' కార్యక్రమానికి భర్త నాజర్, కొడుకులు ప్రసాద్ రాజ్, దిలీప్‌లతో కలిసి వచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రజా భవన్‌కు చేరుకున్న మోక్షమేరి మీడియాతో మాట్లాడుతూ.. తాను వెంట తెచ్చుకున్న బాటిల్‌లో పెట్రోల్ తలపై పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయడంతో అక్కడ ఉన్న పోలీసులు, మీడియా సిబ్బంది అడ్డుకున్నారు. పోలీసులు తర్వాత వారిని సీఎం ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్ వద్దకు తీసుకెళ్లి వారి సమస్యను వివరించారు. దీనిపై జిల్లా రెవెన్యూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన దివ్య దేవరాజన్.. వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. దీంతో సీఎం ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించిన ఆ కుటుంబం అక్కడి నుంచి వెళ్లిపోయింది.

మహిళా శక్తి బజార్‌లో సరస్-2025 మేళా

హైటెక్ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, హైటెక్‌సిటీలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో ఏర్పాటు చేసిన సరస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిజన్స్ సొసైటీ) ఫెయిర్-2025ను రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) శుక్రవారం ప్రారంభించారు. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన కళాకారులు, చేతి వృత్తుల వారు తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులు ఈ ప్రదర్శనలో ఉంటాయి. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పోవర్టీ (సెర్ప్) ఆధ్వర్యంలో ఈనెల 29 వరకు ప్రదర్శన ఉంటుంది.

నో ఫ్లై జోన్‌గా సచివాలయం

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయాన్ని ప్రభుత్వం నో ఫ్లై జోన్‌గా ఖరారు చేసింది. సచివాలయంపైనా, దానిచుట్టూ డ్రోన్లు ఎగురవేయొద్దని సూచించింది. ఈ మేరకు సచివాలయం చుట్టూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. అందులో భాగంగా రోడ్లు, భవనాల శాఖ టెండర్లను ఆహ్వానించింది.

రాష్ట్రంలో ట్రిపుల్ ప్లే సేవలు ప్రారంభించనున్న బీఎస్ఎన్ఎల్

రూ. 299కే ఇంటర్నెట్, వాయిస్ కాల్స్, ఫైబర్‌టీవీ సేవలు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా తక్కువ ధరలకే ట్రిపుల్ ప్లే(ఎఫ్‌టీటీహెచ్) సేవలను భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) ప్రారంభించనుంది. సెప్టెంబర్ 23 నుంచి ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయని, రూ. 299 నుంచి ధరలు ప్రారంభమవుతాయని సంస్థ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ ప్యాకేజీ ద్వారా హై స్పీడ్ ఇంటర్నెట్, అపరిమిత టెలిఫోన్ కాలింగ్, అనేక ఛానెళ్లను అందించే ఫైబర్ టీవీ వంటి మూడు సేవలు ఒకే కనెక్షన్ ద్వారా పొందవచ్చు. గ్రామీణ ప్రాంతాలకు కూడా అధునిక డిజిటల్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని సంస్థ తెలంగాణ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ అన్నారు. ఇక, నగర వినియోగదారుల కోసం ఐపీటీవీ, ఫైబర్ టీవీ వంటి ఆడ్-ఆన్ ప్యాకేజీలు కూడా బీఎస్ఎన్ఎల్ అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్యాకేజీలలో స్త్రైప్రో, స్మార్ట్ ప్లే టీవీ, ఉల్కా టీవీ వంటి ఓటీటీ సేవలు ఉంటాయని అధికారులు తెలిపారు.

పత్తి రైతుకు ఎమ్మెస్పీ దక్కాల్సిందే!

» అక్టోబరు నుంచి పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసుకోవాలి

» సీసీఐ, మార్కెటింగ్ అధికారులు కలిసి పనిచేయాలి: తుమ్మల



పత్తి కొనుగోళ్లపై సమీక్షిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి రైతులకు కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) అందేలా సీసీఐ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ప్రస్తుతం మార్కెట్ ధర ఎమ్మెస్పీ కంటే క్వింటాకు రూ.1099 తక్కువ ఉందన్నారు. పొడవు పింజ పత్తికి క్వింటాకు రూ.8,110 చొప్పున, మధ్యస్థ పింజ పత్తికి క్వింటాకు రూ.7,710 చొప్పున రైతులకు ఎమ్మెస్పీ దక్కాల్సిందేనని చెప్పారు. రైతుల ప్రయోజనాలను కాపాడేలా భారత పత్తి సంస్థ (సీసీఐ) అధికారులు పనిచేయాలన్నారు. అక్టోబరు నుంచి పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఇదివరకు 110 ఉండగా, ఇప్పుడు 122కు పెంచినట్లు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట ఏఎంసీ కేంద్రాన్ని కూడా ఈ జాబితాలో చేర్చాలన్నారు. సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులతో శుక్రవారం మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. రైతులకు ఎమ్మెస్పీ చెల్లింపులు ఆధార్ ధ్రువీకరణ తర్వాతే చేయాలన్నారు. సీసీఐ ప్రవేశపెట్టిన 'కపాస్ కిసాన్' ద్వారా రైతులు స్వయంగా స్లాట్ నమోదు చేసుకోవచ్చని చెప్పారు. కౌలు రైతులకు కూడా ఓటీపీ ఆధారంగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ విధానంతో అర్హులైన ప్రతి పత్తి రైతుకూ మద్దతు ధర అందుతుందని చెప్పారు. పత్తి కొనుగోళ్లు సక్రమంగా జరిగేందుకు ప్రతి సీసీఐ కేంద్రంలో స్థానిక పర్యవేక్షక కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కమిటీలు తేమ శాతం, నాణ్యత, తూకం, ధరల విషయంలో రైతులకు అన్యాయం జరగకుండా పర్యవేక్షించాలని తెలిపారు. రైతుల ఫిర్యాదుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబరు 1800 599 5779, వాట్సాప్ హెల్ప్‌లైన్ 88972 81111 అందుబాటులో ఉంటాయని చెప్పారు. ప్రతి కొనుగోలు కేంద్రం, జిన్నింగ్, ప్రాసెసింగ్ మిల్లుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. రోజువారీ క్రయవిక్రయాల పరిశీలనకు డైరెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. పత్తి కొనుగోలు పారదర్శకంగా, వేగంగా జరిగేలా సీసీఐ, మార్కెటింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పత్తి సేకరణలో రాష్ట్రప్రభుత్వ సహకారం అవసరమని సీసీఐ ప్రతినిధులు చెప్పారు.

ఐఏఎస్ పదోన్నతుల

జాబితా వివరాలు అసమగ్రం

21 మందిలో 15 మంది వివరాలు సరిగాలేవు.. వారికి సంబంధించిన ఏసీఆర్‌లు, కేసుల వివరాలు పంపండి

» రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి యూపీఎస్సీ కార్యదర్శి నుంచి నోట్

» సీనియారిటీ ధ్రువీకరించిన కమిటీ వివరాలు, సభ్యుల ఫోన్ నెంబర్లు, కార్యదర్శి స్థాయి అధికారి సంతకంతో ధ్రువపత్రం ఇవ్వాలని స్పష్టీకరణ

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం నుంచి రాష్ట్ర సివిల్ సర్వీస్ అధికారులు(ఎస్‌సీఎస్) 21 మందికి ఐఏఎస్ పదోన్నతి కల్పించేందుకుగాను.. ప్రభుత్వం పంపిన ప్రతిపాదనల జాబితాలో వివరాలు సమగ్రంగా లేవని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) పేర్కొంది. జాబితాలోని లోపాలను ఎత్తి చూపుతూ పూర్తి వివరాలతో జాబితాను పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి యూపీఎస్సీ కార్యదర్శి నుంచి నోట్ వచ్చింది. 2022, 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి ఎంపిక జాబితా సిద్ధం చేసేందుకు నెల రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం పంపిన 21 మంది రాష్ట్ర సివిల్ సర్వీస్ అధికారులకు సంబంధించిన ప్రతిపాదనల్లో.. 15 మంది వివరాలు అసంపూర్తిగా, అసమగ్రంగా ఉన్నాయని నోట్‌లో తెలిపింది. వారికి సంబంధించిన ఏసీఆర్‌లు (యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు), కేసుల వివరాలు సమగ్రంగా లేవని.. క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన వివరాలూ పూర్తిగా ఇవ్వలేదని.. కొందరిపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలు అసమగ్రంగా ఉన్నాయని.. తప్పని సరిగా ఇవ్వాల్సిన ధ్రువీకరణ పత్రాలు అందించలేదని పేర్కొంది. సీనియారిటీ జాబితా ధ్రువీకరణలో స్పష్టత లేదని, దానిపై కార్యదర్శి స్థాయి అధికారి సంతకం చేసిన ధ్రువపత్రం జత చేయలేదని తెలిపింది. కోర్టు కేసుల వివరాలు కూడా ప్రతిపాదిత జాబితాలో లేవని, క్యాట్ తీర్పుల ప్రభావం ఉన్నప్పటికీ ఆ వివరాలను జాబితాలో పొందుపరచలేదని అభ్యంతరం తెలిపింది. పదోన్నతులకు అవసరమైన ధ్రువపత్రాలు (నో రిలేషన్ సర్టిఫికెట్, సెలక్షన్ కమిటీ వివరాలు) ఇవ్వాలని కోరింది.

ఇవ్వకుంటే ఆగే ముప్పు..

రాష్ట్రప్రభుత్వం తక్షణమే ఈ లోపాలన్నీ సరిదిద్ది.. అధికారుల ఏసీఆర్‌లు, క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన వివరాలు, క్రిమినల్ కేసుల వివరాలు, ధ్రువపత్రాలు అందించాలని కోరింది. అలాగే.. 21 మంది అభ్యర్థులను ఎంపిక చేసిన కమిటీ వివరాలను, కమిటీలో ఉన్నవారి వివరాలు, వారి ఫోన్ నంబర్లు కూడా పంపాలని ప్రభుత్వానికి పంపిన నోట్‌లో యూపీఎస్సీ స్పష్టం చేసింది. జాబితాలో ఉన్న వారిలో రాష్ట్ర సివిల్ సర్వీసెస్ కోటా, నాన్ సివిల్ సర్వీసెస్ కోటా వివరాలను అందించాలని కోరింది. ఇవేమీ ఇవ్వకపోతే 2022, 2023, 2024 ఐఏఎస్ పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయే అవకాశం ఉంది.

ఇవీ అభ్యంతరాలు..

ఎ.వెంకటరెడ్డి అనే అధికారి మీద 2010లో విధించిన సెన్సూర్ పెనాల్టీ ఉత్తర్వుల కాపీలను జత చేయలేదని యూపీఎస్సీ తెలిపింది. క్రిమినల్ ప్రొసీడింగ్స్ పెండింగ్‌లో ఉన్నాయా? చార్జిషీట్ దాఖలైందా లేదా అన్న వివరాలు తెలపలేదని పేర్కొంది. 11-10-2016 నుంచి 3-1-2018 వరకు, 13-3-2018 నుంచి 5-9-2018, 6-9-2018 నుంచి 12-2-2020, 1-4-2022 నుంచి 31-3-2023 కాలానికి సంబంధించిన రివ్యూ అథారిటీ (ఆర్ఏ) ధ్రువపత్రం, యాక్సెప్టింగ్ అథారిటీ(ఏఏ) రిమార్కులు లేవని తెలిపింది.

- సి.నాగేశ్‌పై క్రిమినల్ కేసుందని తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం.. చార్జిషీట్ వేసిందీ లేనిదీ చెప్పలేదని తెలిపింది. 27-1-2024న ఆయన్ను తిరిగి సర్వీస్‌లోకి తీసుకున్న ఉత్తర్వుల కాపీ జత చేయలేదని, 2015-18 ఏసీఆర్‌లు ఇవ్వలేదని తెలిపింది.
- ఎ.రాజా అనే అధికారికి సంబంధించి 2018-2023 మధ్య కొన్ని ఏసీఆర్‌లు లేవని, 1-4-2018 నుంచి 30-7-2019, 1-4-2019 నుంచి 4-7-2019, 27-11-2022 నుంచి 31-3-2023 నడుమ ఆర్ఏ, ఏఏ రిమార్కులు ఇవ్వలేదని తెలిపింది.
- భవానీ శంకర్‌కు సంబంధించి.. 2018-2024 మధ్య పలు ఏసీఆర్‌లు లేవని, ఆర్ఏ, ఏఏ రిమార్కులు జత చేయలేదని, కొన్నింటికి కేవలం కౌంటర్ సంతకాలు మాత్రమే ఉన్నాయని పేర్కొంది.
- సి.వీరారెడ్డికి సంబంధించి ఆర్ఏ, ఏఏ లేవని, పి.శ్రీనివాస్ రెడ్డికి సంబంధించి ఏసీఆర్‌లు లేవని, వేణుగోపాల్‌కు సంబంధించి ఆర్ఏ, ఏఏ రిమార్కులు లేవని, ఎ.భాస్కర్‌రావుకు సంబంధించి ఆర్ఏ రిమార్కులు లేవని, ఎం.దావీద్‌కు ఆర్ఏ, ఏఏ రిమార్కులు ఇవ్వలేదని, అబ్దుల్ హమీద్‌కు ఆర్ఏ, ఏఏలు జత చేయలేదని, కె.కిమ్యానాయిక్‌కు ఏసీఆర్ పార్ట్-1 లేదని తెలిపింది. కె. గంగాధర్ ఏసీఆర్‌లు లేవని, బి. నర్సింగ్‌కు సంబంధించి 2017-2022 మధ్య ఏసీఆర్‌లు లేవని, ఆర్ఏ, ఏఏ రిమార్కులు ఇవ్వలేదని పేర్కొంది.

దసరా నాటికి ప్రత్యక్ష విచారణ!

» ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మరోసారి స్పీకర్ నోటీసులు

» వారంలోగా అఫిడవిట్ రూపంలో వివరణ ఇవ్వాలని ఆదేశం

» ఇరువైపుల నుంచి అఫిడవిట్లు అందగానే విచారణ ప్రారంభించాలని నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు అంశంపై విచారణను శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వేగవంతం చేశారు. పార్టీ ఫిరాయించారంటూ ఫిర్యాదులు వచ్చిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు తాజాగా మరోసారి నోటీసులు జారీ చేశారు. వారిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన ఫిర్యాదులు, అందించిన ఆధారాలను కూడా ఈ నోటీసులకు జత చేశారు. వారం రోజుల్లో అఫిడవిట్ల రూపంలో సమాధానాలు ఇవ్వాలని ఆదేశించారు. మరోవైపు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు స్పీకర్ ఇప్పటికే నోటీసులు జారీచేశారు. మూడు రోజుల్లో అఫిడవిట్ రూపంలో వాదనలు సమర్పించాలని సూచించారు. ఈ క్రమంలో ఇరువైపుల నుంచి అఫిడవిట్లు అందగానే ముఖాముఖి విచారణ ప్రారంభించాలని స్పీకర్ నిర్ణయించారని.. దసరా నాటికి ప్రత్యక్ష విచారణ చేపడతారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. తాజాగా స్పీకర్ నోటీసులు పంపిన ఎనిమిది మందిలో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, డాక్టర్ సంజయ్ కుమార్, గూడెం మహిపాల్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, తెల్లం వెంకట్రావు ఉన్నారు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి తొలి నోటీసులపైనే ఇంకా స్పందించకపోవడంతో.. రెండో నోటీసులు ఇవ్వలేదు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో అక్టోబరు 30 నాటికి ఒక నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించిన నేపథ్యంలో ఆ లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని స్పీకర్ భావిస్తున్నట్టు సమాచారం.

నేను ఏ పార్టీలో ఉన్నానో స్పీకర్ తేలుస్తారు

» నోటీసులకు నెలాఖరు వరకు గడువు ఉంది

» అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌తో కలిశా

» నియోజకవర్గానికి 1,026కోట్లు తెచ్చా

» ఫిరాయింపులపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదు: కడియం శ్రీహరి



వరంగల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాను ఏ పార్టీలో ఉన్నానో స్పీకర్ నిర్ణయిస్తారని, తనకు అందిన నోటీసులపై సమాధానం ఇచ్చేందుకు నెలాఖరు దాకా సమయం ఉందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. 21 నెలల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి రూ.1,026కోట్ల నిధులు తీసుకొచ్చానని వెల్లడించారు. హనుమకొండలోని హరిత హోటల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారని, వ్యక్తిగత విమర్శలకు దిగడాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని పేర్కొన్నారు. తాను వ్యక్తిగతంగా పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకమని, అయితే స్థానిక పరిస్థితుల నేపథ్యంలో కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. పదేళ్లలో కాంగ్రెస్, టీడీపీ, బీఎస్పీ, సీపీఐలకు చెందిన 36 మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని గుర్తు చేశారు. వారిలో ఏ ఒక్కరు కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయలేదని, అనర్హత వేటు పడలేదన్నారు. ఫిరాయింపుల అంశం స్పీకర్ పరిధిలో ఉందని, ఆయన తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. తాను ఎవరికీ పాదాభివందనాలు చేయలేదని, తాను అడుక్కుంటే పదవులు రాలేదని, తన పనితీరు గుర్తించి ఢిల్లీలో ఉన్న తనను పిలిచి డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారని పేర్కొన్నారు.

యథావిధిగా ఆరోగ్యశ్రీ సేవలు

» దామోదర హామీని అంగీకరించిన ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులు

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నిలిచిపోయిన ఆరోగ్యశ్రీ సేవలు శనివారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. మంత్రి దామోదర.. శుక్రవారం రాత్రి బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ప్రతినెలా నిధులు విడుదల చేస్తామని, ఇతరత్రా సమస్యలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. హామీని అంగీకరించిన అసోసియేషన్ ప్రతినిధులు.. శనివారం నుంచి నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు ప్రారంభిస్తామని ప్రకటించారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల నిర్వాహకులను మంత్రి అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్లు

మంజూరుకాకున్నా బిల్లులు జమ

» ఆ పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయాలి

» ఇళ్ల మంజూరుకు కమిటీ సభ్యులు లంచం అడిగితే వెంటనే వారిని తొలగించాలి

» క్రిమినల్ కేసు నమోదు చేయాలి

» లంచమడిగితే 18005995991 నెంబరుకు ఫోన్ చేయండి

» మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకాకున్నా పలువురి ఖాతాల్లో బిల్లులు జమ చేసిన ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఖమ్మం, జగిత్యాల, కొత్తగూడెం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇళ్ల మంజూరుకాకపోయినప్పటికీ నలుగురి ఖాతాల్లో నిధులు జమచేసిన గ్రామ పంచాయతీ కార్యదర్శులను తక్షణమే సస్పెండ్ చేసి పూర్తిస్థాయి విచారణ జరిపించాలన్నారు. సూర్యాపేట జిల్లా మధిరాల మండలం పోలుమల్ల గ్రామంలో కొండ లింగయ్య అనే వ్యక్తికి ఇల్లు మంజూరుకు రూ.10వేలు ఇవ్వాలని ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సత్తెయ్య డిమాండ్ చేశారని, జనగామ జిల్లా దేవరుప్పల మండలం పడమటి తండాలో శివమ్మ అనే లబ్ధిదారు రూ.30 వేలు ఇవ్వాలని గ్రామపంచాయతీ కార్యదర్శి డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు రాగా విచారణలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడి పాత్ర ఉందనితేలింది. ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ జరిపి 24 గంటల్లో నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ఇళ్ల మంజూరుకు డబ్బులు డిమాండ్ చేసిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులను వెంటనే తొలగించాలన్నారు. శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల అంశంపై హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్‌తో కలిసి మంత్రి సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కాల్‌సెంటర్‌కు ఏయే అంశాలపై ఫిర్యాదులు వస్తున్నాయని ఆరా తీసిన ఆయన అధికారులు చెప్పిన వివరాల మేరకు సదరు ఉద్యోగులు, కమిటీల్లోని సభ్యులపై చర్యలకు ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, చెల్లింపుల విషయంలో అవినీతికి పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించబోమన్నారు. ఇళ్ల మంజూరు కోసం ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు లంచం అడిగితే తక్షణం వారిని తొలగించి, క్రిమినల్ కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కొన్ని బ్యాంకులు లబ్ధిదారులకు మంజూరైన నిధులను పాతబకాయిల కింద జమచేసుకుంటున్నాయని, దీన్ని సహించేదిలేదని చెప్పారు. ఆధార్ నంబరు ఆధారిత చెల్లింపులను దసరాలోగా పూర్తిచేయాలన్నారు. తప్పులను లబ్ధిదారులే స్వయంగా సరిచేసుకునేందుకు రూపొందించిన యాప్ ఒకటి రెండు రోజుల్లో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులను తక్షణం ఆయా జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు సచివాలయంలోని తన కార్యాలయానికి పంపాలని అధికారులకు సూచించారు. 18005995991 నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే 24 గంటల్లో చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నట్టు ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

ఎమ్మెల్యేలను దొంగిలించడం పెద్ద నేరం

» రాహుల్‌ది రెండు నాల్కల ధోరణి

» బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్

» రేపటి తెలంగాణ భవిష్యత్తును జూబ్లీహిల్స్ ఎన్నిక నిర్ణయిస్తుంది: కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల చోరీపై మాట్లాడకపోవడం రాహుల్ గాంధీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని, ఆయనకు సిగ్గుశరం ఉంటే.. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజాతీర్పు కోరాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఓట్లచోరీ ఒక నేరమైతే, ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలను దొంగిలించడం అంతకంటే పెద్ద నేరమని, అది ప్రజాస్వామ్యాన్ని పట్టపగలు ఖూనీ చేయడమేనని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ బూత్‌స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఫిరాయింపు రాజకీయాలను అందరూ అసహ్యించుకుంటున్నారని, సరైన సమయంలో ఆపార్టీకి ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీల జాయింట్ వెంచర్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వమని, మోదీ ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరణలను దేశంలో అందరి కంటేముందు తెలంగాణ ప్రభుత్వమే అమలు చేసిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలయినా ముస్లిం మైనార్టీకి చెందిన వ్యక్తికి మంత్రి పదవి కట్టబెట్టలేదని, ఓట్ల కోసం వచ్చే మంత్రులు, కాంగ్రెస్ నేతలను ముస్లింలు నిలదీయాలన్నారు. రేపటి తెలంగాణ భవిష్యత్తును జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నిర్ణయిస్తుందని, అరచేతిలో వైకుంఠం చూపించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జూబ్లీహిల్స్‌లో కాల్చివాత పెట్టాలన్నారు. మాగంటి గోపీనాథ్ సేవల్ని కొనసాగిస్తామని ప్రజలముందుకు వచ్చిన ఆయన సతీమణి సునీతమ్మను అందరూ ఆశీర్వదించాలని కోరారు. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఆల్మట్టి డ్యాం ఎత్తుపెంచి తెలంగాణ రైతాంగానికి మరణశాసనం రాస్తుంటే, సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో జల్సాలు చేస్తున్నారని విమర్శించారు. ఆల్మట్టి డ్యాం ఎత్తును 519 అడుగుల నుంచి 52 4అడుగులకు పెంచాలని కర్ణాటక మంత్రిమండలి నిర్ణయం తీసుకుంటే సీఎంకు ఏమాత్రం పట్టడంలేదని ఆయన అన్నారు.

రేవంత్ ఢిల్లీలో ఉంటూ పాలన గాలికొదిలేశారు

» ఏసీడీపీ నిధులివ్వకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

» గ్రామపాలనను ప్రభుత్వం నాశనం చేస్తోంది

» పండగపూట చార్జీలు పెంచి దండుకోవడం సిగ్గుచేటు: హరీశ్



హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోకన్నా.. ఢిల్లీలోనే ఎక్కువగా ఉంటూ సీఎం రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేశారని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎమ్మెల్యేల ఎసీడీపీ నిధులు విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని అడ్డుకుంటోందని ఆరోపించారు. సర్కారు చర్యలతో నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయని శుక్రవారం ఎక్స్‌వేదికగా ఆయన పేర్కొన్నారు. 'గ్రామపాలనను ఈ ప్రభుత్వం నాశనం చేస్తోంది. నిధుల్లేక పంచాయతీలు అవస్థలు పడుతున్నాయి. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు లేరు. డీజిల్‌కు డబ్బుల్లేక పంచాయతీ ట్రాక్టర్లు మూలనపడ్డాయి. పండుగ పూట వీధిదీపాలు వెలగక గ్రామాలు చీకట్లో మగ్గుతున్నాయి. పండుగ వస్తే చాలు ఆర్టీసీ చార్జీలను అడ్డగోలుగా పెంచి ప్రజల నడ్డివిరిచేందుకు సిద్ధం కావడం సిగ్గుచేటు. బతుకమ్మ, దసరా సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులపై పెనుభారం మోపుతూ పండుగ సంబరం కూడా లేకుండా చేస్తున్నారు. ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచకుండా, రెగ్యులర్‌గా నడిచే బస్సులకే పండుగ స్పెషల్ బోర్డులు తగిలించిచేస్తున్న ఈ దోపిడీ ముమ్మాటికీ ప్రజాపీడనే అవుతుంది' అని హరీశ్ రావు ప్రభుత్వంపై మండిపడ్డారు.

80 టీఎంసీల నీళ్లకోసం 35 వేల కోట్లు ఖర్చుపెడతారా?

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై రూ.35 వేల కోట్లు ఖర్చుపెట్టి, 4.47 లక్షల ఎకరాలకే సాగునీరందించగలమని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కేవలం 80 టీఎంసీల నీటి కోసం అంత ఖర్చు చేయడం అనాలోచిత చర్యగా ఆయన అభివర్ణించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పోల్చితే మూడోవంతు ఖర్చుచేస్తూ, పదోవంతు ఎకరాకు కూడా నీళ్లివ్వలేని అనాలోచిత చర్య కాంగ్రెస్ ప్రభుత్వ ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనమని విమర్శించారు.



క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, దుద్దిళ్ల

ప్రాధాన్య క్రమంలో
పనుల ప్రతిపాదనలు పంపండి

- హ్యామ్ రోడ్ల టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయాలి
- క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో.. అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి సూచనలు

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రభుత్వ శాఖల్లోని అభివృద్ధి పనులకు సంబంధించి ప్రాధాన్య క్రమంలో ప్రతిపాదనలు పంపాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాలు, ప్రధాన పనుల(క్యాపిటల్ వర్క్స్) క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశం శుక్రవారం సచివాలయంలో జరిగింది. కమిటీలో సభ్యులైన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అత్యవసరమైన ప్రధాన పనులకు ప్రాముఖ్యమివ్వాలని చెప్పారు. గతంలో ఒక్క శాతం నిధులకు 16 రెట్ల విలువైన పనులను ప్రతిపాదించేవారని, దాంతో నిధులు సరిపోక పనులు చేపట్టలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇప్పుడలా కాకుండా ఒక్క శాతం నిధులకు మూడు రెట్ల విలువైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ప్రతిపాదనలను ఆమోదించే సందర్భంలో ఈ మూడు రెట్ల విలువైన ప్రతిపాదనలను మరింత కుదించడం జరుగుతుందని చెప్పారు. ఈ ప్రతిపాదనలను కూడా ఆయా శాఖల అధికారులు ప్రాధాన్య క్రమంలో హేతుబద్ధీకరించాలన్నారు. అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు వారంలోగా పూర్తిస్థాయి ప్రతిపాదనలతో సమావేశానికి రావాలని ఆదేశించారు. హ్యామ్(హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రోడ్ల పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులను ఆదేశించారు.

22న ఛత్తీస్‌గఢ్ సీఎంతో ఉత్తమ్ భేటీ

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమ్మక్కసాగర్(తుపాకులగూడెం) ప్రాజెక్టుకు సంబంధించిన నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ)పై చర్చించేందుకు రావాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఛత్తీస్‌గఢ్ సీఎంవో కబురు పంపింది. ఈనెల 16లేదా 19న ఛత్తీస్‌గఢ్ సీఎంను కలిసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అపాయింట్‌మెంట్ కోరగా.. 22న ఖరారు చేసినట్లు సమాచారం అందింది. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయితో రాయ్‌పూర్‌లో మంత్రి ఉత్తమ్ భేటీ కానున్నారు.

హరీశ్‌రావు వ్యాఖ్యలు అర్థరహితం

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి రూ.35వేల కోట్ల వ్యయం అవుతుందని హరీశ్‌రావు చేసిన ప్రకటపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. హరీశ్‌ది అతితెలివితో కూడుకున్న ప్రకటన అని, ఇందులో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. అన్నింటికి అతితెలివితో వ్యవహరిస్తే ప్రజాక్షేత్రంలో అభాసు పాలవుతారని హితవు పలికారు.

ముస్లింలకు ఆర్థిక భరోసా

- 'ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన' 'రేవంతన్నా కా సహారా.. మిస్కీనో కే లియే' పథకాలు
- ఫకీర్, దూదేకుల వర్గాలకు మోపెడ్‌లు లక్ష రూపాయల సాయం: అడ్లూరి లక్ష్మణ్
- రెండు పథకాలను ప్రారంభించిన మంత్రి

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి, ఆర్థిక భరోసాకు కాంగ్రెస్ ప్రభుత్వం మరో ముందడుగు వేసిందని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. సచివాలయంలో శుక్రవారం 'ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన', రేవంతన్నా కా సహారా.. మిస్కీనో కే లియే(పేదలకు రేవంతన్న సాయం)' అనే పథకాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు పథకాలను ముస్లిం మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పథకాలు మైనార్టీల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తాయని, పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తాయని వెల్లడించారు. వితంతువులు, విడాకులు పొందిన వారు, అనాథలు, అవివాహిత మహిళలు చిన్న వ్యాపారాలు మొదలుపెట్టి స్వయం ఉపాధి పొందేలా ఇందిరమ్మ యోజన తోడ్పడుతుందన్నారు. చిన్న వ్యాపారాలు ప్రారంభించడానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. 'రేవంతన్నా కా సహారా మిస్కీనో కే లియో' పథకం ద్వారా.. ఫకీర్, దూదేకుల వర్గాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష గ్రాంట్‌తో మోపెడ్(వాహనాలు)లను అందిస్తామని, దీంతో వారు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశముంటుందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చిన వెంటనే అమలు చేసే నాయకుడు అని, ఆయన దూరదృష్టి వల్లే ఈ పథకాలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ పథకాలకు ప్రభుత్వం రూ.30 కోట్లు కేటాయించడం ముస్లిం మైనార్టీల పట్ల అంకిత భావానికి నిదర్శనం అని చెప్పారు. తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కొద్దిరోజుల్లోనే ఇలాంటి కొత్త పథకాలు ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

5000 కోట్ల అప్పు తీసుకోనున్న రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.5000 కోట్ల అప్పు తీసుకోనుంది. ఈమేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు శుక్రవారం ఇండెంటు పెట్టింది. 22 ఏళ్ల కాల పరిమితితో రూ.1,500 కోట్లు, 23 ఏళ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 24 ఏళ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 26 ఏళ్ల కాల పరిమితితో రూ.1,500 కోట్ల చొప్పున ఈ రుణాన్ని తీసుకోనుంది. ఈ నెల 23న ఆర్‌బీఐ నిర్వహించే ఈ-వేలం ద్వారా ఈ మొత్తం సేకరించనుంది.

వరంగల్ నిట్‌లో 650కోట్లతో రిసెర్చ్ పార్క్?

- ప్రస్తుతం ప్రతిపాదన దశలో ప్రాజెక్టు
- నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుద్ధి వెల్లడి

హనుమకొండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో రూ.650కోట్లతో రిసెర్చ్ పార్క్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి శుక్రవారం వెల్లడించారు. అయితే, ప్రస్తుతం ఇది ప్రతిపాదన దశలోనే ఉందని, చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ రిసెర్చ్ పార్క్ ఏర్పాటుతో నిట్‌లో పరిశోధనా కార్యకలాపాలు మరింత విస్తృతమవుతాయన్నారు. శుక్రవారం నిట్‌లో రిసెర్చ్ స్కాలర్స్ రెండవ సమ్మేళనం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుబుద్ధి మాట్లాడుతూ.. పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను ప్రచురించడం, స్టార్టప్‌లను స్థాపించడం, పేటెంట్లు పొందడమే కాకుండా సామాజిక పరంగా సమస్యల పరిష్కారంలో ముందుండాలని పిలుపునిచ్చారు. గతి శక్తి విశ్వవిద్యాలయం వీసీ మనోజ్ చౌదరి ప్రధానోపన్యాసం చేస్తూ.. పరిశోధకులు పరిశ్రమలతో సన్నిహితంగా పని చేసి సమస్యలను పరిష్కరించాలని పిలుపునిచ్చారు.

ఫిరాయింపు ఎక్కడిది?

(మొదటిపేజీ తరువాయి)

చూస్తాం. ఆ తర్వాత న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. మళ్లీ కోర్టుకు వెళ్లాలా? వద్దా? అనేది అప్పుడే నిర్ణయిస్తాం. అవసరమనుకుంటే హైకోర్టులోనే మరికొంత సమయం కోరతాం" అని సీఎం వివరించారు. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని కేసీఆర్ విధించారని, ఇప్పుడు బీసీ, ఎస్సీ, ఎస్టీల గురించి బీఆర్ఎస్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.

మెట్రో పూర్తికావడం కిషన్‌రెడ్డికి ఇష్టంలేదు..

మెట్రో రెండోదశ పూర్తికావడం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి, కేటీఆర్‌కు ఇష్టంలేదని, వాళ్ల స్వార్థ ప్రయోజనాల కోసం దానిని ముందుకు కదలనివ్వడం లేదని సీఎం రేవంత్ ఆరోపించారు. మెట్రో బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్లు ఎల్అండ్‌టీ చెప్పలేదన్నారు. మొదటి దశలో నష్టం వచ్చిందని ఆ సంస్థ చెబుతోందని, కేసీఆర్, ఎల్అండ్‌టీ చేసిన తప్పులకు ప్రజలు నష్టపోవాలా? అని ప్రశ్నించారు. 2017లోనే మెట్రో రెండోదశ పూర్తికావాల్సి ఉందని, కానీ.. కేసీఆర్ నిర్లక్ష్యంతో అది నేటికీ ముందుకు సాగడం లేదని అన్నారు. మెట్రో రెండోదశ పనుల కోసం ప్రధాని మోదీని కలిసిన ప్రతిసారీ అడుగుతున్నామని, అయినా ఫలితం లేదని చెప్పారు. రెండోదశకు సహకరించాల్సిన బాధ్యత ఎల్అండ్‌టీపై ఉందని, అలా కాకుండా వారు చెప్పినట్టే తాము వినాలన్నట్లుగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. మెట్రో విస్తరణకు అనుమతి కావాలంటే.. ఎల్అండ్‌టీతో ఒప్పందం చేసుకుని రావాలని కేంద్రం చెబుతోందని, ఇదంతా.. కేటీఆర్, కిషన్‌రెడ్డి ఆడుతున్న డ్రామా అని మండిపడ్డారు. మెట్రోలో రోజుకు సగటున 5 లక్షల మంది ప్రయాణిస్తున్నారని, విస్తరణ పూర్తయితే రోజుకు 15 లక్షల మంది ప్రయాణిస్తారని తెలిపారు.

కేసీఆర్‌ను రక్షించేందుకు కిషన్‌రెడ్డి ప్రయత్నం..

కేసీఆర్ కుటుంబానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. "కాళేశ్వరం దర్యాప్తును సీబీఐకి ఇవ్వాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేసినందుకే అప్పగించాం. సీబీఐకి ఇస్తే 48 గంటల్లో విచారణ చేయిస్తామని, అవినీతి లెక్కలేంటో తేలుస్తామని ఆయన మాట్లాడారు. మరి ఇప్పుడు ఏమైందో చెప్పాలి. సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే అన్ని వివరాలు ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం" అని రేవంత్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఏం జరిగిందనే విషయం మాత్రమే కమిషన్ చెబుతుందని, చర్యలు తీసుకునేది దర్యాప్తు సంస్థలేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తు చేస్తే నిజాలన్నీ బయటికి వస్తాయన్నారు. కాళేశ్వరం దర్యాప్తును కేటీఆర్ అడ్డుకుంటున్నారని, కేటీఆర్ చెప్పినందుకే కిషన్‌రెడ్డి కేంద్రంలో విచారణను తొక్కిపట్టారని ఆరోపించారు. కిషన్‌రెడ్డికి సొంత తెలివి లేదని, కేటీఆర్‌ను అద్దెకు పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ ఆలోచనల్నే కిషన్‌రెడ్డి అమలు చేస్తారు తప్ప.. ఆయనకు రాష్ట్ర ప్రయోజనాలు పట్టవన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేదే కిషన్‌రెడ్డి అని, రాష్ట్రానికి ఏ ప్రాజెక్టు రావడమూ ఆయనకు ఇష్టం లేదని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు హైకోర్టులో ఉందని, దానిపై మాట్లాడడం సరికాదని పేర్కొన్నారు. ఒకవేళ హైకోర్టు పరిధిలో లేకపోతే.. సీబీఐకి అప్పగించే అంశంపై ఆలోచించేవాళ్లమని చెప్పారు.



యూరియా ఇవ్వకుండా కేంద్రం కుట్రలు..

తెలంగాణకు సకాలంలో యూరియా ఇవ్వకుండా కేంద్రం కుట్రలు చేస్తోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆ కుట్రలకు రాష్ట్రంలోని బీఆర్ఎస్, బీజేపీ తోడై.. రైతుల్లో గందరగోళం సృష్టించాయన్నారు. కేంద్రం నుంచి యూరియా రావడం ఆలస్యమైతే.. యూరియా కొరత ఉందని, ఇక రాదని అనేక అసత్య ప్రచారాలు చేశారని మండిపడ్డారు. యూరియా ఎక్కడా దొరకదేమోననే ఆందోళనతో కొందరు ఎక్కువగా కొనేశారని, మరికొందరు సరిపడా ఉన్నా లైన్లలో నిలబడుతున్నారని తెలిపారు. దీనంతటికీ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలే కారణమని, ఆ రెండు పార్టీల వలలో రైతులు చిక్కుకున్నారని అన్నారు. దేశంలో నరమేధం సృష్టించిన, ఎన్నో హింసాత్మక ఘటనలకు పాల్పడిన పాకిస్తాన్ సహా ఇతర ఉగ్రవాద సంస్థలతో చర్చలు జరిపినప్పుడు.. మనలో ఒకరైన నక్సలైట్లతో ఎందుకు చర్చలు జరపరని రేవంత్ ప్రశ్నించారు. నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పాలసీలు తీసుకొచ్చాయని గుర్తు చేశారు. నక్సలైట్ల విషయంలో కేంద్ర నిర్దయగా వ్యవహరించడం సరికాదని, వారూ మన అన్నదమ్ములేననే విషయాన్ని గ్రహించి శాంతిచర్చలు జరపాలని కోరారు. ఇందుకు కేంద్రం ఒకడుగు ముందుకు వేసి చర్చలకు ఆహ్వానించాలన్నారు. కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణల ప్రభావం అన్ని రాష్ట్రాల ఆదాయంపైనా పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటితో తెలంగాణకు ఏడాదికి రూ.7 వేల కోట్ల నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ మేరకు ఐదేళ్లపాటు అన్ని రాష్ట్రాలకు కేంద్రం నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో డ్రగ్స్ పాపం బీఆర్ఎస్‌దే..

తెలంగాణలో డ్రగ్స్ పాపం ముమ్మాటికీ బీఆర్ఎస్‌దేనని సీఎం రేవంత్ ఆరోపించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ యథేచ్ఛగా గేట్లు తెరవడం వల్లే ఇప్పుడీ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో పట్టుబడ్డ భారీ డ్రగ్స్ తయారీ కేంద్రం బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఏర్పడిందేనని తెలిపారు. మహారాష్ట్ర పోలీసులు వచ్చేవరకు తెలంగాణ పోలీసులు గుర్తించలేక పోయారనే ప్రచారాన్ని సీఎం కొట్టిపారేశారు. తెలంగాణలో పోలీసులు ముంబై, గోవాలో దాడులు చేసి భారీగా డ్రగ్స్ దందాను గుట్టు చేశారని గుర్తు చేశారు. అయినా, ఒక రాష్ట్రంలోని పోలీసుల సహకారం లేకుండా మరో రాష్ట్రానికి చెందిన పోలీసులు ఏమీ చేయలేరని అన్నారు. స్వయంగా కేటీఆర్ బావమరిది ఫాంహౌస్‌లో డ్రగ్స్ దొరికాయని, కోర్టుకు వెళ్లి బెయిల్ తెచ్చుకున్నారని తెలిపారు. అలాంటి వాళ్లు డ్రగ్స్ గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. డ్రగ్స్‌ను అరికట్టేందుకు 20 నెలల్లో ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని, ఈగల్ టీం పనితీరును దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు మెచ్చుకున్నాయని అన్నారు. డ్రగ్స్ మహమ్మారిని మూకుమ్మడిగా అడ్డుకోవాల్సిన అవసరం ఉందని, కానీ ఆ విషయంలోనూ రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు.

కవిత వ్యవహారమంతా కుటుంబం, ఆస్తి పంపకాల వివాదమే..

కేసీఆర్ కూతురు కవిత వ్యవహారమంతా వారి కుటుంబం, ఆస్తి పంపకాల వివాదమేనని రేవంత్‌రెడ్డి అన్నారు. కవితను కేసీఆర్, కేటీఆర్, హరీశ్, సంతోష్ కావాలనే బయటికి వెళ్లగొట్టారని తెలిపారు. కుల పెద్దో, కుటుంబ పెద్దో కూర్చుని మాట్లాడితే నెలకో, రెండు నెలలకో అంతా సద్దుమణుగుతుందని, మళ్లీ అందరూ కలిసే ఉంటారని చెప్పారు. ఏదేమైనా.. ఒక ఆడబిడ్డపై నలుగురు మగాళ్లు దాడి చేస్తున్నారని అన్నారు. వారి కుటుంబ పంచాయితీతో తనకు గానీ, తెలంగాణ ప్రజలకు గానీ ఎటువంటి సంబంధం లేదన్నారు. తానెప్పుడూ కవితకు మద్దతుగా నిలవలేదని, తనకు ఆ అవసరం లేదని స్పష్టం చేశారు. తమ కుమార్తె వివాహ సమయంలో తనను అరెస్టు చేయడం చిన్న విషయమేనని, కానీ.. ఉద్యమం పేరుతో కేసీఆర్ వందల మంది అమాయక పిల్లలను బలితీసుకున్నారని ఆరోపించారు. ఆ పాపం ఊరికే పోదు కదా! వ్యాఖ్యానించారు. అందుకే ఆ ఉసురు తగిలిందన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయాలని కేటీఆర్, సంతోష్ ప్రయత్నించారంటూ కవితే స్వయంగా చెప్పారని గుర్తు చేశారు. కేసీఆర్ మొదటి ప్రభుత్వంలో ఒక్క మహిళా మంత్రి కూడా లేరని, కానీ.. కాంగ్రెస్ పార్టీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేస్తుందని తెలిపారు.

2018లోనే తెలంగాణలో ఓట్ చోరీ..

బిహార్‌లోనే కాకుండా.. తెలంగాణలోనూ ఓటు చోరీ జరిగిందని సీఎం రేవంత్ తెలిపారు. 2018 ఎన్నికల్లో ఓటు చోరీ జరిగిందని, అప్పుడు ఎన్నికల కమిషనర్‌గా ఉన్న రజత్‌కుమార్ రెండుసార్లు ఈ విషయాన్ని అంగీకరించారని పేర్కొన్నారు. 2018 ఎన్నికల్లో తెలంగాణలో 24 లక్షల ఓట్లు తొలగించారని, ఒక్క కొడంగల్ నియోజకవర్గంలోనే 50 వేల ఓట్లను తొలగించారని వివరించారు. బిహార్‌లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ప్రచారానికి వెళ్తానన్నారు. ప్రశాంత్ కిశోర్ దక్షిణాది రాష్ట్రాల్లో పనిచేయగా లేనిది తాము ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లకూడదా? అని ప్రశ్నించారు.

మంత్రివర్గంలో మైనారిటీకి చాన్స్

ఇండియా కూటమిలో మజ్లిస్ కలిసే అంశంపై రాహుల్‌గాంధీ నిర్ణయం తీసుకుంటారని రేవంత్‌రెడ్డి తెలిపారు. మంత్రివర్గంలో మైనారిటీకి చోటు కల్పించాల్సి వస్తే కల్పిస్తామని, అయితే.. ఎవరికి అవకాశం వస్తుందో ఇప్పుడే చెప్పడం సాధ్యంకాదని అన్నారు. మంత్రి అయిన తర్వాత ఎమ్మెల్సీగా నియమించే అవకాశాలూ ఉన్నాయన్నారు. ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అంశం గురించి ప్రస్తావించగా.. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఎక్కువ అని వ్యాఖ్యానించారు.

తుమ్మిడిహట్టిపై అన్యాయం చేసిన కేసీఆర్..

తుమ్మిడిహట్టి ప్రాజెక్టు విషయంలో మాజీ సీఎం కేసీఆర్ తీరని అన్యాయం చేశారని రేవంత్ అన్నారు. అసలు.. తెలంగాణలో నికర, మిగులు, వరద జలాలు ఎన్నో నేటికీ స్పష్టత లేదన్నారు. కేసీఆర్ ఇష్టానుసారంగా ఒక ప్రాజెక్టుకు సంబంధించిన నీటిని మరోచోట చూపించారని, అస్పష్టత వల్ల నీటి వాటాలెంత? అనేది అర్థంకావడం లేదని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ మధ్య నెలకొన్న నీటి పంపకాల వివాద పరిష్కారం కోసం ఇటీవల ఇద్దరు సీఎంలు భేటీ అయి.. అధికారులతో కమిటీ వేయాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇక ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణం పీపీపీ పద్ధతిలో సాధ్యం కాదని, నిబంధనలు అందుకు అంగీకరించడం లేదని రేవంత్ అన్నారు. అందుకే ప్రభుత్వమే ఈ భవనాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తోందని చెప్పారు.

చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు కేటీఆర్ ఏమయ్యారు?

ఏపీ మంత్రి నారా లోకేశ్ ఎవరిని కలిసినా తనకు అభ్యంతరం లేదని రేవంత్‌రెడ్డి అన్నారు. తాను ముఖ్యమంత్రిగా చంద్రబాబును కలిశానని, అందులో తప్పేముందని ప్రశ్నించారు. పట్టపగలు జరిగిన అధికారిక కార్యక్రమంపైనే కేటీఆర్ రాద్ధాంతం చేశారని, మరి చంద్రబాబు కొడుకును రాత్రిపూట కేటీఆర్ ఎందుకు కలిశారని తాను ప్రశ్నించానని చెప్పారు. "లోకేశ్ తనకు తమ్ముడిలాంటి వాడని కేటీఆర్ అంటున్నారు. కేటీఆర్ తనకు అన్నలాంటి వాడని లోకేశ్ చెబుతున్నారు. మరి.. తమ్ముడిలాంటి వాడైతే కష్టకాలంలో అన్నలా ఎందుకు అండగా నిలవలేదు? చంద్రబాబును జైలులో పెట్టినప్పుడు హైదరాబాద్‌లో రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపిన ఆ జనాన్ని కేటీఆర్ ఎందుకు కొట్టించారు?" అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

ఆర్‌ఆర్‌ఆర్‌పై 22న కీలక భేటీ

ఉత్తర భాగం టెండర్లు, దక్షిణ భాగం అలైన్‌మెంట్‌పై స్పష్టత వచ్చే అవకాశం

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్)లో కీలక ముందడుగు పడనుంది. ఉత్తరభాగం టెండర్లు, దక్షిణభాగం అలైన్‌మెంట్ ఆమోదానికి సంబంధించిన అంశాలపై స్పష్టత వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. కేంద్రం మంజూరు చేసిన పలు రహదారుల ప్రాజెక్టులపై ఈ నెల 22న కీలక సమావేశం జరగనుంది. సీఎం రేవంత్ అధ్యక్షతన జరగబోయే సమావేశంలో కేంద్ర రోడ్డు, రవాణా మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. సమావేశంలో ప్రధానంగా రీజినల్ రింగు రోడ్డు ఉత్తరభాగంలో మిగిలిపోయిన భూ సేకరణ, ఇప్పటికే సేకరించిన భూములకు చెల్లించాల్సిన పరిహారం తదితర అంశాలపై చర్చించనున్నారు. ఉత్తర భాగంలో భూ సేకరణ పూర్తయిన వరకు రోడ్డు నిర్మాణానికి సంబంధించిన టెండర్లు పిలిచేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం కోరనుంది. అలాగే, దక్షిణభాగానికి సంబంధించి ఖరారు చేసిన అలైన్‌మెంట్‌ను ఆమోదించాలని విజ్ఞప్తి చేయనుంది. కాగా, ఈ సమావేశంలోనే మన్ననూర్- శ్రీశైలం రహదారి, ఫ్యూచర్‌సిటీ-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే అలైన్‌మెంట్లను కేంద్ర అధికారులకు వివరించనుంది. వీటికి అవసరమైన భూ సేకరణ, ఇతర అంశాలపై చర్చించి, ఒక నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది.

రోడ్ల అభివృద్ధి దిశగా చర్యలు

రాష్ట్రంలోని రహదారులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పని చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి, ఉన్నతీకరణకు చర్యలు తీసుకుంటున్నాం. అదే సమయంలో ఇతర రాష్ట్రాలను కలిపేలా మరిన్ని రోడ్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం.ఫ్యూచర్‌సిటీ-అమరావతి, మన్ననూర్-శ్రీశైలం మార్గాలపైనా ప్రత్యేక దృష్టి పెట్టాం. హైదరాబాద్-విజయవాడ హైవేను 6వరుసలుగా విస్తరించేందుకు డీపీఆర్ పనులు నడుస్తున్నాయి.

\- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

తెలంగాణలో 'భారత్ ఫ్యూచర్ సిటీ'!

అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యుత్తమ నగరం.. దేశ భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లుగా నిర్మాణం

- మొదటి దశలో 30 వేల ఎకరాల్లో 9 జోన్లతో ఏర్పాటు
- పబ్లిక్ అఫైర్స్ ఫోరమ్ సదస్సులో సీఎం రేవంత్ వెల్లడి
- ప్రపంచ ఆర్థిక సదస్సు అధ్యక్షుడు, న్యూజెర్సీ గవర్నర్, పారిశ్రామికవేత్తలతో చర్చలు



సీఎం రేవంత్‌తో సమావేశమైన న్యూజెర్సీ గవర్నర్ ఫిల్ మర్ఫీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత దేశ భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లుగా 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అది అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రణాళికాబద్ధమైన అత్యుత్తమ నగరంగా విలసిల్లుతుందన్నారు. శుక్రవారం ఢిల్లీలో పబ్లిక్ అఫైర్స్ ఫోరమ్ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. మొదటి దశలో 30 వేల ఎకరాల్లో 9 జోన్లలో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని, ఏఐ సిటీ, హెల్త్ జోన్, విద్యాజోన్ మొదలైనవి ఇందులో ఉంటాయని చెప్పారు. విమానాశ్రయంతో భారత్ ఫ్యూచర్ సిటీని అనుసంధానం చేస్తామన్నారు. మచిలీపట్నం ఓడరేవు అనుసంధానానికి ఫ్యూచర్ సిటీ నుంచి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను, సమాంతరంగా రైల్వేలైన్‌ను మంజూరు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు. సదస్సులో ఆయన ప్రపంచ ఆర్థిక సదస్సు అధ్యక్షుడు బ్రెండే, న్యూజెర్సీ గవర్నర్ మర్ఫీతో సహా పలు కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమల యజమానులతో కీలక చర్చలు జరిపి.. వారిని రాష్ట్రంలో పెట్టుబడులకు, అభివృద్ధికి తోడ్పాటునందించాల్సిందిగా కోరారు. దేశంలో యువ రాష్ట్రమైన తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి విజన్-2047ను రూపొందించామని, 2025 డిసెంబరు 9న తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను వెల్లడిస్తామని అన్నారు. తెలంగాణను కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ అర్బన్‌గా విభజించామని తెలిపారు. కోటి మందికి పైగా నివసించే కోర్ అర్బన్ ఏరియాలో ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను నగరం వెలుపలికి తరలిస్తామని, సెమీ అర్బన్ ఏరియాను మాన్యుఫ్యాక్చర్ రంగానికి కేటాయిస్తామని చెప్పారు.

ట్రంప్ నిర్ణయాలతో అమెరికాకే నష్టం..

హైదరాబాద్‌లో ఇప్పటికే 70 కిలోమీటర్లు ఉన్న మెట్రోను 150 కిలోమీటర్లకు పొడిగిస్తామని, మూసీ పరివాహక ప్రాంతాన్ని సబర్మతి తీరంలా మారుస్తామని సీఎం రేవంత్ అన్నారు. హైదరాబాద్‌లో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం చేపడుతున్నామని, 2027 నాటికి నగరంలో ఎలక్ట్రిక్ వాహనాలే ఎక్కువ ఉండబోతున్నాయని చెప్పారు. బల్క్ డ్రగ్స్ ఉత్పత్తిలో, వ్యాక్సిన్ల తయారీలోనూ తెలంగాణ అగ్రగామిగా ఉన్న విషయాన్ని సీఎం గుర్తుచేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాల వల్ల ఆ దేశానికే నష్టమని తెలిపారు. ట్రంప్ ఒకరోజు మోదీ తన మిత్రుడు అంటారని, మరో రోజు అడ్డగోలుగా సుంకాలు వేస్తారని విమర్శించారు. తెలంగాణలో కూడా ఒక ట్రంప్ ఉండేవారని, ఆయనను ప్రజలు పక్కన పెట్టారని కేసీఆర్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. తెలంగాణను 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్నదే తన ధ్యేయమని చెప్పారు. కరువు, వరదలతోపాటు పర్యావరణ సంక్షోభాన్ని తట్టుకునే ఏకైక నగరంగా హైదరాబాద్‌ను రూపొందిస్తామన్నారు.

న్యూజెర్సీ గవర్నర్‌తో చర్చలు..

తెలంగాణ ఉజ్వల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేస్తున్న ప్రణాళికలకు తాము పూర్తి మద్దతునిస్తామని న్యూజెర్సీ గవర్నర్ ఫిల్ మర్ఫీ అన్నారు. పబ్లిక్ అఫైర్స్ ఫోరమ్ సదస్సు జరుగుతుండగానే ఆయన రేవంత్‌తో కీలక చర్చలు జరిపారు. సాఫ్ట్‌వేర్, టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, పట్టణ రవాణా, సినిమాలు తదితర రంగాల్లో పరస్పర సహకారం అందించుకునేందుకు వారు నిర్ణయించుకున్నారు. తెలంగాణ, న్యూజెర్సీ మధ్య ఎన్నో సామీప్యతలు ఉన్నాయని, రెండు రాష్ట్రాలు పెట్టుబడులు పెంచేందుకు, ఉపాధి కల్పనకు పరస్పరం దోహదం చేసుకోవచ్చని చెప్పారు. ఇరు రాష్ట్రాల అధినేతలు తమ వర్తక ప్రతినిధి వర్గాలను పంపాలని నిర్ణయించుకున్నారు. న్యూజెర్సీ ట్రైన్స్ అథారిటీ ద్వారా హైదరాబాద్ నగర ప్రజా రవాణా రంగానికి మద్దతునిస్తామని, మెట్రో నుంచి ఎంఎంటీఎస్ వరకు తోడ్పడతామని హామీ ఇచ్చారు. కాగా, ప్రిన్స్‌టన్, ఎన్‌జేఐటీ వంటి ఉత్తమ విద్యాసంస్థల క్యాంపస్‌లను తెలంగాణలో నెలకొల్పితే తాము పూర్తి మద్దతిస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. ప్రపంచ ఆర్థిక సదస్సు అధ్యక్షుడు బోర్గ్ బ్రెండేతో పీఏఎఫ్ఐ వార్షిక సదస్సులో రేవంత్ ముఖాముఖి చర్చలు జరిపారు. గత ఏడాదిగా తెలంగాణలో అసాధారణ అభివృద్ధి జరుగుతోందని, దేశంలో అత్యున్నత విజయాలు సాధించిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని రేవంత్‌తో బ్రెండే అన్నారు. వచ్చే ఏడాది దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరు కావాల్సిందిగా రేవంత్‌ను ఆహ్వానించారు.

అమెజాన్‌తోపాటు అనేక సంస్థలు..

తెలంగాణలోనే తన వ్యాపార వ్యవహారాలు నిర్వహిస్తున్న అమెజాన్ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జరిపిన చర్చల్లో మూడు కీలక నిర్ణయాలను ప్రకటించారు. తెలంగాణకు చెందిన చిన్న, మధ్యతరహా సంస్థల అమ్మకందారులకు తమ ఎగుమతుల ప్లాట్‌ఫారంపై అత్యధిక ప్రోత్సాహం కల్పిస్తామని వారు హామీ ఇచ్చారు. తెలంగాణ మహిళా పారిశ్రామికవేత్తలు కళాకార్ ద్వారా తమ ఉత్పత్తులను అమ్మేందుకు వీలు కల్పిస్తామని, గిగ్ వర్కర్లకు వంద రిలాక్సేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాగా, గోద్రెజ్ సంస్థ దాదాపు రూ.200 కోట్లతో కొత్త డైరీ పరిశ్రమను తెలంగాణలో నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. జెర్సీ క్రీమ్ బ్రాండ్ ఉత్పత్తులు ఈ ప్లాంట్‌లో తయారవుతాయని తెలిపింది.

తుమ్మిడిహెట్టి బ్యారేజీకి 5,373 కోట్లు

- లింక్-1లో బ్యారేజీ, ఇతర పనులకు కలిపి 22,210 కోట్ల వ్యయం!
- ప్రాజెక్టుకు ఇప్పటికే 7 రకాల అనుమతులు
- డీపీఆర్ తయారీకి కసరత్తు

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి రూ.5,373 కోట్లు వ్యయం అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. దీనితోపాటు లింక్-1 (తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు వరకు) కెనాల్, పంపుహౌస్, ఇతర పనులకు మరో రూ.16,837 కోట్లు అవుతాయని లెక్క వేసింది. 150 మీటర్లతో బ్యారేజీ కడితే 1,467 ఎకరాల భూమి ముంపునకు గురవుతుందని.. అదే 148 మీటర్ల ఎత్తుతో కడితే ముంపు 288.01 ఎకరాల మేర ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఇక 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే జరిగే ముంపులో 11.82 ఎకరాల అటవీ భూమి ఉంటోందని గుర్తించారు. ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకానికి సంబంధించి గత ప్రభుత్వం నిలిపివేసిన పనులు/కాంపోనెంట్లను మళ్లీ చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణం కోసం మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఎలాగైనా ఒప్పించాలని, అవసరమైతే ముంపునకు గురయ్యే 1,467 ఎకరాల భూములకు గరిష్ఠ పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకానికి సంబంధించి డీపీఆర్ తయారీ కోసం కసరత్తు ప్రారంభించింది.

ఈ ఏడాది చివరికి అందుబాటులోకి సనత్‌నగర్ టిమ్స్

- అక్టోబరు నెలాఖరు కల్లా నిర్మాణ పనులు పూర్తవ్వాలి
- అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రిని ఈ ఏడాది చివరి నాటికి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా అక్టోబరు నెలాఖరుకు నిర్మాణ పనులు పూర్తి చెయ్యాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ఈ మేరకు సనత్‌నగర్, ఎల్బీనగర్, కొత్తపేట టిమ్స్ ఆస్పత్రులు, నిమ్స్ ఆస్పత్రి విస్తరణ, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వైద్య కళాశాల నిర్మాణ పనులపై ఆర్ అండ్ బీ, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సచివాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. సనత్‌నగర్ ఆస్పత్రి నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయని, ఎల్బీనగర్ టిమ్స్ పనులు మరో 6 నెలల్లో పూర్తి అవుతాయని అధికారులు మంత్రికి వివరించారు. సనత్‌నగర్ టిమ్స్‌ను ఈ ఏడాది చివరిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించిన విషయాన్ని మంత్రి దామోదర ఈ సందర్భంగా అధికారులకు గుర్తు చేశారు. ఇరుశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి నిర్దేశిత సమయానికి పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆస్పత్రి ప్రారంభించిన రోజు నుంచే ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వీలుగా అత్యాధునిక వైద్య పరికరాలు, ఇతర సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవాలని వైద్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తుకు సూచించారు. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది నియామకం చేపట్టాలని వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరేంద్ర కుమార్‌ను ఆదేశించారు.

మద్యం స్కామ్‌లో 'గోల్డ్' కవరింగ్!

ముడుపుల సొమ్ములు మళ్లించారు

- సంబంధంలేని వ్యక్తులు, సంస్థలకు చెల్లింపులు
- షెల్ కంపెనీలతో విదేశాలకు తరలించారు
- ముడుపుల లెడ్జర్లు స్వాధీనం చేసుకున్నాం
- కీలక డాక్యుమెంట్లు, 38 లక్షల నగదు స్వాధీనం
- గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లోనూ సోదాలు జరిపాం
- తనిఖీలపై ఈడీ అధికారిక ప్రకటన

(హైదరాబాద్ - ఆంధ్రజ్యోతి)

మద్యం ముడుపులు 'బంగారుబాట' పట్టాయని నిరూపించే కీలక ఆధారాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సేకరించింది. ముడుపుల సొమ్ము కోసం వాడుకున్న షెల్ కంపెనీలు, నిందితుల దుబాయ్ లింకులను గుర్తించింది. జగన్ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్‌లో 'మనీ లాండరింగ్' కోణంలో ఈడీ తన దర్యాప్తు మొదలుపెట్టింది. గురువారం దేశవ్యాప్తంగా జరిపిన సోదాల వివరాలతో శుక్రవారం ఈడీ హైదరాబాద్ జోన్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. దీనిని రూ.4వేల కోట్ల స్కామ్‌గా పేర్కొంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తంజావూరు, సూరత్, రాయ్‌పూర్, ఢిల్లీతోపాటు ఏపీలో ఏకకాలంలో 20చోట్ల గురువారం సోదాలు జరిపినట్లు ఈడీ వెల్లడించింది. లిక్కర్ స్కామ్ ముడుపులను మళ్లించిన కంపెనీల్లో, లావాదేవీలను అతిగా చూపించిన సంస్థల్లో ఈ సోదాలు జరిపినట్లు తెలిపింది. "బోగస్ ఇన్‌వాయిస్‌లు, ట్రాన్స్‌పోర్టు చలాన్లు, నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాల వివరాలు, మద్యం ధరల పెంపుదల, ముడుపులకు సంబంధించిన డాక్యుమెంట్లు, రూ.38 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నాం. వాట్సాప్ సంభాషణలూ గుర్తించాం. పరారీలో ఉన్న నిందితుల్లో కొందరు దుబాయ్‌లో ఉన్నారు. ఇక్కడి నుంచి వారికి చేరిన కోట్లాది రూపాయల ముడుపులకు చెందిన లెడ్జర్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నాం. సీఐడీ ఎఫ్ఐఆర్, ఆ తర్వాత సిట్ దర్యాప్తు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో... రూ.4000 కోట్ల ఏపీ లిక్కర్ స్కామ్‌లో దర్యాప్తు ప్రారంభించాం. సిట్ ఎఫ్ఐఆర్ ప్రకారం... ఈ కేసులో నిందితులు కొన్ని బ్రాండ్లను చంపేశారు. మరికొన్ని బ్రాండ్లను ప్రమోట్ చేశారు. ముడుపులు ఇవ్వడానికి నిరాకరించిన మెక్‌డోవెల్, రాయల్‌స్టాగ్, ఇంపీరియల్ బ్లూ లాంటి బ్రాండ్లను తప్పించి... పెద్ద ఎత్తున ముడుపులు ఇచ్చిన కొన్ని డిస్టిలరీల బ్రాండ్లను మాత్రమే కొనుగోలు చేశారు. గతంలో లిక్కర్ ప్రొక్యూర్‌మెంట్ విధానం ఆటోమెటిడ్‌గా ఉండేది. దానిని మాన్యువల్‌గా మార్చి... ఆర్డర్ ఆఫ్ సప్లై విధానం తారుమారు చేశారు. తద్వారా ప్రతి ఇన్‌వాయిస్‌కు డిస్టిలరీల యజమానులు 15శాతం నుంచి 20శాతం ముడుపులు చెల్లించారని, ఆ సొమ్మును ప్రత్యేక పద్ధతుల్లో షెల్ కంపెనీల ద్వారా చేరాల్సిన చోటికి చేర్చారని సిట్ తన చార్జిషీట్లలో పేర్కొంది. తమకు కావాల్సిన అధికారులను కీలక స్థానాల్లో నియమించుకోవడం ద్వారా ఆర్డర్-సరఫరా-ముడుపులను ఒక పథకం ప్రకారం విదేశాలకు తరలించినట్లు సిట్ వెల్లడించింది. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి మద్యం సరఫరాదారులకు జరిగిన చెల్లింపులు చాలావరకు బోగస్‌గా గుర్తించాం. సంబంధం లేని కంపెనీలకు, వ్యక్తులకు డబ్బు మళ్లింది. వస్తువులు సరఫరా చేశారని, సేవలు అందిచారని చెబుతూ... సొమ్ములు చెల్లించారు. ఇవన్నీ బోగస్ లావాదేవీలుగా నిర్ధారణ అయ్యింది. ఉనికిలో లేని/షెల్‌కంపెనీలు/సంబంధంలేని వ్యక్తులకు సొమ్ములు చేరాయి. ఇలా అందిన ముడుపులను కొన్ని జ్యువెలరీ కంపెనీలకు మళ్లించి... బంగారాన్ని కొన్నట్లుగా చూపించినట్లు మా దర్యాప్తులో స్పష్టమైంది. వ్యాపార లావాదేవీల ముసుగులో అక్రమ సొమ్మును షెల్ కంపెనీల ద్వారా విదేశాలకు తరలించారు" అని ఈడీ వెల్లడించింది.

వెట్టి.. పరస్పర సహకారం!

- ఆదివాసీల్లో ఇదో సంప్రదాయం
- ఒక కుటుంబం కోసం ఊరంతా ఏకమయ్యే ఆచారం
- వ్యవసాయం, గృహనిర్మాణ పనుల్లో సాయం
- ఒకే ఒక్కరోజులో పనంతా పూర్తి
- పనిచేసిన వారికి మాంసం, విందు

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

వెట్టి.. అంటే సహజంగా మనకు గుర్తొచ్చేది వెట్టి చాకిరీనే. అయితే ఆదివాసీల సంప్రదాయంలో మాత్రం దీనికి పరస్పర సహకారం అని అర్థం. ఏదైనా ఒక కుటుంబానికి చెందిన వ్యవసాయం, ఇంటి నిర్మాణం వంటి పనుల్లో ఊరంతా కలసికట్టుగా పని చేయడాన్నే వెట్టిగా ఆదివాసీలు పిలుచుకుంటుంటారు. ఈ పనులకు నగదు చెల్లింపులకు బదులు విందు లేదా మాంసం పంపిణీ మాత్రమే ఉంటాయి. ఆర్థిక వనరులు అంతగా లేని ఆదివాసీ కుటుంబాలు తమ వ్యవసాయ పనులు లేదా గృహ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయడానికి 'వెట్టి'ని ఆశ్రయిస్తుంటారు. దీనికోసం గ్రామపెద్దను సంప్రదించి తన పనిని గ్రామస్థులతో పూర్తి చేయిస్తే, తాను పెంచుకుంటున్న మేకనో, కోడినో కోసి వాటాలు పంచుతామని, విందు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పుకుంటుంటారు. సదరు గ్రామపెద్ద ఆ విషయాన్ని గ్రామస్థులకు తెలియజేసి ముందుగా నిర్ణయించిన రోజున తమ సొంత పనులు మానుకొని ఆ కుటుంబం కోరిన పనిని పూర్తి చేస్తారు. ఒకవైపు పని సాగుతుండగా మరోవైపు కొందరు వ్యక్తులు వేటను కోసి వాటాలు సిద్ధం చేస్తారు. వాటిని తాటాకు దొప్పల్లో మూటకట్టి వెట్టిలో పాల్గొన్నవారిలో కుటుంబానికో దొప్ప చొప్పున అందిస్తారు. కొంత మాంసాన్ని వండి, విప్పసారా, తాటికల్లు తదితర సంప్రదాయ మత్తు పానీయాలతో చిన్నపాటి విందు కూడా ఆ యజమాని ఏర్పాటు చేస్తాడు. ఆకు దొప్పల్లో ఉంచిన అన్నం, వేట మాంసాన్ని వెట్టి పనుల్లో పాల్గొన్న వారంతా పంచుకుంటుంటారు. రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాలోని విలీన మండలాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది.


ఊరంతా కలసి వెట్టి పద్ధతిలో ఒక కుటుంబానికి చెందిన వరినాట్లు వేస్తున్న ఆదివాసీలు






యూరియా కోసం ఖమ్మం జిల్లా కారేపల్లి సొసైటీకి వచ్చిన రైతులు ; ఆదిలాబాద్ జిల్లా బేలలో రైతును కొడుతున్న పోలీసు

యూరియా కోసం పొద్దంతా నిరీక్షణ

పంపిణీ కేంద్రాల వద్ద అన్నదాతల పడిగాపులు

- ఆదిలాబాద్ జిల్లా బేలలో రైతును కొట్టిన పోలీసు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): యూరియా కష్టాల నుంచి రైతులకు విముక్తి కలగటం లేదు. సొసైటీలు, రైతు వేదికలు తదితర పంపిణీ కేంద్రాల వద్ద పొద్దంతా అన్నదాతలు పడిగాపులు కాస్తున్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలోని సహకార పరపతి సంఘ కార్యాలయంలో యూరియా కూపన్లు పంపిణీ చేస్తున్నారనే విషయం తెలుసుకుని వేలాది మంది రైతులు శుక్రవారం తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. తమకు యూరియా ఇవ్వాలని పలుమార్లు నినాదాలు చేయడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. అదే సమయంలో పరిస్థితిని పర్యవేక్షించేందుకు అక్కడికి వచ్చిన మండల వ్యవసాయ అధికారి భట్టు అశోక్‌ను రైతులు చుట్టుముట్టారు. సరిపడా యూరియా ఇవ్వాలంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో ఆయన సొమ్మసిల్లి పడిపోయారు. రైతులు ఆందోళనకు దిగి.. నినాదాలు చేయడంతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. అనంతరం పోలీసు బందోబస్తు మధ్య రైతులకు కూపన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కారేపల్లి సొసైటీ సీఈవో హనుమంతరావు మాట్లాడుతూ శుక్రవారం 4,014 మంది రైతులు రాగా కూపన్లు పంపిణీ చేశామని, కేంద్రానికి 890 బస్తాల యూరియా వచ్చిందని చెప్పారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల పంచాయతీ కార్యాలయం వద్ద అందరికీ కూపన్లు అందకపోవడంతో రైతులు అధికారులను నిలదీశారు. సరిపడా యూరియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూరియా సరఫరా చేయాలని శుక్రవారం వనపర్తి జిల్లా పానగల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రైతులు రాస్తారోకో చేశారు. భూపాలపల్లి జిల్లా కాటారం పీఏసీఎస్ గోడౌన్ ఎదుట కాటారం-మంథని రహదారిపై అన్నదాతలు బైఠాయించారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండల సొసైటీ వద్ద గంటల తరబడి క్యూలైన్‌లో ఉన్న రైతులు ఓపిక నశించి అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు పరిస్థితిని చక్కదిద్దే క్రమంలో ఓ రైతుపై చేయి చేసుకోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరం మేరకు ప్రభుత్వం యూరియా సరఫరా చేయడం లేదంటూ రైతులు ఆందోళన చేశారు.

అత్యుత్తమ సీఎండీగా బలరాం

- అవార్డు అందించిన ఏషియా పసిఫిక్ హెచ్ఆర్ఎం కాంగ్రెస్

హైదరాబాద్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి సీఎండీ ఎన్.బలరాం ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్నారు. దక్షిణాది బిజినెస్ లీడర్స్ ఆఫ్ ది ఇయర్ అవార్డు కేటగిరీలో అత్యుత్తమ సీఎండీగా బలరాంను ఎంపిక చేసిన ఏషియా పసిఫిక్ హెచ్ఆర్ఎం కాంగ్రెస్... గురువారం బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి సదస్సులో ఈ అవార్డును ప్రదానం చేసింది.

పెద్దపులి దాడిలో ఇద్దరి హతం

- చిరుతపులి దాడిలో బాలుడి మృతి
- మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో ఘటన

ఆదిలాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ సరిహద్దు ప్రాంతం మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో గురువారం పెద్దపులి వరుస దాడులు కలకలం రేపాయి. ఒకే రోజు వేర్వేరు చోట్ల జరిగిన దాడుల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. జిల్లాలోని చిమూర్‌తాలూకా మౌజాలావారి గ్రామానికి చెందిన విద్య కైలాస్ మన్రమ్ (40) అనే మహిళ, లకాపూర్ గ్రామానికి చెందిన పశువుల కాపరి సునీల్ రౌత్ (32)పై పెద్దపులి దాడి చేసి బలి తీసుకుంది. అలాగే, గడ్చిరి గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలుడిని గురువారం అర్ధరాత్రి అతని ఇంటి ఆవరణలోనే చిరుత పులి దాడి చేసి అడవుల్లోకి లాక్కెళ్లి హతమార్చింది. వరుస దాడులు చేస్తున్న వన్యప్రాణుల తీరుతో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వాటి ముప్పు నుంచి తమను కాపాడాలంటూ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

- ఐదు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని మనస్తాపం

భానుపురి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఐదు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదనే మనస్తాపంతో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. సూర్యాపేట నియోజకవర్గానికి చెందిన బచ్చలకూరి మధుసూదన్ సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరేళ్లుగా డేటా ఎంట్రీ ఆపరేటర్(ఔట్ సోర్సింగ్)గా పనిచేస్తున్నారు. తమకు జీతాలు ఇవ్వడం లేదని నాలుగు రోజులుగా సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆందోళన చేస్తున్న క్రమంలో మధుసూదన్ మనోవేదనకు గురై ఫినాయిల్ తాగాడు. జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ గడవడం లేదని తమ వద్ద ఆవేదన వ్యక్తం చేశాడని సహచర సిబ్బంది తెలిపారు. అతడిని వెంటనే 108 అంబులెన్స్‌లో జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.